www.ninadam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం 18- 12 - 2024 | సంపుటి : 21 | సంచిక : 90 | పేజీలు : 12 + 12 వెల : రూ. 7/-

Published from Vijayawada Circulated from Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## గుజరాత్‌లో రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి



**గాంధీనగర్:** గుజరాత్ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భావ్‌నగర్ జిల్లాలోని జాతీయ రహదారిపై డంపర్ ట్రక్కును ఓ ప్రైవేట్ బస్సు బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు.మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ట్రాపాజ్ గ్రామ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. భావ్‌నగర్ నుంచి మహువ వైపు వెళ్తున్న బస్సు.. డంపర్ ట్రక్కును వెనుకనుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. సుమారు 10 మంది గాయపడినట్లు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హర్షద్ పటేల్ తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

## ప్రతి రోగికి సేవ చేయడమే
# లక్ష్యం కావాలి

- విద్యార్థులు రాష్ట్రపతిని ఆదర్శంగా తీసుకోవాలి
- కష్టపడితే ఏదైనా సాధించొచ్చు : సీఎం నారా చంద్రబాబునాయుడు
- ఎయిమ్స్‌లో స్నాతకోత్సవానికి హాజరైన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము

### ఆరోగ్య భారత్ నిర్మాణంలో వైద్యులు భాగస్వామ్యం అవ్వాలి
### ఎయిమ్స్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము పిలుపు





రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం నారా చంద్రబాబునాయుడు

ప్రతీ రోగికీ సేవలందించాలని, ప్రతీ డాక్టర్ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. మంగళగిరి ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఎంబీబీఎస్ విద్యార్థులు డిగ్రీ పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాట్లాడుతూ 'యువ వైద్యులుగా మీరందరూ అత్యుత్తమ సేవలందించాలి. ఇప్పుడు డాక్టర్లు అయిన వారిలో 2/3 వంతు మహిళా డాక్టర్లు ఉన్నారు. మన భారత మహిళలు, యువతులు అన్ని రంగాలలో ఉన్నతి సాధించాలి. ఎయిమ్స్ మొదటి బ్యాచ్ గా మీరందరూ గుర్తుంటారు.

-మంగళగిరి, (నినాదం)

దేశ ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలి. పూర్తి ఆరోగ్యంపై అందరూ దృష్టి పెట్టాలి. ప్రతీరోజూ ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలి. యోగా సనాలు, ప్రాణాయామాలు.. ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడతాయి. సమయం, పరిస్థితులను బట్టి ప్రతీ మనిషి జీవనశైలి ఉండాలని అన్నారు. 'మెడికల్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ తో అందరికీ ఉపయోగపడే సేవలు వైద్యులు అందించాలి. ఆయుష్మాన్ భారత్ ద్వారా దేశ ప్రజలకు ఆరోగ్య సేవలు తేలిగ్గా అందించడమే ధ్యేయం. ప్రపంచ పటంలో భారతదేశం మెడికల్ సేవలలో అందుబాటులో ఉండే దేశంగా నిలవటానికి మన డాక్టర్ల సేవలు మరువలేనివి. ప్రతి రోగికీ సేవలందిం చాలన్నారు. ప్రతి డాక్టర్ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలి. యువ డాక్టర్లు సేవ చేయడానికే ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నా. ఆరోగ్యకరమైన, అభివృద్ధి సాధించే భారతదేశం మనందరికీ కావాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి మంగళగిరి ఎయిమ్స్ మొదటి

➤ 2వ పేజిలో..

## జమిలితో దేశాభివృద్ధికి బాటలు

### తరచూ ఎన్నికలతో ప్రజల్లో విసుగు
### మాజీ రాష్ట్రపతి కోవింద్ వ్యాఖ్య



**కోల్‌కతా:** జమిలి ఎన్నికల ద్వారా తరచూ ఎన్నికలు జరిగే అవకాశం ఉండదు కనక దేశాభివృద్ధికి దోహదపడుతుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకేసారి ఎన్నికల ప్రతిపాదన కార్యరూపం దాల్చిన తర్వాత ఎన్నికల పక్రియకు అది మరింత ఊతమిస్తుందన్నారు. తద్వారా దేశాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కోల్‌కతాలో ఓ ఆదివాసి సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ఆయన.. ఏటా ఓట్ల కోసం వచ్చే నేతలతో ఓటర్లు విసిగిపోయారని, తరచూ అటువంటి పరిస్థితి కోరుకోవడం లేదన్నారు.

2

## విజయసాయిరెడ్డి నా భార్యను లోబర్చుకున్నాడు

### న్యాయం చేయాలని లోకేశ్‌కు వినతి




**అమరావతి, (నినాదం:**
వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అక్రమాలను బయటపెట్టి.. పోరాడుతున్నందుకు తనను బదిలీ చేయించారని, తన భార్యను లోబర్చుకొని విశాఖపట్నంలో రూ.1500 కోట్ల విలువైన భూములు కొల్లగొట్టారని శాంతి భర్త మదన్ మోహన్ ఆరోపించారు. విజయసాయికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి వాస్తవాలు నిగ్గుతేల్చాలని మంత్రి నారా లోకేష్‌కు కళింగిరి శాంతి భర్త మదన్ మోహన్ విజ్ఞప్తి చేశారు. తనకు న్యాయం చేయాలని కోరారు. ఉండవల్లి నివాసంలో నారా లోకేష్ ప్రజాదర్బార్‌కు విచ్చేసిన మదన్ మోహన్... మంత్రి లోకేష్‌ను కలిసి తన గోడును వెళ్లబోసుకున్నారు. తాను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ (ఐఐపి)లో అసిస్టెంట్ డైరక్టర్‌గా పనిచేస్తున్నానని, ఎంపీ విజయసాయి రెడ్డి తన భార్య కళింగిరి శాంతిని లోబర్చుకొని విశాఖలో ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు పెద్దఎత్తున భూములు కొల్లగొట్టారని ఆరోపించారు.

## మంగళగిరి ఎయిమ్స్‌కు మరో 10 ఎకరాలు



➤ 2వ పేజిలో..

## రెండో గోదాముపై అనుమానాలు ఉన్నాయి..

### ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు



02

మచిలీపట్నం : పేర్ని నాని వ్యవహారంలో ఎలాంటి కక్ష సాధింపు చర్యలు లేవని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని స్పష్టం చేశారు. పేర్ని నానికి చెందిన రెండో గోదాములపై కూడా తమకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. గోదాముల్లో స్టాక్స్ తగ్గిందని నవంబర్ 27న మచిలీపట్నం జేఎస్ గోడౌన్స్ చెప్పిందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. మూడు వేల బ్యాగుల షార్టేజి కనబడుతుందని చెప్పిందన్నారు. గోదాముల్లో మాయమైన ధాన్యానికి ఎంత విలువైతే అంత డబ్బులు చెల్లిస్తామని పేర్ని నాని సతీమణి జయసుధ లేఖ రాశారని తెలిపారు. పేర్ని నానికి చెందిన రెండో గోడౌన్‌పై కూడా తమకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు.

## వాళ్లందరి పింఛన్లు కట్..

### నోటీసులు జారీ చేసిన ప్రభుత్వం

**అమరావతి, (నినాదం:**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పింఛన్లకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రీసెంట్‌గా రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్ట్ కింద అన్ని రకాల పింఛన్లను తనిఖీ చేశారు. అయితే కొన్ని జిల్లాల్లో అనర్హులు పెన్షన్లు తీసుకుంటున్నట్లు గుర్తించారు. అర్హత లేకపోయినా పించన్లు తీసుకుంటున్నట్లు తేలింది. దీంతో అలాంటి వారి పింఛన్లు కట్ చేయాలని ఏపీ సర్కారు డిసైడ్ అయింది. ఈ క్రమంలోనే ముందుగా వారికి నోటీసులు జారీ చేస్తోంది.

వాళ్లు సేఫ్!

అర్హత లేకపోయినా పింఛన్లు తీసుకుంటున్న వారికి ముందుగా నోటీసులు జారీ చేస్తోంది ఏపీ గవర్నమెంట్. నోటీసులు ఇచ్చి వారి నుంచి వివరణ తీసుకుంటారు అధికారులు. ఆ తర్వాత లబ్ధిదారుల వివరణలో వాస్తవం ఉంటే పింఛన్ కంటిన్యూ చేస్తారు. ఒకవేళ వివరణలో క్లారిటీ లేకపోతే మాత్రం వాళ్ల పెన్షన్ రద్దు చేస్తారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు సెర్ప్ సీఈవో వీరపాండ్యన్. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ వార్డు సచివాలయాల కార్యదర్శులకు సర్కారు నుంచి సూచనలు వెళ్లాయి.

వివరణ ఇవ్వాల్సిందే..

ఏపీ వ్యాప్తంగా అనర్హులందరికీ నోటీసులు ఇచ్చేందుకు



ప్రభుత్వం సిద్ధమవుతోంది. అర్హత లేకపోయినా పింఛన్లు తీసుకుంటున్న వారికి నోటీసులు అందనున్నాయి. పెన్షన్ పొందేందుకు ఏం అర్హత ఉందో చెబుతూ లబ్ధిదారులు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ అర్హతను నిరూపించుకోకపోతే వాళ్ల పింఛన్ కట్ అవుతుంది. నిర్దేశించిన గడువు లోపు వివరణ ఇవ్వకపోతే వాళ్ల పింఛన్‌ను హోల్డ్‌లో పెడతారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద సెర్ప్ ఆధ్వర్యంలో రీసెంట్‌గా గవర్నమెంట్ జిల్లాకో సచివాలయ పరిధిలో తనిఖీలు నిర్వహించింది. ఇందులో 563 మంది అనర్హుల్ని గుర్తించింది. వాళ్లందరికీ నోటీసులు జారీ చేయనున్నారు. వీళ్లంతా ఇచ్చే వివరణ తర్వాతే డెసిషన్ తీసుకుంటారు.

# ఏపీలో పేపర్ లీక్ కలకలం

### ఆన్‌లైన్‌లో మ్యాథ్స్ పేపర్
### అప్రమత్తమైన విద్యాశాఖ.. పరీక్ష రద్దు
### ఘటనపై విచారణ చేపట్టిన విద్యాశాఖ

రాష్ట్రంలో పేపర్ లీక్ కలకలం రేపింది. దీంతో ఆ పరీక్షను రాష్ట్ర విద్యాశాఖ రద్దు చేసింది. రద్దు చేసిన ఆ పరీక్షను ఈనెల 20 నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విద్యార్థులు ఆవేదనకు గురయ్యారు. పరీక్షా ప్రశ్నపత్రాలు యూట్యూబ్‌లో వెలుగులోకి వచ్చాయి.పదో తరగతి అర్ధ సంవత్సర (సమ్మేటివ్) పరీక్ష పేపర్లు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైయ్యాయి. దీంతో సోమవారం జరగాల్సిన మ్యాథ్స్ పరీక్ష ప్రారంభానికి గంట ముందే ఆన్ లైన్ లో ప్రత్యక్షమైంది. దీంతో పాఠశాల విద్యాశాఖ అన్ని తరగతుల పరీక్షలను రద్దు చేసింది. రీజనల్ జాయింట్ డైరెక్టర్లు (ఆర్‌జేడీ), జిల్లా విద్యా శాఖ అధికారులు (డీఈవో)లకు వాట్సాప్‌లో మెసేజ్ పంపించి పరీక్షలను నిలిపివేసింది. ఈ మేరకు రాష్ట్ర విద్యా శాఖ డైరెక్టర్ వి.విజయరామ రాజు ఆదేశాలు జారీ చేశారు.

**అమరావతి, (నినాదం:**
రాష్ట్రవ్యాప్తంగా 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించాల్సిన గణితం పరీక్షలను రద్దు చేశారు. వెంటనే తీసుకోవల్సిన చర్యలు, సమ్మేటివ్-1 మ్యాథమెటిక్స్ పరీక్షను వెంటనే వాయిదా వేయండి. ఈ మేసేజ్‌ను అన్ని స్కూల్స్‌కు పంపండి. సమాధానాలతో మ్యాథమెటిక్స్ పరీక్ష ప్రశ్నాపత్రం యూట్యూబ్‌లో సర్క్యులేట్ అవుతోంది. అలాగే వాట్సయాప్, టెలిగ్రామ్‌లోనూ కూడా సర్క్యులేట్ అవుతోంది. రాష్ట్ర స్థాయిలో దీనిని తీవ్రమైన అంశంగా తీసుకున్నాం. ఈ మెసేజ్‌ను అన్ని స్కూల్స్‌కు పంపండి. రేపటి ప్రశ్నపత్రం పంపిణీకి చాలా తీవ్రమైన చర్యలు తీసుకోండి అని మెసేజ్‌లో రాసి ఉంది. అయితే సీల్ కవర్‌లో ఎంతో పకడ్బందీగా అత్యంత రక్షణలో ఉండే పరీక్ష పత్రాలు రెండు రోజుల క్రితమే యూట్యూబ్‌లో లీకైంది. అయితే పేపర్ ఎలా లీకైందో ఇప్పటి వరకు తెలియలేదు. అయితే రద్దు చేసిన లెక్కల పరీక్షను ఈనెల 20న నిర్వహించాలని రాష్ట్ర విద్యా శాఖ అధికారులను ఆదేశించింది. పేపర్ లీక్ వ్యవహారంలో విద్యా శాఖ నిర్లక్ష్యం స్పష్టం చేస్తోంది. సీల్డు కవర్‌లో ఉంచాల్సిన పేపర్లను ఓపెన్‌గా ఉంచినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఫార్మేటివ్, సమ్మేటివ్-1 అసెస్‌మెంట్ల పరీక్ష పేపర్లు మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ (ఎంఈవో) (మండల రిసోర్సు సెంటర్ల)ల్లో భద్రపరుస్తారు. పరీక్ష జరిగిన రోజు ఉదయం సంబంధిత పాఠశాల పరీక్ష ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు వెళ్లి ఉదయం, మధ్యాహ్నం జరిగే పరీక్షా పేపర్లను ఎంఈవో నుంచి తీసుకుని తమతమ పాఠశాలకు తీసుకెళ్తారు. అక్కడ ఉపాధ్యాయుల సమక్షంలో సీలు తెరుస్తారు. ఇలా పకడ్బందీ వ్యవస్థ ఉన్నప్పుడు పరీక్ష పేపర్లు యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడం కలకలం



సృష్టించింది. డిసెంబర్ 9 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఒకటి నుంచి పదో తరగతి వరకు సమ్మేటివ్-1 పరీక్షలు జరుగుతాయని రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. అయితే వివిధ కారణాలతో పరీక్షలు డిసెంబర్ 11 నుంచి ప్రారంభమైయ్యాయి. ఇప్పటి వరకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పేపర్ల పరీక్షలు పూర్తి అయ్యాయి. మేథ్స్ పేపర్ జరగాల్సి ఉండగా దాన్ని రద్దు చేశారు. దాన్ని ఈనెల 20న (శుక్రవారం) నిర్వహించనున్నారు. అయితే పేపర్ లీక్ కావడం వ్యవహారంతో దిద్దుబాటు చర్యలకు విద్యా శాఖ ఉపక్రమించింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను భద్రపరిచేందుకు చర్యలు తీసుకుంది. ఇక నుంచి ఏ రోజుకు ఆ రోజే ప్రశ్నా పత్రాలు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ ప్రశ్నాపత్రాలకు కస్టోడియన్లగా మండల విద్యా శాఖ అధికారులు (ఎంఈవో)లు ఉంటారని రాష్ట్ర విద్యా శాఖ డైరెక్టర్ వి.విజయరామ రాజు ఆదేశాలు జారీ చేశారు.

## బియ్యం బొక్కిన వారిని వదలబోం

### పేర్ని నాని నీతులు మాని సమాధానం చెప్పాలి
### మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరిక



**అమరావతి:** పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కిన ఏ ఒక్కర్నీ వదలబోమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. మంగళారం మీడియాతో మాట్లాడుతూ.. నీతులు చెప్పే మాజీ మంత్రి పేర్ని నాని బియ్యం కుంభకోణంపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రూ.90 లక్షల విలువైన బియ్యం మాయం చేసి పారిపోయారని విరుచుకుపడ్డారు. పోయిన బియ్యానికి డబ్బులు చెల్లిస్తామని తన దోపిడీని ఒప్పుకున్నారన్నారు. గత ఐదేళ్ల పాలనలో లక్షల టన్నుల బియ్యాన్ని వైసీపీ మాఫియా బొక్కేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ ఒక దొంగల పార్టీ... వాళ్ల నాయకుడో గజదొంగ అంటూ వ్యాఖ్యలు చేశారు. తండ్రి కొడుకులు బందరు యువతను గంజాయి మత్తులో నెట్టారన్నారు. అవినీతి కోసం ఇంట్లో మహిళల్ని కూడా రోడ్డుకీడ్చడం దుర్మార్గమన్నారు. బియ్యం కుంభకోణంలో పేర్ని నాని అడ్డంగా బుక్కయ్యాడని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. కాగా.. మచిలీపట్నం గోదాంలో బియ్యం మాయం కేసులో పోలీస్, పౌరసరఫరాల శాఖల్లో కదలిక వచ్చింది. వారం రోజులుగా అజ్ఞాతంలోకి మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబ ఉంది. వారిపై పోలీసులు లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు.

## ఒకే దేశం.. ఒకే ఎన్నికల బిల్లుకు లోక్‌సభ అనుమతి



**న్యూఢిల్లీ:** 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లును జాయింట్ పార్లమెంట్ కమిటీకి పంపడానికి లోక్‌సభ అనుమతించింది. బిల్లును జేపీసీకి పంపడంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించగా అనుకూలంగా 220 ఓట్లు, వ్యతిరేకంగా 149 ఓట్లు వచ్చాయి. దాంతో బిల్లును జేపీసీకి పంపేందుకు లోక్‌సభ ఆమోదం లభించినట్లైంది. పార్లమెంట్ నూతన భవనంలో తొలిసారి ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం ద్వారా ఓటింగ్ నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అనుమానం ఉన్న వాళ్లు ఓటింగ్ స్లిప్‌లతో క్రాస్ చెక్ చేసుకునేందుకు స్పీకర్ అనుమతించారు. దేశంలో లోక్‌సభతోపాటే వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఒకేసారి ఎన్నికల నిర్వహించడం కోసం వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును తీసుకొచ్చారు. ఇది 129వ రాజ్యాంగ సవరణ బిల్లు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ ఇవాళ ఉదయం వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లుపై సంపూర్ణ అధ్యయనం కోసం జేపీసీ పంపాలని భావిస్తున్నట్లు ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనపై ఓటింగ్ నిర్వహించగా మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు వేశారు. దాంతో బిల్లును జేపీసీకి పంపేందుకు లోక్‌సభ అనుమతి లభించినట్లయ్యింది.

# ఏపీలో మరో పాలసీ ఆవిష్కరణ..

## పెట్టుబడిదారులకుబంపర్ ఆఫర్



రాష్ట్రంలో నూతన పర్యాటక పాలసీ 2024-2029ను మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. సీఐఐ, ఏపీ చాంబర్స్ ఆధ్వర్యంలో విజయవాడ హోటల్ వివంతలో జరిగిన పర్యాటక పెట్టుబడిదారుల సమావేశంలో ఆయన ఈ కొత్త పాలసీని విడుదల చేశారు. పెట్టుబడిదారులను ఆహ్వానించారు. వారి నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. నూతన పాలసీ ద్వారా పెట్టుబడిదారులకు ప్రభుత్వపరంగా ఇచ్చే ప్రోత్సాహకాలు, రాయితీలను వివరించారు. ప్రభుత్వ నుంచి ఎల్లప్పుడూ సహకారం ఉంటుందని, ఎలాంటి భయాందోళనలు అక్కర్లేదని హామీ ఇచ్చారు. పర్యాటక రంగంలో తమది సమగ్ర విధానం అని మంత్రి దుర్గేశ్ తెలిపారు. పర్యాటక రంగంలో రూ. 25,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలన్నది ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్రంలో విశాలమైన సముద్రతీరం, అద్భుతమైన చారిత్రక, వారసత్వ, ప్రకృతి సంపద, సజీవ నదులు ఉన్నాయని చెప్పారు. సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో రాష్ట్ర పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతుల కల్పనతో ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటకుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని మంత్రి దుర్గేశ్ వెల్లడించారు.

పర్యాటక రంగంలో ఏపీని దేశంలో అగ్రగామిగా నిలబెట్టాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి దుర్గేశ్ చెప్పారు. పర్యాటక రంగానికి సీఎం చంద్రబాబు పరిశ్రమ హోదా కల్పించడం శుభపరిణామమన్నారు. పర్యాటక ప్రాంతంలో పర్యాటకుడు ఐదు రోజులు ఉండే విధంగా మౌలిక వసతులు, టూరిజం సర్క్యూట్‌ల ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలో హోటళ్లలో గదుల సంఖ్యను 50,000కు పెంచేయోచన చేస్తుమన్నారు. పీపీపీ విధానంలో రూ.25000 కోట్ల పెట్టుబడులు సాధించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఒకే తరహా పర్యాటక అభివృద్ధి కాకుండా టెంపుల్, అడ్వెంచర్, ఎకో, విలేజ్, వెల్ నెస్ , అగ్రి టూరిజం తరహా పర్యాటక విధానాలు నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పర్యాటకంలో సరైన నిర్వహణ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో 3 ఎకో టూరిజం, 10 టెంపుల్, 2 బుద్దిస్ట్, 5 బీచ్, 4 రివర్, 2 క్రూయిజ్ సర్క్యూట్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో కుదేలైన పర్యాటక రంగాన్ని సరిదిద్దుతున్నామని దీమా వ్యక్తం చేశారు. పరిశ్రమలకు ఇచ్చే అన్ని రాయితీలు పర్యాటక రంగంలో అమలు చేస్తూ అభివృద్ధి చేయాలని భావిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సాస్కి పథకం ద్వారా అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులకు నిధులు విడుదల చేసిందన్నారు. పర్యాటక రంగంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని వ్యాఖ్యానించారు. పర్యాటక ప్రాజెక్టుల్లో భద్రతా చర్యలు, ప్రమాణాలు దృష్టిలో పెట్టుకొని వృద్ధి చేస్తామని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు.

## మంగళగిరి ఎయిమ్స్‌కు
# మరో 10 ఎకరాలు



**మంగళగిరి,(నినాదం):** మంగళగిరి ఎయిమ్స్ కు మరో 10 ఎకరాలను భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఎయిమ్స్ డైరెక్టర్ మరో 10 ఎకరాలు కావాలని అడగడంతో అందుకు సీఎం చంద్రబాబు నాయుడు అంగీకరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున వెంటనే ఆ భూమిని ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. గత పాలనలో నీటి కోసం మంగళగిరి ఎయిమ్స్ నిర్మాహకులు ఇబ్బంది పడ్డారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మంగళగిరి ఎయిమ్స్ దేశంలోనే నంబర్ వన్ అవడానికి, ఎలాంటి సహకారం అయినా కూటమి ప్రభుత్వం ఇస్తుందని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు 2014లో చాలా సుందరమైన ప్రదేశంలో భూమి ఇచ్చామని చెప్పారు. అమరావతికి, మంగళగిరి ఎయిమ్స్ ఒక సిగలా ఉంటుందన్నారు. ఈ దేశంలోనే మంగళగిరి ఎయిమ్స్ నంబర్ వన్ అవుతుందని ఆశిస్తున్నానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

## మాజీ మంత్రి పేర్ని నానికి బిగ్ షాక్..

### లుక్ అవుట్ నోటీసులు జారీ

మాజీ మంత్రి పేర్ని నాని కి ఊహించని షాక్ తగిలింది. ఈ మేరకు ఆయన కుటుంబంపై తాజాగా పోలీసులు దేశం విడిచి పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో పేర్ని నాని దంపతులు హైకోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్ నిన్న విచారణకు వచ్చినప్పటికీ తిరిగి 19కు వాయిదా పడింది. కాగా, మాయమైన బియ్యం విలువకు సంబంధించి జరిమానాతో కలిపి డబ్బులు కట్టాలన్న అధికారుల నోటీసుకు స్పందించిన నాని కుటుంబం తొలి విడతలో భాగంగా ఈనెల 13న రూ.కోటి విలువైన మూడు డీడీలు సమర్పించింది. సోమవారం మరో రూ.70 లక్షల డీడీలు అధికారులకు అందజేశారు. మొత్తంగా రెండు విడతల్లో కలిపి ఇప్పటి వరకు రూ.1.7 కోట్ల డీడీలు అధికారుల హ్యాండోవర్ చేశారు. అయితే, అసలు గోదాంలో ఎంత బియ్యం తగ్గిందనే దానిపై అధికారులు మరోసారి విచారణ చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే పోలీసులు పేర్ని నాని కుటుంబ సభ్యులపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించకుంది.

## ఏపీ మళ్లీ భారీ వర్షాలు..

**విశాఖపట్నం, డిసెంబర్18:** నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతోంది. ఈ అల్పపీడన ప్రభావంతో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆ క్రమంలో బుధవారం కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అయితే విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది.

ఈ అల్పపీడనం కారణంగా.. దక్షిణ కోస్తా తీరంలో గంటకు గాలులు గరిష్ఠంగా 55 కిలోమీటర్లు వేగంతో వీస్తాయని వివరించింది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. ఇక అన్ని జిల్లాల ఉన్నతాధికారులతోపాటు తూర్పు కోస్తా, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులను అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించింది. మరోవైపు భారీ వర్షాల కారణంగా.. కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను వాతావరణ శాఖ జారీ చేసింది. అలాగే కృష్ణ, బాపట్ల, ప్రకాశం, విజయనగరం జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. కోస్తాతోపాటు రాయలసీమలో మూడు రోజులు పాటు వర్షాలు కురుస్తాయని వివరించింది.

మరోవైపు పంట కోసి రైతులు పొలంలో వేసి ఉంచారు. ఇంతలో భారీ వర్షాల కురుస్తాయని వార్త కథనాల నేపథ్యంలో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇంకోవైపు కృష్ణా జిల్లాలో పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చేతికొచ్చిన పంట.. వరుణిడి పాలవుతోందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదికాక గతంలో పంట ఇన్సరెన్స్ ఉండేదని.. నేడు అది లేకుండా పోయిందని వారు చెబుతున్నారు. ఓ వేళ తుపానులు, భారీ వర్షాల కారణం పంటలు పోయినా.. ప్రభుత్వం ఇచ్చే పరిహారం గ్రామాల్లో రాజకీయం కారణంగా తమ దాకా రావడం లేదని రైతులు వాపోతున్నారు.

## వనౌటు దేశంలో భారీ భూకంపం

**7.3 తీవ్రతతో సంభవించిన భూకంపం**

**భూకంపం ధాటికి ఊగిపోయిన ఎత్తైన భవనాలు**

**భారీగా ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం**

**పోర్ట్ విల:** పసిఫిక్ ద్వీప దేశం వనౌటు ను భారీ భూకంపం కుదిపేసింది. దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న వనౌటు తీరంలో మంగళవారం ఉదయం అత్యంత శక్తిమంతమైన భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 7.3గా నమోదైంది. దేశంలోనే అతిపెద్ద నగరమైన రాజధాని పోర్ట్ విలాకు పశ్చిమాన 57 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించారు. 7.3 తీవ్రత తర్వాత ఇదే ప్రాంతంలో పలు మార్లు 5.3 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం ధాటికి ఎత్తైన భవనాలు ఊగిపోయాయి. అనేక భవనాలు, కార్లు దెబ్బతిన్నాయి. పోర్ట్ విలాలోని యూఎస్, యూకే, ఫ్రాన్స్ సహా పలు దేశాల రాయబార కార్యాలయాలు ఉన్న భవనం ధ్వంసమైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఈ భూకంపం ఘటనలో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## మహాకుంభ మేళలో శ్రీవారి నమూనా ఆలయానికి విస్తృత ఏర్పాట్లు : టీటీడీ



తిరుపతి : ఉత్తరప్రదేశ్లో ని ప్రయాగ్ రాజ్ (అలహాబాద్ )లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరుగనున్న మహాకుంభ మేళలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటుకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం టీటీడీ జేఈవో గౌతమి సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు.

శ్రీవారి ఆలయం ఏర్పాటు వల్ల ఉత్తరాది భక్తులు స్వామివారి వైభవాన్ని సంతృప్తిగా తిలకించేలా పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. 45 రోజుల పాటు సాగే మహాకుంభ మేళకు దాదాపు 2.50 ఎకరాల విస్తీర్ణంలో టీటీడీ నుంచి విస్తృత ఏర్పాట్లు చేస్తోందన్నారు. తిరుమల తరహాలో కైంకర్యాలు చేపట్టాలని ఆదేశించారు. శ్రీవారి కల్యాణోత్సవాలు, చక్రస్నానం తదితర కైంకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ఆకట్టుకునేలా విద్యుత్ అలంకరణలు, పుష్పాలంకరణలు చేపట్టాలని తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని టీటీడీకి కేటాయించిన స్థలంలో రాజీలేకుండా మెరుగైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు, కళా బృందాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

యూపీ పోలీస్ అధికారులతో టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారులు సమన్వయం చేసుకుని పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డీపీపీ సెక్రటరీ రఘునాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్, అధికారులు పాల్గొన్నారు

## పోలీస్‌స్టేషన్ ఎదుట మాజీ మంత్రి అంబటి రాంబాబు ధర్నా



**అమరావతి :** వైసీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదులపై జాప్యం చేయడాన్ని నిరసిస్తూ వైసీపీ మాజీ మంత్రి అంబటిరాంబాబు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. సోషల్‌మీడియాలో వైసీపీ నాయకులపై కూటమికి చెందిన నాయకులు అసత్యప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గత నెల 19వ తేదీన ఫిర్యాదులు ఇచ్చామని తెలిపారు.

చట్ట ప్రకారం పోలీసులు 14రోజుల్లో చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. పోలీసులు విధులు సక్రమంగా నిర్వహించాలని కోరారు. వైసీపీ ఇచ్చిన ఫిర్యాదులను పక్కన పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనిచేస్తుందా ? లేదా? అంటూ నిలదీశారు. మరో రెండురోజుల్లో తీసుకున్న చర్యలను వివరించకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కూటమి నాయకులకు ఒక న్యాయం, తమకో న్యాయమా అంటూ మండిపడ్డారు.

# ప్రతి రోగికి సేవ చేయడమే లక్ష్యం కావాలి

స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎయిమ్స్ మంగళగిరికి 10 ఎకరాల భూమి ఇస్తాము. దేశంలో ఏ ఎయిమ్స్ కు కూడా ఇలాంటి భూమి లేదు. అమరావతి భారతదేశపు భవిష్యత్ సిటీ. మంగళగిరి ఎయిమ్స్ భారతదేశంలోనే నంబర్ 1 అవుతుందని నా నమ్మకం. 960 బెడ్లతో, రూ.1618 కోట్లు ఖర్చుతో సిద్ధమైన ఆసుపత్రి.. మంగళగిరి ఎయిమ్స్ సొంతం' అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు ద్రౌపది ముర్మును ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఒక ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చి రాష్ట్రపతి కావడం ఆవిడ సాధించిన విజయంగా ఆయన పేర్కొన్నారు. కష్టపడితే ఈ ప్రపంచంలో సాధించలేనిది ఏదీలేదు అనడానికి ఆమె జీవితం ఒక ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను చూసి.. 'అవకాశం ఉంటే నాకు ఇక్కడ చదువుకోవాలని ఉంది' అంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో ఎయిమ్స్ మంగళగిరికి ఎలాంటి మౌలిక సదుపాయాల లోటు ఉండనివ్వం. కొలనుకొండ లో రీసెర్చ్ సెంటర్, ఐఐటీతో అనుసంధానించాలనుకుంటున్నామన్నారు. మెడికల్ అనేది ఇప్పుడు మెడ్ టెక్ గా మారిపోయిందని చంద్రబాబు అన్నారు. అంతకుముందు మంగళగిరి ఎయిమ్స్‌లో నిర్వహించనున్న స్నాతకోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేశారు. విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్టుకు విచ్చేసిన రాష్ట్రపతికి కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు.

# రెండో గోదాముపై కూడా అనుమానాలు ఉన్నాయి..

## ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు

ఆ ఆధారాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. పేర్ని నాని వ్యవహారంలో ఎలాంటి కక్ష సాధింపు చర్యలు లేవని ఆయన స్పష్టం చేశారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని అన్నారు. రూల్ ఆఫ్ లా ఇంప్లిమెంట్ కావాల్సిందేనని తెలిపారు. అనవసరంగా ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు ఉండవని.. తప్పు చేసిన ఎవర్నీ ఈ ప్రభుత్వం వదలదని స్పష్టం చేశారు. ప్రతి గోడౌన్‌లో ఎంత స్టాక్ ఉందో లెక్కలు తీయడం మొదలుపెట్టామని తెలిపారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సిందేనని స్పష్టం చేశారు.

పేర్ని నానికి లుక్‌అవుట్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో వైసీపీ నేతలు పరామర్శించడాన్ని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తప్పుబట్టారు. రూ.90 లక్షల విలువైన 187 టన్నుల బియ్యాన్ని పేర్ని నాని కుటుంబం తినేసిందని దుయ్యబట్టారు. అందుకే పేర్ని నాని కుటుంబమంతా పరారీలోనే ఉందని పేర్కొన్నారు. దొంగ అయిన పేర్ని నానికి పరామర్శలు విడ్డూరమని విమర్శించారు. పేదల బియ్యం నొక్కేసి పేర్ని నాని నీతి కబుర్లు చెబుతున్నారని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఆయనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండిపడ్డారు. పేర్ని నాని వ్యవహారంతో వైసీపీ మొత్తం దొంగల పార్టీనే అని అర్థమవుతుందని విమర్శించారు.

## జమిలితో దేశాభివృద్ధికి బాటలు

**తరచూ ఎన్నికలతో ప్రజల్లో విసుగు**

**మాజీ రాష్ట్రపతి కోవింద్ వ్యాఖ్య**

**కోల్‌కతా:** జమిలి ఎన్నికల ద్వారా తరచూ ఎన్నికలు జరిగే అవకాశం ఉండదు కనక దేశాభివృద్ధికి దోహదపడుతుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకేసారి ఎన్నికల ప్రతిపాదన కార్యరూపం దాల్చిన తర్వాత ఎన్నికల పక్రియకు అది మరింత ఊతమిస్తుందన్నారు. తద్వారా దేశాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కోల్‌కతాలో ఓ ఆదివాసి సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ఆయన.. ఏటా ఓట్ల కోసం వచ్చే నేతలతో ఓటర్లు విసిగిపోయారని, తరచూ అటువంటి పరిస్థితి కోరుకోవడం లేదన్నారు. జమిలి బిల్లు పార్లమెంటుకు వచ్చిన తరుణంలో కోవింద్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'జమిలి ప్రతిపాదన 2029-30లో పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చిన తర్వాత.. ఏదో ఒక ఎన్నిక కోసం ఓటర్లు ఏటా పోలింగ్ బూత్‌లకు వెళ్లాల్సిన పని ఉండదు. ఇది ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది. ప్రస్తుతమున్న జీడీపీకి అదనంగా మరో 1.5శాతం పెరుగుతుంది. ఒకవేళ ఇదే జరిగితే జీడీపీ 10శాతం పెరగడానికి ఎక్కువ సమయం పట్టదు. దాంతో ప్రపంచంలోనే మూడు, నాలుగో ఆర్థిక శక్తిగా మన దేశం నిలుస్తుంది' అని మాజీ రాష్ట్రపతి పేర్కొన్నారు.

ఎన్నికల ఈ పక్రియకు ఏకకాల ఎన్నికలు మరింత ఊతమిస్తాయని మాజీ రాష్ట్రపతి పేర్కొన్నారు. నేతలు ఏటా ఓట్లు అడగాల్సి వస్తే.. అభివృద్ధికి సంబంధించిన హామీలు ఎందుకు అమలు చేయలేదు అన్న ప్రశ్నకు ప్రజలకు సమాధానం ఇవ్వాలన్నారు. ఇలా ప్రతిసారి ఎన్నికలు జరగడం వల్ల పోలింగ్ బూత్‌లకు వెళ్లేందుకు ఓటర్లు కూడా విముఖత చూపిస్తారని చెప్పారు. జమిలి నివేదికపై మాట్లాడుతూ.. ఉన్నతస్థాయి కమిటీ ఛైర్మన్‌గా అనేక రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సంఘం అధికారులతో సమావేశమైన విషయాన్ని కోవింద్ గుర్తుచేసుకున్నారు. మొత్తంగా వీటికి సంబంధించి 18వేల పేజీల నివేదిక ప్రస్తుతం అందరికీ అందుబాటులో ఉందన్నారు. ఎలాంటి గ్రంథాలయాలకు వెళ్లకుండానే ఒకే ఒక్క మౌజ్ క్లిక్‌తో వాటన్నింటినీ చూడొచ్చున్నారు.

-----

## ఏపీలో 53 బార్ల వేలానికి రీ నోటిఫికేషన్ జారీ చేసిన ఎక్సైజ్ శాఖ



ఏపీలోని 53 బార్ల వేలం కోసం ఏపీ ప్రభుత్వం సోమవారం రాత్రి రీనోటిఫికేషన్ జారీ చేసింది. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్, ఫారిన్ లిక్కర్ అమ్మకాల అనుమతుల ఈ ఆక్షన్ కోసం ఈ రీనోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం ఈ నెల నుంచి 2025 ఆగస్టు 31వ తేదీ వరకు లీజుకు అనుమతి ఇవ్వనున్నారు.

ఈ 53 బార్ల వేలం కోసం నేటి నుంచి దరఖాస్తులకు ఎక్సైజ్ శాఖ అనుమతినిచ్చింది. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనుంది. ఈ నెల 23వ తేదీన అప్లికేషన్లను పరిశీలించనుంది. ఈ నెల 24వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాధారణ ఆక్షన్ నిర్వహించి.. సాయంత్రం 5 గంటలలోపు ఫలితాలను ప్రకటిస్తారు.

## మందేసీ... చిందేసిన ఎమ్మెల్యే

**వారం తరువాత వీడియోలు వైరల్**

**బాపట్ల:** ఓ నేత పుట్టిన రోజు వేడుకల్లో షాంపైన్ పొంగించడానికి ఎమ్మెల్యేకు ప్రొటోకాల్ గుర్తుచేసి దానిని ఓపెన్ చేసే మహద్భాగ్యం సదరు నేతకు కల్పించడం, మందేసి చిందేయడం వీటన్నింటికీ బాపట్లలోని పాండురంగాపురం బీచ్ వేదికగా నిలిచింది. ఈ నెల 11న బాపట్లకు చెందిన బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పుట్టిన రోజు కావడంతో, పదో తేదీ అర్ధరాత్రి నుంచే పాండురంగాపురం బీచ్ వేదికగా వేడుకలకు తెర తీశారు. బాపపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత అనంత వర్మతో పాటు పలువురు నేతలు, అనుచరులు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. వేడుకల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మందు గ్లాసు చేతిలో పట్టుకుని చిందేసిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో పాటు వారి మధ్య జరిగిన సంభాషణలు కూడా ప్రజల్లో చర్చకు దారి తీశాయి. వేడుకల్లో భాగంగా షాంపైన్ బాటిల్ ఓపెన్ చేసే క్రమంలో అన్నీ ఆయనే ఓపెన్ చేయాలా అని ఒకరంటే.. ప్రొటోకాల్ అని వైసీపీ నేత అనంతవర్మ అనడం, సదరు బాటిల్‌ను ఎమ్మెల్యే నరేంద్ర వర్మే ఓపెన్ చేయడం ఇవన్నీ కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పుట్టిన రోజు వేడుకలు జరిగి వారం గడిచాక అక్కడ అంతర్గతంగా జరిగిన వీడియోలు బయటకు రావడం వెనక అక్కడ వేడుకల్లో పాల్గొన్న వారే కావాలనే వీటిని బయటకు విడుదల చేశారనే అనుమానాన్ని నేతలు వ్యక్తం చేస్తున్నారు.

**సాధారణమే కానీ..**

ప్రైవేటు కార్యక్రమంగా జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో మందేయడం, చిందేయడం, మ్యూజికల్ నైట్ ఇవన్నీ కూడా సర్వ సాధారణమే. కానీ ఆ వేడుకల్లో పాల్గొన్నది ప్రస్తుతం టీడీపీ తరపున బాపట్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కావడంతో ఆ మందు, విందులపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

## జమిలి బిల్లుకు టీడీపీ మద్దతు

**ఢిల్లీ, (నినాదం):** జమిలి బిల్లుకు మంగళవారం పార్లమెంట్ సమావేశాల్లో తెలుగుదేశం పార్టీ మద్దతు తెలిపింది. జమిలీ బిల్లుకు మద్దుతు ఇస్తున్నట్లు లోక్‌సభలో తెలిపారు. జమిలి బిల్లును తదుపరి చర్చకు తీసుకోవడంపై ఇవాళ లోక్‌సభలో ఓటింగ్ ప్రక్రియ చేపట్టారు. కొత్త పార్లమెంట్ భవనంలో తొలిసారి ఓటింగ్ జరుగుతుంది. లోక్‌సభలో పూర్తి ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఓటింగ్ విధానాన్ని సభ్యులకు లోక్‌సభ సెక్రటరీ జనరల్ వివరించారు. టీడీపీ ఎంపీ, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బిల్లు ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తూ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మార్పునకు సీఎం చంద్రబాబు ఎప్పుడు ముందుంటారని తెలిపారు. జమిలీ ఎన్నికల వల్ల ఎన్నికల ఖర్చు తగ్గుతుందన్నారు. మీడియా రిపోర్టులు ఆధారంగా జనరల్ ఎన్నికలకు రూ. 6 వేల కోట్లు ఖర్చు అయ్యిందని వివరించారు. జమిలి ఎన్నికల నిర్వహణ వల్ల ఓటింగ్ శాతం ( 7శాతం) పెరుగుతుందని అన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణ వల్ల ఎన్నికల కమిషన్ ఖర్చు, రాజకీయ పార్టీల ఖర్చు తగ్గుతుందని పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానిం చారు. దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు పెట్టడం మంచిదేనని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అయితే జమిలి ఎన్నికలకు ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ విధంగా చెబితే ఆ విధంగా నడుచుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల కోసం పార్లమెంట్లో చట్టం చేయబోతోందని, దానిని అందరూ ఆమోదించాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. వన్ నేషన్ - వన్ ఎలక్షన్ బిల్లుకు టీడీపీ పార్టీ మద్దతిస్తుందని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరా యలు తెలిపారు. అభివృద్ధికి అనుకూల బిల్లు కాబట్టి మద్దతిస్తున్నామన్నారు. దేశంలో సుపరిపాలనకు ఈ బిల్లు ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. అభివృద్ధి, సుపరిపాలనపై చర్చ జరిగినప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముందుంటారని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

## జోగి రమేశ్‌తో టచ్‌లో టీడీపీ నేతలు..

**బుద్దా వెంకన్న సంచలన వ్యాఖ్యలు**



**అమరావతి, (నినాదం):** మంత్రి పార్థసారథి, టీడీపీ నేతలు కొనకళ్ల నారాయణ, గౌతు శిరీషపై మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా నూజివీడులో జరిగిన గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణలో రాసుకు, పూసుకుని తిరగడాన్ని ఆయన తప్పు బట్టారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా పని చేసిన జోగి రమేశ్.. అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయడు ఇల్లు, పార్టీ కార్యాలయంపై దాడి చేసిన ఘటనను గుర్తు చేస్తూ తనకు జరిగిన అవమానంపైనా ఆయన బుద్దా వెంకన్న తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆ సమయంలో జరిగిన వివాదం వంటి అంశాలతో కూడిన ఫోటోలను ఆయన ప్రదర్శించారు. బుద్దా వెంకన్న మాట్లాడుతూ నూజివీడులో జోగి రమేశ్ పాల్గొన్న ఘటన అందరికీ బాధ కలిగించిందన్నారు. చంద్రబాబు ఇంటి పైకి వెళ్లిన వ్యక్తి జోగి రమేశ్ అని గుర్తు చేశారు. నీచంగా దూషణలు చేసి చంద్రబాబుకు బాధ కలిగించిన వ్యక్తి జోగి రమేశ్ అని వ్యాఖ్యానించారు. అటువంటి నాయకుడితో టీడీపీ మంత్రి, నేతలు కలిసి ర్యాలీ చేయడం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. జోగి రమేష్‌తో వేదిక పంచుకున్న ఘటన చంద్రబాబు గుండెలు మీద తన్నిన విధంగా ఉందన్నారు. తమ నాయకులను తాను ఏమీ అనలేనని, కానీ అలా జరగకుండా చూసుకోవాల్సిందని బుద్దా వెంకన్న సూచించారు.

"జోగి రమేశ్‌ను మేము అడ్డుకుని ఉండకపోతే ఆరోజు చంద్రబాబు ఇంటి గేటును తాకేవాడు. అదే సమయంలో పోలీసులు మాపై దాడి చేశారు.ఆగలాటాలో నాకు ఊపిరి అందక కింద పడ్డా. చనిపోతానని అందరూ అనుకున్నారు. ఆ పక్కనే అప్పుడు గద్దె రామ్మోహన్, ఏలూరి సాంబశివరావులు కూడా ఉన్నారు. నూజివీడు ఘటన మాత్రం కరెక్ట్ కాదు. ఎలా జరిగినా... అక్కడ ఉన్న మీరు బాధ్యత వహించాల్సి ఉంది. జోగి రమేశ్‌ను చూశాక అయినా వేదిక నుంచో, ర్యాలీ నుంచో దూరంగా వచ్చేసి ఉండాల్సింది. గౌతు లచ్చన్న ఒక కుల నాయ కుడు కాదు. గౌతు శిరీష అంటే మాకు కూడా ఎంతో అభిమానం ఉంది. కానీ నిన్న జరిగిన ఘటన కారణంగా క్యాడర్ మొత్తం చాలా బాధ పడింది. పార్థసా రథి, కొనకళ్ల నారాయణ, శిరీషలు ముగ్గురూ సౌమ్యులే. కేవలం క్షమాపణ చెబితే సరిపోదు.. క్యాడర్‌కు సమాధానం చెప్పాలి." అని బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు.

## స్టెల్లా షిప్ వ్యవహారంపై
# ప్రభుత్వానికి కీలక ఆదేశాలు



**కాకినాడ :** కాకినాడ పోర్టు నుంచి స్టెల్లా షిప్ లో విదేశాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం అడ్డుకున్న విషయం తెలిసిందే. తమ బియ్యాన్ని షిప్‌లో లోడ్ చేయకుండా అడ్డుకుంటున్నారని చిత్ర, యాగీ, ఎక్స్ పోర్ట్, పద్మశ్రీ రైస్ మిల్, సూర్యశ్రీ రైస్ మిల్ యజమానులు భాస్కరరెడ్డి, గంగిరెడ్డి, విశ్వనాధ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పారా బాయిల్డ్ బియ్యాన్ని షిప్‌లో లోడ్ చేసేందుకు అనుమతి ఇచ్చేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పలు ప్రశ్నలు సంధించింది. అసలు బియ్యం రవాణాకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నిం చింది. షిప్‌లో ఉన్న బియ్యం లోడ్ చేయకుండా అడ్డుకోవడానికి ప్రభుత్వానికి ఉన్న అధికారాలు ఏంటని నిలదీసింది. పూర్తి వివరాలు సమర్పించాలని అడిషనల్ అడ్వొకేట్ జనరల్‌ను ఆదేశించింది. ఇందుకు సమయం కోరడంతో విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది.

## బియ్యం బొక్కిన వారిని వదలబోం

సోమవారం సాయంత్రం అజ్ఞాతం నుంచి పేర్ని నాని బయటకొచ్చారు. ఇంకా పేర్ని నాని సతీమణి జయసుధ అజ్ఞాతం వీడలేదు. గోడౌన్లు ఆమె పేరుతో ఉండటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం అమ్ముకున్న పేర్ని నాని అవినీతి కారణంగా ఆయన భార్య జయసుధకు తిప్పలు తప్పడం లేదు. మచిలీపట్నం జిల్లా కోర్టు, ఏపీ హైకోర్టుల్లో ముందస్తు బెయిల్ కోసం పేర్నినాని పిటీషన్లు దాఖలు చేశారు. కోర్టు నిర్ణయం వెలువడే వరకు అజ్ఞాతంలోనే భార్యను పేర్ని నాని ఉంచారు. నాలుగు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నప్పటికీ.. వారి ఆచూకీ కొనుగొనడంలో కృష్ణా పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. కొంతమంది అధికారులు, టీడీపీ నేతలు పేర్ని నానికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఈ కేసును ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.



# కేటీఆర్ మెడకు ఫార్ములా ఈ`రేస్!

సోమవారం తెలంగాణ కేబినెట్ సమావేశం ముగిసిన తరువాత మంత్రి పొంగులేటి మీడియా చిట్ చాట్ లో ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. తెలంగాణలో ఏ బాంబు పేలుతుందో త్వరలో కేటీఆర్ కు తెలుస్తుందని అనటం. దీని ద్వారా కేటీఆర్ అరెస్టు తప్పదని చెప్పకనే చెప్పారాయన. మరోవైపు, తనను ఎప్పుడు అరెస్టు చేస్తారా అని ఎదురుచూస్తున్నట్టుగా ఉంది కేటీఆర్ స్పందన. అరెస్టు చేసుకుంటే చేసుకోండి.. జైల్లో యోగా చేసుకుంటా.. తర్వాత వచ్చి పాదయాత్ర చేసుకుంటా అని. ఈ మధ్య కాలంలో జైలుకు వెళ్లిన వారంతా సీఎంలు అవుతున్నారనే సెంటిమెంట్ తనకు కూడా పని చేస్తుందని కేటీఆర్ అనుకుంటున్నారేమో తెలియదు. కానీ, ఆయన అరెస్టుకు దారితీస్తున్న ఫార్ములా ఈ`రేస్ కు సంబంధించిన కేసుతో ఇప్పుడు తెలంగాణ రాజకీయాలు హాట్ హాట్ గా సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాడుతుండగా అదే స్థాయిలో అధికార పార్టీ వైపు నుంచి రీసౌండ్ వస్తోంది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ జరుపుతామని పదే పదే చెబుతున్న కాంగ్రెస్ సర్కార్.. ఆ దిశగానే అడుగులు వేస్తోంది. ఇప్పటికే చాలా విషయాలపై ఏసీబీ విచారణ జరుగుతోంది. ఇందులో ఒకటిగా హైదరాబాద్ ఫార్ములా ఈరేసు కూడా ఒకటి. ఈ వ్యవహారం ఇప్పుడు కేటీఆర్ మెడకు చుట్టుకుంది. ఫార్ములా ఈ కార్ల రేస్ కేసులో కేటీఆర్ ను విచారించేందుకు సర్వం సిద్ధమైంది. ఆయనను ప్రాసిక్యూషన్ చేసేందుకు ఏసీబీకి అనుమతిస్తూ గవర్నర్ ఇచ్చిన లేఖపై సోమవారం కేబినెట్ భేటీలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. సీఎం రేవంత్ ఈ సమావేశంలో ఎంక్వైరీపై నిర్ణయం తీసుకు న్నారు. ఆ వెంటనే సీఎస్ శాంతి కుమారి.. గవర్నర్ నుంచి వచ్చిన పర్మిషన్ లెటర్ ను ఏసీబీకి అందజేశారు. దీంతో ఒకటి, రెండు రోజుల్లోనే కేటీఆర్?ను ఏసీబీ విచారణకు పిలిచే అవకాశం కనిపిస్తోంది. ఈ కేసులో

సంపాదకీయం

కేటీఆర్ పాత్రపై పక్కా ఆధారాలను సేకరించిన ఏసీబీ.. ఆయనను ఎంక్వైరీకి పిలవా లని ఇప్పటికే భావించింది. కానీ, కేటీఆర్ ఎమ్మెల్యే కావడంతో విచారణకు అనుమతించాలని ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ అనుమతి కోరింది. న్యాయ సలహా తీసుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. కేటీఆర్ ప్రాసిక్యూషన్ కు ఇటీవలే అనుమతి ఇచ్చారు. తాజాగా అనుమతి లేఖ కూడా అందడంతో కేటీఆర్ ను ఎంక్వైరీకి పిలిచేందుకు ఏసీబీ ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇప్పటికే ఆయన పాత్రకు సంబంధించిన ఆధారాలను సేకరించిన ఏసీబీ అధికారులు.. విచారణ సందర్భంగానే అదుపులోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన సీజన్ 9 ఫార్ములా ఈ కార్ల రేస్తో పాటు నిర్వహించాలని భావించిన సీజన్ 10 ఫార్ములా ఈ`రేస్ కు నాటి రాష్ట్ర కేబినెట్ తో పాటు నాటి సీఎం ఆమోదం లేదు. సీజన్ 9 నిర్వహణకు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం హెచ్ఎండీఏ రూ.20 కోట్లు ఖర్చు చేసింది. స్టాల్స్, ప్రచారం, సీటింగ్, వీధిదీపాల లాంటి వాటికోసం 'నెక్ట్స్ జెన్ గ్రీన్ కో' అనే ప్రైవేటు సంస్థ రూ.150 కోట్లు ఖర్చు చేసింది. ఇంకో రూ.30 కోట్లను 'హైదరాబాద్ రేసింగ్ లిమిటెడ్' ఖర్చు పెట్టింది. సీజన్? 9లో నాటి రాష్ట్ర ప్రభుత్వం, గ్రీన్ కో (నెక్ట్స్ జెన్), ఫార్ములా ఈ (ఎఫ్ఈఓ) ఉన్నాయి. ఈ సీజన్ లో నాటి రాష్ట్ర ప్రభుత్వం/ హెచ్ఎండీఏ కేవలం ఫెసిలిటేటర్ గానే ఉంది. ఫెసిలిటేటర్ గా ఉన్న ప్రభుత్వ పాత్ర.. కేవలం ఏర్పాట్లకు సహకరించడం మాత్రమే! లాభనష్టాలతో సర్కారుకు ఎలాంటి సంబంధం లేదు. ఫార్ములా ఈ`రేస్ ను ప్రమోట్ చేసిన గ్రీన్ కోకు సీజన్ 9లో చాలా నష్టం వచ్చింది. దీంతో ప్రైవేట్ ప్రమోటర్ గా ఉన్న గ్రీన్ కోను సీజన్ 10 నుంచి తప్పించి ఫార్ములా ఈ(ఎఫ్ఈఓ)తో ఒప్పందం చేసుకున్నారు. ఇక సీజన్ 10కు సంబంధించి ఫార్ములా `ఈ రేస్ అగ్రిమెంట్ కు ముందే అదీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అక్టోబర్ 2023న రూ.55 కోట్లు హెచ్ఎండీఏ చెల్లించింది. అది కూడా విదేశాల్లో ఉన్న కంపెనీకి ఆర్బీఐతో పాటు ఇతరత్రా ఎలాంటి పర్మిషన్లు లేకుండానే చెల్లింపులు చేశారు. ఏదైనా ప్రైవేట్ ఏజెన్సీ లేదా కంపెనీలతో ఇలాంటి ఈవెంట్లు నిర్వహించేముందు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవాలి. కానీ, సీజన్? 10 విషయంలో ఒప్పందం కంటే ముందే ఫండ్స్ చెల్లించే శారు. నిధులు పంపిన 18 రోజులకు అదీ ఎన్నికల కోడ్ సమయంలో ఒప్పందం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఈసీ నుంచి ఎలాంటి పర్మిషన్లు తీసుకోలేదు. ఈ ఒప్పందం వల్ల హెచ్ఎం డీఏ(రాష్ట్ర ప్రభుత్వం) పై రూ.200 కోట్ల భారం పడిరది. న్యాయ వివాదాలు వస్తే లండన్ కోర్టులో తేల్చుకోవాలనే నిబంధన ఉంది. ఎఫ్ఈఓ (ఫార్ములా`ఈ) వ్యక్తులెవరూ సెక్రెటేరియెట్ కు రాలేదు. ముఖాముఖి చర్చలు కూడా జరగలేదు. చర్చలన్నీ ఈ`మెయిల్ ద్వారానే జరిగాయి. దీంతో విదేశీ కంపెనీకి వెళ్లిన ప్రభుత్వ సొమ్ము రూ.55 కోట్లను అప్పటి స్పెషల్ సీఎస్ అర్వింద్ కుమార్ చెల్లిం చాలంటూ ప్రస్తుత ప్రభుత్వం ఆయనకు నోటీసులు పంపింది. కాగా, ఈ విషయంలో తన పాత్ర ఏమీ లేదని.. అప్పటి మంత్రి కేటీఆర్ చెప్తేనే చేశానని అర్వింద్ కుమార్ సమాధానం ఇచ్చారు. దీంతో ఈ వ్యవహారంలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఎంక్వైరీ కోసం ఏసీబీకి ఆదేశించింది. మరోవైపు, ఈ కేసు వ్యవహారంపై కేటీఆర్ పలుమార్లు స్పందించిన విషయం తెలిసిందే. ఈ`రేస్కు కోసం ప్రభుత్వం తరపున చేసిన ఖర్చు కేవలం రూ. 40 కోట్లు మాత్రమే అని? కానీ హైదరాబాద్కు వచ్చిన ప్రయోజనం రూ. 700 కోట్లు అని క్లారిటీ ఇచ్చారు. ఇదే విషయాన్ని నీల్సన్ అనే సంస్థ కూడా చెప్పిందని గుర్తు చేశారు. ఫార్ములా ఈ`రేస్, మొబిలిటీ వీక్ అనే కార్యక్రమం ద్వారా దాదాపు రూ. 2,500 కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. ఈ`రేస్ను ప్రభుత్వం తరఫున కార్యక్రమంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ను పెంచేందుకు రూ. 55 కోట్లు ఖర్చు చేశామని కూడా చెప్పుకొచ్చారు. ఇందులో అరవింద్ కుమార్ తప్పు ఏం లేదని నేను ఈ మొత్తానికి బాధ్యత తీసుకుంటానని కూడా స్పష్టం చేశారు. పురపాలక శాఖలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పురపాలక శాఖలో ఇంటర్నల్గా డబ్బు అడ్జస్ట్మెంట్ చేసుకోవచ్చని దీనికి కేబినెట్ అప్రూవల్ అవసరం లేదన్నారకు. హెచ్ఎండీఏ స్వతంత్ర బోర్డు అన్న కేటీఆర్ ఈ`రేస్ కారణంగా 49 దేశాల్లో హైదరాబాద్ పేరు తెలిసేలా చేశామన్నారు. ఈ కేసులో ఎలాంటి విచారణకైనా సిద్ధమేనంటూ కామెంట్స్ కూడా చేశారు. ఏదేమైనా ఇవాలో రేపో ..ఎప్పుడైనా కానీ కేటీఆర్ అరెస్టు మాత్రం తప్పదని అర్థమవుతోంది.

# ప్రపంచం మీద డాలర్ పెత్తనం

**అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థ ద్వారా అన్ని దేశాలకూ సౌకర్యంగా ఉండే ఒక చెల్లింపుల విధానాన్ని రూపొందించుకుని ఆ ప్రాతిపదికన వాణిజ్యాన్ని కొనసాగించవచ్చని కొంత మంది ఆర్థికవేత్తలు భావిస్తారు. కాని వాస్తవం అందుకు పూర్తి భిన్నం. పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల పెతనం మీద ఆధారపడి అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పడింది.**

ఈ ఆర్థిక, ద్రవ్యవ్యవస్థ తిరిగి అదే సామ్రాజ్యవాదానికి అండగా నిలబడుతుంది. ఈ అంతర్జాతీయ వ్యవస్థకు ఇరుసు అమెరికన్ డాలర్. ఐతే, అంతర్జాతీయ వాణిజ్యంలో పాల్గొనే వివిధ దేశాల మధ్య పరస్పరం జరిగే వాణిజ్యానికి ఈ డాలర్ పెత్తనం ప్రతిబంధకంగా ఉంటోంది. ఉదాహరణకు, 1వ దేశానికి 'క' అనే సరుకు అవసరం అనుకోండి. అది 2వ దేశం తయారు చేస్తోంది. ఈ 2వ దేశానికి 'చ' అనే సరుకు అవసరం అను కోండి. దాన్ని 1వ దేశం తయారు చేస్తోంది. అప్పుడు ఈ రెండుదేశాలూ ఆ రెండు సరుకులనూ పరస్పరం మార్పిడి చేసుకోవచ్చు కదా. కాని ప్రస్తుత అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ ప్రకారం అలా మార్పిడి చేసుకోడానికి వీల్లేదు. ఆ రెండు దేశాల వద్దా తమకు కావలసిన సరుకులను కొనుగోలు చేయడానికి సరిపడా డాలర్ నిల్వలు ఉండాలి. అలా లేకపోతే ఆ రెండు దేశాలూ తమ సరుకులను మార్పిడి చేసుకోలేవు. అంతర్జాతీయ వ్యాపారం యావత్తూ డాలర్ కరెన్సీతోనే సాగుతుంది. ఈ నిబంధన గనుక లేకపోతే చాలా దేశాలు తమ తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చుకోవచ్చు. డాలర్ మీద ఆధారపడడం అనేది తగ్గితే అది అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చేస్తుంది. విధంగా డాలర్ మీద ఆధారపడటం తగ్గితే అది అమెరికాకు అంగీకారంగా ఉండదు. ప్రపంచమంతా డాలర్ను మారకపు సాధనంగా అంగీకరించడం, డాలర్ రూపంలో నిల్వఉంటే అది బంగారపు నిల్వతో సమానం అన్న అభిప్రాయం ప్రబలంగా ఉండడం అనేది అమెరికాకు చాలా పైచేయిని కల్పిస్తుంది. అమెరికా ఇప్పుడు ఎన్నటికీ తరగని ఒక బంగారపు గని మీద దర్జాగా కూర్చుని వుంది. ఇతర దేశాలనుండి తనకు కావలసిన వనరులను అది కొనుగోలు చేయవచ్చు, సంస్థలనే కొనుగోలు చేయవచ్చు, విదేశాలలో ఎంత కావాలంటే అంత పెట్టుబడి పెట్టవచ్చు. తన విదేశీ వ్యాపారంలో లోటుగనుక ఏర్పడితే దానిని పూడ్చుకోడానికి ఎన్ని డాలర్లు కావాలంటే అన్నింటిని ముద్రించుకోవచ్చు. అలా అపరిమితమైన కొనుగోలు శక్తిని అంతర్జాతీయ వాణిజ్య రంగంలో కలిగివుండడమే కాదు. ఇతర దేశాల మెడలు వంచి అవి తన పెత్తనానికి లోబడి వుండేలా చేయడానికి కూడా డాలర్ పెత్తనం తోడ్పడుతుంది. ఆ యా దేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమ దేశాల బ్యాంకుల్లోనే భద్రపరచడం జరుగుతుంది. అందుచేత అమెరికా తనకు నచ్చిన దేశానికి కావలసినంత మేరకు డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు. తనకు నచ్చనప్పుడు ఆ దేశపు బ్యాంక్ అకౌంట్లను స్తంభింపజేసి డాలర్ల కొరతనూ సృష్టించవచ్చు. ఇరాన్ నుండి రష్యా వరకూ అనేక దేశాలు ఈ విధంగా శిక్షలు అనుభవిస్తున్నాయి. ఈ విధంగా వివిధ దేశాల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం ఈ మధ్య కాలంలో మరీ ఎక్కువైంది. దాంతో డాలర్ ప్రమేయంలేని వ్యాపారం కావాలన్న డిమాండ్ ఆ డాలర్ల కొరతను ఎదుర్కొంటున్న దేశాల నుండి పెరుగుతోంది. ప్రస్తుతం దాదాపు మూడోవంతు ప్రపంచ దేశాలు అమెరికా నుండి ఇటువంటి శిక్షలను ఎదుర్కొం టున్నాయి. అయితే ఆ విధంగా శిక్షించడానికి ఐరాస నుండి అమెరికాకు ఎటువంటి అనుమతీ లేదు. దక్షిణాఫ్రికా దేశం జాతి వివక్షతను పాటించిన కాలంలో అంతర్జాతీయ సమాజం ఆదేశాన్ని శిక్షించడానికి ఆమోదం ఇచ్చింది. అటువంటి సందర్భాలేవీ లేకపోయినా అమెరికా తన పెత్తనాన్ని చెలాయిస్తూ తనకు లొంగని దేశాల ఖాతాలను స్తంభింపజేస్తూ వాటిని ఇబ్బందులపాలు చేస్తోంది. వాటిలో మూడవ ప్రపంచ దేశాలు ఎక్కువగా ఉన్నాయి. అమెరికా కన్నెర్రకు గురైన దేశాలు ఇప్పుడు డాలర్ ప్రమేయం లేని అంతర్జాతీయ వాణిజ్యం కావాలని కోరుకుంటున్నాయి. ఇటీవల కజన్లో జరిగిన 'బ్రిక్స్' దేశాల శిఖరాగ్ర సమావేశంలో ఈ ఆకాంక్ష బలంగా వ్యక్తమైంది. పెత్తనం వల్లే ఇటువంటి ఆకాంక్షలు తలెత్తుతున్నాయని అమెరికన్ ప్రభుత్వం సైతం గుర్తించింది. అమెరికన్ ఆర్థిక శాఖ మంత్రి జేనెట్ యె`లలెన్ జులైలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ 'అమెరికా ఆంక్షలు ఎన్ని ఎక్కువ దేశాల మీద విధిస్తే అన్ని ఎక్కువ దేశాలు అమెరికన్ డాలర్ ప్రమేయం లేని వ్యాపారం కావాలని కోరుకుం టాయి.' అన్నారు. తన అడుగులకు మడుగులొత్తేలా ఒత్తిడి చేయడానికి అమెరికా ఆంక్షల బెదిరింపును వాడుకుంటోందని యె`లలెన్ చెప్పకనే చెప్పారు. అలా బెదిరింపులలకు బలౌతున్న దేశాల సంఖ్య పెరుగుతున్న సంగతినీ అంగీకరించారు. అలా ఏకపక్షంగా ఆంక్షలు విధించడం ద్వారా పెత్తనాన్ని చెలాయిం చేందుకు పూనుకోవడం వలన పరస్పర విరుద్ధ ఫలితాలు వస్తాయి. ఒకటో, రెండో దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు వాటి ప్రభావమూ గట్టిగా ఉంటుంది, ఆ ఆంక్షలు మొత్తం వ్యవస్థకూ ముప్పు తెచ్చిపెట్టవు. అదే అనేక దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు మొత్తం వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుంది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా పేదరికంలోకి దిగజారిపోతున్న దేశాల సంఖ్య పెరుగుతోంది. అందుచేత ఎదురు తిరిగే దేశాల సంఖ్య రానున్న కాలంలో ఇంకా పెరిగే అవకాశా లున్నాయి. వాటి మీద ఆంక్షలూ పెరుగుతాయి. అప్పుడు ఈ డాలర్ పెత్తనమే వద్దనే దేశాల సంఖ్యా పెరుగుతుంది. డాలర్ను అంతర్జాతీయ మారకపు సాధనంగా ఉపయోగించడం వలన అమెరికా దానిని అడ్డం పెట్టుకుని వివిధ దేశాల మెడలు వంచి వాటిపై తన పెత్తనాన్ని చెలాయించడం వల్లనే ఇలా జరుగుతోంది. అందుచేత డాలర్ మారకపు కరెన్సీగా ఉండడం అనేది అంతర్జాతీయ వాణిజ్యంలో అన్ని దేశాలకూ ప్రయోజనకరంగా ఉంటుందని ఉదారవాద ఆర్థికవేత్తలు చెప్తున్నది ఎంత డొల్ల వాదనో స్పష్టంగా తేలుతోంది. డాలర్ ఈ విధంగా పెత్తనం చెలాయించగలగడానికి ఒక కారణం 1970 దశకంలో అమెరికాకు, చమురు ఉత్పత్తి దేశాలకు నడుమ కుదిరిన ఒప్పందం. ఆ ఒప్పందాన్ని సౌదీ అరేబియా మధ్యవర్తిత్వంతో కుదుర్చుకున్నారు. దాని ప్రకారం అంతర్జాతీయంగా ముడిచమురు ధరలను డాలర్లలనో నిర్ణయిస్తారు. ఆ డాలర్లలోనే ఆ చమురు వ్యాపారం సాగుతుంది. చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలర్ ప్రాధాన్యత ఒక్కసారి పెరిగింది.

**ముడి చమురుకు ఇటువంటి ప్రాధాన్యత ఉంది కనుకనే ఇటీవల పశ్చిమ దేశాలు రష్యాపై ఆంక్షలు విధిం చాక వాటి నుండి తట్టుకోడానికి రష్యా తన ముడి చమురు కొనుగోలు చేసేవారు రూబుళ్లలోనే చెల్లింపులు చేయాలని నిబంధన విధించింది. అయితే, 1970 దశకంలో కుదిరిన ఆ ఒప్పందం ఒక్కటే డాలర్ ఆధిపత్యం నేటికీ కొనసాగడానికి కారణం కాబోదు.**

డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వ్యాపారం జరగాలన్న భావననే జేనెట్ యె`లలెన్ మొదట్లో తేలికగా కొట్టిపారేశారు. కాని ఇప్పుడు ఆమె ఆ విషయాన్ని సీరియస్గా తీసుకోవలసి వస్తోంది. ఇప్పుడు ట్రంప్ డాలర్ పెత్తనాన్ని కాదనుకుంటున్న దేశాలను బెదిరించడానికి పూనుకుంటున్నాడు. అమెరికాకు ఆ దేశాలు ఎగుమతి చేసే సరుకులపై సుంకాన్ని వందశాతం పెంచుతానంటూ రంకెలు వేస్తున్నాడు. అంటే డాలర్ పెత్తనం ఎలాగైనా కొనసాగడానికి అమెరికన్ సామ్రాజ్యవాదం తన శక్తిని వినియోగిస్తోందన్నమాట. ఇటువంటి బెదిరింపుల ప్రభావం బలంగానే ఉంటుంది. ఎందుకంటే డాలర్ ప్రమేయం లేకుండా వ్యాపారం చేసుకోవడం అనేది ఒక్క పట్టున సాధ్యపడేది కాదు. ఈలోపున అమెరికాకు ఆ దేశాలు చేసే



ఎగుమతులు కుదించుకు పోతే అప్పుడు ఆ దేశాల దగ్గరుండే డాలర్ నిల్వలు మరీ వేగంగా హరించుకుపోతాయి. అప్పుడు ఆ దేశాలు మరింతగా ఇబ్బందుల పాలౌతాయి. తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవి డాలర్ ప్రమేయం లేని వ్యాపారం ద్వారా పొందవచ్చు. కాని ఇప్పటికే ఆ దేశాలు ఐ.ఎం.ఎఫ్, లేదా ప్రపంచ బ్యాంక్ దగ్గర రుణాలు పొంది వుంటే ఆ రుణాలకు చెల్లించవలసిన వాయిదాలు డాలర్ల రూపంలోనే చెల్లించాలి. ఆ డాలర్ల నిల్వలు హరించుకుపోతే అప్పుడు ఆ దేశాలు రుణ ఎగవేతదారులుగా నిలబడవలసి వస్తుంది. దానివలన కొత్త షరతులను భరించవలసి వస్తుంది. అందుచేత ట్రంప్ ప్రకటిస్తున్న హెచ్చరికలను సీరియస్గానే తీసుకోవాలి. ఉదారవాద ఆర్థికవేత్తలు ఎంతో సౌమ్యంగా చిత్రించే సామ్రాజ్యవాదపు ఆధిపత్య రూపం కాస్తా ఇప్పుడీ ట్రంప్ బెదిరింపులతో పూర్తిగా బయటపడిపోయింది! అయితే ఈ బెదిరింపులను ఎదుర్కొనే దేశాలు డాలర్ పెత్తనం నుండి బయటపడవలసిన అవసరాన్ని మరింతగా గుర్తించడానికే ఈ బెదిరింపులు తోడ్పడతాయి. డాలర్`రహిత అంతర్జాతీయ వ్యాపారం పుంజుకోడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. ఈ సంగతి కజన్ శిఖరాగ్ర సమావేశానికీ తెలుసు. ట్రంప్ బెదిరించగానే భారత దేశంతో సహా పలు దేశాలు తమకు ఈ డాలర్`రహిత వాణిజ్యం పట్ల ఆసక్తి లేదంటూ ప్రకటించాయి. అమెరికా దృష్టిలో బుద్ధిమంతులని పించుకోడానికి ఈ ప్రకటనలు ఉపయోగపడవచ్చు. కాని అమెరికా పెత్తనానికి సవాలు తీవ్రంగానే ఎదురవుతోందన్నది మాత్రం వాస్తవం. తమ దేశాల ఆధిపత్యానికి సవాలు తీవ్రంగా ఎదురవుతోందన్న వాస్తవాన్ని గుర్తించిన పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలే కాకుండా ఆ దేశాల్లోని సోషల్ డెమాక్రటిక్ పార్టీలు సైతం ఉక్రెయిన్ విషయంలో గాని, గాజా విషయంలో గాని మరింత ఐక్యంగా వ్యవహరిస్తున్నాయి. అయితే డాలర్కు ప్రత్యామ్నాయంగా ఏ విధమైన అంతర్జాతీయ వ్యవస్థను ఏర్పరచాలన్న విషయం మీద ఇంకా బ్రిక్స్ దేశాల నడుమ ఒక స్పష్టత రాలేదు. ఇలా ఏర్పడే ఆ ప్రత్యామ్నాయ వ్యవస్థ డాలర్కు బదులు మరొక దేశపు కరెన్సీకి ఆధిపత్యాన్ని కట్టబెట్టేదిగా మాత్రం ఉండకూడదు. అలా జరగాలంటే ఇప్పుడు ఏ సూత్రాల ప్రాతిపదికపై అంతర్జాతీయ వాణిజ్యం సాగుతోందో ఆ సూత్రాలే, ఆ నియమాలే మారిపోవాలి. అంతే కాదు. అంతర్జాతీయ వాణిజ్యంలో వాణిజ్యలోటు పెరుగుతున్న దేశాల మీద ఆ లోటును భర్తీ చేసే భారాన్ని మోపే పద్ధతి కూడా మారాలి.

# లగచర్ల ఘటనలపై

**బీఆర్ఎస్ శ్రేణుల ర్యాష్ట్రవ్యాప్త ఆందోళన**

**అన్ని నియోజకవర్గాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు వినతులు**

హైదరాబాద్:

లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టి, వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించినందుకు నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు అన్ని నియోజకవర్గాల్లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అణచివేత వైఖరిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను సీఎం రేవంత్ రెడ్డి కాలరాశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి జ్ఞానోదయం కల్పించాలన్నారు. లగచర్ల గిరిజన రైతులపై అక్రమ కేసులు బనాయించి ముఖ్యమంత్రి విలాసవంతమైన టూర్లలో పాల్గొంటున్నారని విమర్శించారు. గిరిజన రైతులకు బెయిల్ రాకుండా కోర్టులో అడ్డుకుంటున్నారని, ఛాతీనొప్పి వచ్చినా చేతులకు బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్లే పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసేవరకు బీఆర్ఎస్ నాయకులు వెంటపడి నిలదీస్తామన్నారు.

# ఇళ్లు కూల్చారు సరే...

**మరీ ఇఎంఐలు ఎవరు కడతారు..? : ఎమ్మెల్సీ కవిత**

**కొద్దిగా మానవత్వాన్ని చాటుకోండి**

హైదరాబాద్ :

కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొట్టిన ఇండ్లకు బ్యాంకు నుంచి అప్పులకు ఇఎంఐలు ఉంటే సీఎం రేవంత్రెడ్డి కడతాడా అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. మూసీ అభివృద్ధి కోసం మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా డీపీఆర్ చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు శాసనమండలిలో ప్రస్తావించగా.. ఎమ్మెల్సీ కవిత పలు అంశాలపై ప్రశ్నలు సంధించారు. మూసీ నది విషయంలో డీపీఆర్ ఆధారంగా అంచనా వ్యయాలు ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ రూ. 4100 కోట్లు కావాలని ప్రపంచ బ్యాంకును ప్రభుత్వ ఆశ్రయించినట్లు మాకు నిర్దిష్టమైన సమాచారం ఉంది. ప్రపంచ బ్యాంకును ప్రభుత్వం ఆశ్రయించిన విషయం వాస్తవమా కాదా..? డీపీఆర్ తయారు కాలేదని ప్రభుత్వం ఈ రోజు సభకు చెప్పింది. ఏ తేదీన ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సాయం కోరుతూ ప్రతిపాదనలు పంపించింది. మూసీ కోసం రూ. 14,100 కోట్ల వ్యయం అవుతుందని, నిధులతో పాటు అనుమతులు ఇప్పించాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఏ ప్రాతిపదికన అడిగారు. ఒక వేళ కేంద్రాన్ని సాయం కోరడం, ప్రపంచ బ్యాంకు సాయం కోరడం వాస్తవమైతే సభను, ప్రజలను



ఎందుకు తప్పుదోవపట్టిస్తున్నారు..? సభను తప్పుదోవ పట్టిస్తే అవసరమైతే ప్రివిలేజ్ మోషన్ను ప్రవేశపెడుతాం అని కవిత హెచ్చరించారు. మూసీ నదిగర్భంలో నివసించే 309 కుటుంబాలు వాళ్లంతట వాళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారని ప్రభుత్వం చెబుతుందన్నారు. కానీ హృదయవిదారకమైన వీడియోలను చూస్తే ప్రభుత్వం చెబుతున్నది అవసస్తవమని స్పష్టమవుతుందని అన్నారు. ఆ 309 కుటుంబాలు సమ్మతిస్తూ ఏవైనా పత్రాలపై సంతకాలు చేసి ఉంటే అవి సభకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 181 కుటుంబాలు తామంతట తామే కూల్చేసుకొని వెళ్లిపోయారని ప్రభుత్వం చెబుతోందని, ఇది వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉందన్నారు. మూసీ నిర్వాసితుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలి అని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ కవిత సూచించారు.

# జనసేనలోకి మంచు మనోజ్, మౌనిక?

మంచు కుటుంబ తగాదాలో కొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. మోహన్ బాబు చిన్న కొడుకు మంచు మనోజ్, ఆయన భార్య మౌనిక రాజకీయ రంగ ప్రవేశానికి సర్వం సిద్ధమైనట్టు ప్రచారం చక్కర్లు కొడుతోంది. ఈ పొలిటికల్ అరంగేట్రానికి ఆళ్లగడ్డ వేదిక కానున్నట్టు సమాచారం. సోమవారం, మాజీ ఎమ్మెల్యే శోభానాగిరెడ్డి జయంతి. ఈ సందర్భంగా ఆళ్లగడ్డలో వేడుకల్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మనోజ్, మౌనిక దంపతులకు ఆహ్వానం వెళ్లింది. అయితే వీరిద్దరూ ఏకంగా వెయ్యి కార్లతో భారీ ర్యాలీగా వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అనంతరం, భూమా ఘాట్ నుంచి రాజకీయ ఆరంగేట్రంపై ప్రకటన చేస్తారని చర్చ నడుస్తోంది. అందులో భాగంగా తమ బలం నిరూపించుకునేందుకు ఇలా ర్యాలీగా వస్తున్నారనే సమాచారం. భూమా కుటుంబంలో ప్రస్తుతం టీడీపీ నుంచి నాగిరెడ్డి పెద్ద కూతురు అఖియప్రియ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. అయితే, అఖిలప్రియతో ఉన్న కొన్ని ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాల నేపథ్యంలో మౌనిక.. జనసేన వైపు చూస్తున్నారనే టాక్ నడుస్తోంది. ఈ కారణంగానే జనసేనలో చేరుతున్నట్టు వార్తలు వినిపిస్తుయి. జనసేనలో ఉంటే టికెట్ కూడా దక్కే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇక, మౌనిక పొలిటికల్ ఎంట్రీపై మనోజ్ గతంలోనే కీలక కామెంట్స్ చేశారు. అంతకుముందు తిరుమల దర్శనానికి వెళ్లిన సమయంలో మనోజ్ మాట్లాడుతూ.. మౌనిక రాజకీయాల్లోకి వెళ్లితే కచ్చితంగా తన మద్దతు ఉంటుందన్నారు. ఇదే సమయంలో తనకు మాత్రం రాజకీయాల్లోకి వచ్చే ఆసక్తి లేదన్నారు. రాజకీయాల్లోకి రాకపోయినప్పటికీ ప్రజలకు సేవ చేయాలనే కోరిక మాత్రం తనకు ఉందన్నారు. నిజానికి, భూమా కుటుంబం రాజకీయాల్లో ఎప్పటి నుంచో ఉంది. భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డిలు కర్నూలు జిల్లా రాజకీయాల్లో కీలక నేతలు.. వారి మరణం తర్వాత భూమా నాగిరెడ్డి పెద్ద కుమార్తె అఖిలప్రియ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆమె 2014 ఎన్నికల్లో వైఎస్సార్సీపీ తరపున ఆళ్లగడ్డ నుంచి పోటీచేసి విజయం సాధించారు. తండ్రి నాగిరెడ్డి నంద్యాల నుంచి పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఇద్దరు టీడీపీలో చేరగా.. కొంతకాలానికి నాగిరెడ్డి మృతి చెందారు. ఇక, భూమా జగత్విఖ్యాత్ రెడ్డి కూడా రాజకీయాల్లో ఉన్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల బాధ్యతల్ని భూమా కుటుంబమే చూసుకుంటోంది. ఇప్పుడు భూమా మౌనిక పొలిటికల్ ఎంట్రీపై చర్చ జరుగుతోంది. ఇదిలా వుండగా, తన పొలిటికల్ ఎంట్రీపై జరుగుతున్న ప్రచారంపై మనోజ్ స్పందించారు. ప్రస్తుతానికి ఏమీ మాట్లాడలేనని అన్నారు. అత్త గారి జయంతి నాడు మొదటిసారి తమ కూతురు దేవసేన శోభను ఆళ్లగడ్డ తీసుకొచ్చామని, జయంతి రోజు తీసుకొద్దామనే ఇన్నాళ్లూ ఇక్కడకు తీసుకురాలేదు. తమ కుటుంబం, సోదరులు, స్నేహితులతో కలిసి ఇక్కడకు వచ్చాన



న్నారు. కానీ రాజకీయాల్లోకి రావటాన్ని మాత్రం కొట్టిపారేయలేదు. కాబట్టి, మనోజ్ మౌనిక పొలిటికల్ ఎంట్రీ ఖాయమనే అనుకోవచ్చు.

## ఎంపీ విజయసాయిరెడ్డి నా భార్యను లోబర్చుకున్నాడు

### న్యాయం చేయాలని ప్రజాదర్బార్‌లో లోకేశ్‌కు వినతి




**అమరావతి :** వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అక్రమాలను బయటపెట్టి.. పోరాడుతున్నందుకు తనను బదిలీ చేయించారని, తన భార్యను లోబర్చుకొని విశాఖపట్నంలో రూ.1500 కోట్ల విలువైన భూములు కొల్లగొట్టారని శాంతి భర్త మదన్ మోహన్ ఆరోపించారు. విజయసాయికి డిఎన్ఎ పరీక్షలు నిర్వహించి వాస్తవాలు నిగ్గుతేల్చాలని మంత్రి నారా లోకేష్‌కు కళింగిరి శాంతి భర్త మదన్ మోహన్ విజ్ఞప్తి చేశారు. తనకు న్యాయం చేయాలని కోరారు. ఉండవల్లి నివాసంలో నారా లోకేష్ ప్రజాదర్బార్‌కు విచ్చేసిన మదన్ మోహన్... మంత్రి లోకేష్‌ను కలిసి తన గోడును వెళ్లబోసుకున్నారు. తాను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ (ఐఐపి)లో అసిస్టెంట్ డైరక్టర్‌గా పనిచేస్తున్నానని, ఎంపీ విజయసాయి రెడ్డి తన భార్య కళింగిరి శాంతిని లోబర్చుకొని విశాఖలో ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు పెద్దఎత్తున భూములు కొల్లగొట్టారని ఆరోపించారు.

## బియ్యం బుక్కిన వారిని వదలబోం

### - పేర్ని నాని నీతులు మాని సమాధానం చెప్పాలి
### - మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరిక



**అమరావతి:** పేదల బియ్యాన్ని పందికొక్కులా బుక్కిన ఏ ఒక్కర్నీ వదలబోమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. మంగళారం మీడియాతో మాట్లాడుతూ.. నీతులు చెప్పే మాజీ మంత్రి పేర్ని నాని బియ్యం కుంభకోణంపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రూ.90 లక్షల విలువైన బియ్యం మాయం చేసి పారిపోయారని విరుచుకుపడ్డారు. పోయిన బియ్యానికి డబ్బులు చెల్లిస్తామని తన దోపిడీని ఒప్పుకున్నారన్నారు. గత ఐదేళ్ల పాలనలో లక్షల టన్నుల బియ్యాన్ని వైసీపీ మాఫియా బొక్కేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ ఒక దొంగల పార్టీ... వాళ్ల నాయకుడో గజదొంగ అంటూ వ్యాఖ్యలు చేశారు. తండ్రి కొడుకులు బందరు యువతను గంజాయి మత్తులో నెట్టారన్నారు. అవినీతి కోసం ఇంట్లో మహిళల్ని కూడా రోడ్డుకీడ్చడం దుర్మార్గమన్నారు. బియ్యం కుంభకోణంలో పేర్ని నాని అడ్డంగా బుక్కయ్యా డని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. కాగా.. మచిలీపట్నం గోదాంలో బియ్యం మాయం కేసులో పోలీస్, పౌరసరఫరాల శాఖల్లో కదలిక వచ్చింది. వారం రోజులుగా అజ్ఞాతంలోకి మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబ ఉంది. వారిపై పోలీసులు లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. సోమవారం సాయంత్రం అజ్ఞాతం నుంచి పేర్ని నాని బయటకొచ్చారు. ఇంకా పేర్ని నాని సతీమణి జయసుధ అజ్ఞాతం వీడలేదు. గోడౌన్లు ఆమె పేరుతో ఉండటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం అమ్ముకున్న పేర్ని నాని అవినీతి కారణంగా ఆయన భార్య జయసుధకు తిప్పలు తప్పడం లేదు. మచిలీపట్నం జిల్లా కోర్టు, ఏపీ హైకోర్టుల్లో ముందస్తు బెయిల్ కోసం పేర్నినాని పిటీషన్లు దాఖలు చేశారు. కోర్టు నిర్ణయం వెలువడే వరకు అజ్ఞాతంలోనే భార్యను పేర్ని నాని ఉంచారు. నాలుగు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నప్పటికీ.. వారి ఆచూకీ కొనుగొనడంలో కృష్ణా పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. కొంతమంది అధికారులు, టీడీపీ నేతలు పేర్ని నానికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఈ కేసును ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.

## గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### ట్రక్కును ఢీకొన్న ప్రైవేట్ బస్సు - ఆరుగురు మృత్యువాత

**గాంధీనగర్:** గుజరాత్ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. భావ్‌నగర్ జిల్లాలోని జాతీయ రహదారిపై డంపర్ ట్రక్కును ఓ ప్రైవేట్ బస్సు బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ట్రాపాజ్ గ్రామ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. భావ్‌నగర్ నుంచి మహువ వైపు వెళ్తున్న బస్సు.. డంపర్ ట్రక్కును వెనుకనుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. సుమారు 10 మంది గాయపడినట్లు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హర్షద్ పటేల్ తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

# ప్రతి రోగికి సేవ చేయడమే లక్ష్యం కావాలి

- ఆరోగ్య భారత్ నిర్మాణంలో వైద్యులు భాగస్వామ్యం అవ్వాలి
- ఎయిమ్స్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము పిలుపు




**మంగళగిరి:** ప్రతీ రోగికీ సేవలందించాలని, ప్రతీ డాక్టర్ సేవకే ప్రాధా న్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. మంగళగిరి ఎయిమ్స్ మొదటి స్నాత కోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఎంబీబీఎస్ విద్యార్థులు డిగ్రీ పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాట్లాడుతూ 'యువ వైద్యులుగా మీరందరూ అత్యుత్తమ సేవలందించాలి. ఇప్పుడు డాక్టర్లు అయిన వారిలో 2/3 వంతు మహిళా డాక్టర్లు ఉన్నారు. మన భారత మహిళలు, యువతులు అన్ని రంగాలలో ఉన్నతి సాధించాలి. ఎయిమ్స్ మొదటి బ్యాచ్‌గా మీరందరూ గుర్తుం టారు. దేశ ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలి. పూర్తి ఆరోగ్యంపై అందరూ దృష్టి పెట్టాలి. ప్రతీరోజూ ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలి. యోగాసనాలు, ప్రాణాయా మాలు.. ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడతాయి. సమయం, పరిస్థితులను బట్టి ప్రతీ మనిషి జీవనశైలి ఉండాలని అన్నారు. 'మెడికల్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ తో అందరికీ ఉపయోగపడే సేవలు వైద్యులు అందించాలి. ఆయుష్మాన్ భారత్ ద్వారా దేశ ప్రజలకు ఆరోగ్య సేవలు తేలిగ్గా అందిం చడమే ధ్యేయం. ప్రపంచ పటంలో భారతదేశం మెడి కల్ సేవలలో అందుబాటులో ఉండే దేశంగా నిలవ టానికి మన డాక్టర్ల సేవలు మరువలేనివి. ప్రతి రోగికీ సేవలందించాలన్నారు. ప్రతి డాక్టర్ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలి. యువ డాక్టర్లు సేవ చేయడానికే ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నా. ఆరోగ్యకరమైన, అభివృద్ధి సాధించే భారతదేశం మనందరికీ కావాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి మంగళగిరి ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎయిమ్స్ మంగళగిరికి 10 ఎకరాల భూమి ఇస్తాము. దేశంలో ఏ ఎయిమ్స్‌కు కూడా ఇలాంటి భూమి లేదు. అమరావతి భారత దేశపు భవిష్యత్ సిటీ. మంగళగిరి ఎయిమ్స్ భారతదేశంలోనే నంబర్ 1 అవుతుందని నా నమ్మకం. 960 బెడ్లతో, రూ.1618 కోట్లు ఖర్చుతో సిద్ధమైన ఆసుపత్రి.. మంగళగిరి ఎయిమ్స్ సొంతం' అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు ద్రౌపది ముర్మును ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచిం చారు. ఒక ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చి రాష్ట్రపతి కావడం ఆవిడ సాధించిన విజయంగా ఆయన పేర్కొన్నారు. కష్టపడితే ఈ ప్రపంచంలో సాధించలేనిది ఏదీలేదు అనడానికి ఆమె జీవితం ఒక ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రకమంలో పాల్గొన్న విద్యా ర్థులను చూసి.. 'అవకాశం ఉంటే నాకు ఇక్కడ చదువుకోవాలని ఉంది' అంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో ఎయిమ్స్ మంగళగిరికి ఎలాంటి మౌలిక సదుపాయాల లోటు ఉండనివ్వం. కొలను కొండలో రీసెర్చ్ సెంటర్, ఐఐటీతో అనుసంధానించాల నుకుంటున్నామన్నారు. మెడికల్ అనేది ఇప్పుడు మెడ్ టెక్‌గా మారిపోయిందని చంద్రబాబు అన్నారు. అంతకుముందు మంగళగిరి ఎయిమ్స్‌లో నిర్వహించనున్న స్నాతకోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేశారు. విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్టుకు విచ్చేసిన రాష్ట్రపతికి కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్చం అందజేసి సాదర స్వాగతం పలికారు.



# తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు

- జనవరి 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనం
- ప్రత్యేక టిక్కెట్లు కేటాయించాలని టిటిడి నిర్ణయం
- అధికారులతో సమీక్షించిన ఇవో శ్యామలరావు



**తిరుమల:** శ్రీవారి ఆలయంలో వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 19 వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపై తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్యతో కలిసి అన్నమయ్య భవన్‌లో సమీక్ష నిర్వహించారు. అన్ని విభాగాల అధిపతులతో చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. 23న ఉదయం 11 గంటలకు వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి 10 రోజుల శ్రీవాణి టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 24న ఉదయం 11 గంటలకు వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి 10 రోజుల ఎస్‌ఈడీ టోకెన్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. జనవరి 10 నుంచి 19 వరకు 10 రోజులకు వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి తిరుపతిలో 8 కేంద్రాలు, తిరుమలలో ఒక కేంద్రంలో సర్వదర్శనం టోకెన్లు కేటాయింపు చేస్తారు. తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి, జీవకోన, రామానాయుడు స్కూల్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్, తిరుమలలోని కౌస్తుభం విశ్రాంతి భవనంలో టోకెన్ల కేటాయింపు ఉంటుంది. టోకెన్ జారీ కేంద్రాల వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సీఈకి ఆదేశం ఇచ్చారు. టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే దర్శనాలకు అనుమతి. టోకెన్లు లేని భక్తులను దర్శన క్యూలైన్లలోకి అనుమతించరు. వైకుంఠ ఏకాదశి రోజు ఉదయం 4.45 గంటలకు ప్రొటోకాల్ దర్శనాలు ప్రారంభం చేస్తారు. వైకుంఠ ఏకాదశి రోజు అధిక రద్దీ కారణంగా ఆలయంలో వేదాశీర్వచనం రద్దు చేశారు. వైకుంఠ ఏకాదశి రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్వర్ణరథంపై స్వామిని ఊరేగిస్తారు. వైకుంఠ ద్వాదశి రోజున ఉదయం 5.30 నుంచి 6.30 వరకు శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం ఉంటుంది. గోవిందమాల భక్తులకు ఎలాంటి ప్రత్యేక దర్శన సదుపాయం ఉండదు. వైకుంఠ ఏకాదశి రోజున తితిదే సెక్యూరిటీ సిబ్బంది సమన్వయంతో తిరుమలలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచనలు ఇచ్చారు. ఉదయం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు నిరంత రాయంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేయాలని కేటరింగ్ అధికా రులకు ఆదేశం ఇచ్చారు. టీ, కాఫీ, పాలు, ఉప్మా, చక్కెర పొంగ లి, పొంగలి పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. లడ్డూ ప్రసాదం కోసం భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ప్రతిరోజూ అందుబాటులో 3.50 లక్షల లడ్డూలు. అదనంగా 3.50 లక్షల లడ్డూలు బఫర్ స్టాక్ ఉంచుకోవాలని ఆదేశించారు.

## టీడీపీలోకి మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని !

### సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరే అవకశం



**అమరావతి:** వైసీపీ మాజీ నాయకుడు, మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని రాజకీయం యూటర్న్ తీసుకుంది. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో ఏలూరు నుంచి పోటీ చేసి ఓడిపోయిన నాని.. ఇక రాజకీయాలకు దూరంగా ఉంటానని చెబుతూ. ఎన్నికలు జరిగిన రెండు మాసాలకే సంచలన ప్రకటన చేశారు. ఇదే సమయంలో వైసీపీకి కూడా ఆయన రాజీనామా చేశారు. అయితే.. అనుకున్నట్టుగా అయితే.. ఆయన వ్యవహరించలేదు. మళ్లీ రెండు మాసాలు ముగిసే సరికి యూటర్న్ తీసుకున్నారు. తాజాగా టీడీపీలోకి ఆళ్లనాని ఎంట్రీ ఇవ్వనున్నారు. బుధవారం సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్టు నాని వర్గం చెబుతోంది. దీనిపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా మౌనంగా ఉన్నారు. వాస్తవానికి గత నెలలోనే నాని టీడీపీలోకి వస్తున్నట్టు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కానీ, ఆయన రాలేదు. దీనికి కారణం.. స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆళ్ల వ్యవహారంపై ఆగ్రహంతో ఉండడమే. వైసీపీ హయాంలో టీడీపీ నాయకులపై ఆయన కేసులు పెట్టించారన్న వాదన ఉంది. దీంతో ఆళ్ల నాని సైకిల్ ఎక్కేందుకు స్థానిక నాయకులతోపాటు.. ఎమ్మెల్యే బడేటి చంటి కూడా.. వ్యతిరేకించారు. ఈ క్రమంలో కొన్నాళ్లపాటు ఆళ్ల నాని మౌనంగా ఉన్నారు. ఇక, ఇటీవల సీఎం చంద్రబాబు రంగం లోకి దిగి..అందరూ కలిసిమెలిసి పనిచేయాలని, పార్టీ నాయకులకు సర్దిచెప్పారని, పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండాలని ఆయన ఆదేశించారు. దీనికి దాదాపు నాయకులు ఓకే చెప్పడంతో ఇప్పుడు ఆళ్ల నాని టీడీపీ ఎంట్రీకి ఇబ్బందులు లేకుండా పోయాయని తెలుస్తోంది. కాపు సామాజిక వర్గానికి చెందిన ఆళ్ల నాని వివాద రహితుడుగా వ్యవహరించిన మాట వాస్తవం, రాష్ట్రంలో కరోనా వచ్చినప్పుడు ఆయనే ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నారు. సమర్థవంతంగా పనిచేశారని.. కేంద్రంతో నూ మెప్పు పొందారు. ఆ తర్వాత.. తన సొంత నియోజకవర్గంలో గాలి కలుషితమై..పలువురు మృతి చెందిన ఘటన సమయంలోనూ మంత్రిగా ఆళ్ల నాని పలు చర్యలు తీసుకున్నారు. అయితే.. రెండున్నరేళ్ల తర్వాత.. తన సేవలను గుర్తించకుండా.. జగన్ పక్కన పెట్టి.. విడదల రజనీకి ఈ బాధ్యతలు అప్పగించడంతో ఆళ్ల నాని అప్పటి నుంచి వైసీపీపై ముభావంగా ఉన్నారు. తొలుత జనసేన లోకి వెళ్లాలని అనుకున్నా.. పవన్ కల్యాణ్ సూచనలతో టీడీపీ వైపు మొగ్గు చూపినట్టు కొన్నాళ్లుగా ప్రచారం జరుగుతోంది. ఎట్టకేలకు ఆళ్లనాని రాజకీయంలో కీలక మలుపు అయితే చోటు చేసుకుంటోంది. దీనిని ఆయన ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్తారో చూడాలి.

## ఏపీలో డోలీల మోతకు చెక్ పెట్టేందుకు పవన్ ప్రయత్నాలు

### గిరిజన గ్రామాలకు కూడా పక్కా తారు రోడ్లు కేటాయింపు



**అమరావతి:** చంద్రయాన్ ప్రయోగం విజయవంతంగా పూర్తి చేసిన దేశంగా భారత్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అదే సమయంలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సేవలు లేని దేశంగా కూడా విమర్శలు ఎదుర్కొంటోంది. ఆ కోవలోనే ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవల కోసం డోలీలే గిరిజనులకు గతి. అయితే, గిరిజనులకు ఆ దుస్థితి తప్పించేందుకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నడుం బిగించారు. ఏపీలో డోలీల మోతకు చెల్లుచీటీ పాడేందుకు పవన్ ప్రయత్నాలు మొదలుబెట్టారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలలోని మారుమూల గిరిజన గ్రామాలకు కూడా పక్కా తారు రోడ్లు నిర్మించేందుకు ఏపీ సీఎం చంద్రబాబుతో పవన్ చర్చలు జరిపారు. అందుకు చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. తొలి దశలో ఆ జిల్లాల్లో 9 రోడ్ల నిర్మాణం జరపాలని అధికారులకు చంద్రబాబు, పవన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన రహదారులకు గిరిజన గ్రామాల రహదారులను అను సంధానించేందుకు దాదాపు 50 కోట్ల రూపాయల విలువైన పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం తాజా నిర్ణయంతో గిరిజను లకు డోలీ మోత నుంచి త్వరలోనే విముక్తి లభించనుంది. సరైన రహదారి లేక వాగులు, వంకలు దాటుకుంటూ కాలినడకన డోలీలో రోగులను మోసుకువెళుతున్న క్రమంలో ఎంతో మంది గిరిజనులు సకాలంలో వైద్యం అందక మృతి చెందిన ఘట నలు అనేకం ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 499 గిరిజన గ్రామా లకు రహదారి సౌకర్యం లేదు. ఈ నెల 20న పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన గ్రామంలో రోడ్ల పనులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. రాబోయే ఐదేళ్లలో అన్ని గిరిజన గ్రామాలకు రోడ్లు వేయాలన్న లక్ష్యంతో చంద్రబాబు, పవన్ ముందుకు వెళుతున్నారు.

# కూటమి మంత్రుల పనితీరుపై నివేదిక సిద్ధం

- మంత్రుల పనితీరుపై సీఎం చంద్రబాబు నివేదిక
- 100 రోజుల పనితీరుపై ఆరా
- పెద్దగా ఫోకస్ చేయని శాఖల గుర్తింపు



**అమరావతి:** కూటమి ప్రభుత్వంలో మంత్రుల పనితీరుపై సీఎం చంద్ర బాబు నివేదిక రెడీ చేసుకున్నారని సమాచారం. సచివాలయంలో ఏ శాఖ ఉన్నతాధికారిని కలిసినా.. నివేదిక రెడీ అయిందనే చెబు తున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో కూటమి సర్కారు ఏర్పడిన తర్వాత.. 100 రోజుల్లోనే మంత్రులకు సంబంధించిన నివేదికను విడుదల చేస్తామని.. మంత్రుల పనితీరుపై మధనం చేస్తామని అప్పట్లో చంద్రబాబు చెప్పారు. అయితే.. 100 రోజుల సమ యంపై మంత్రులు ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలు కుప్పకూలాయని మీరే చెబుతున్నారు.. ఇప్పుడు వాటిని సరిదిద్దేం దుకు తమకు కూడా సమయం ఇవ్వాలని వారు అభ్యర్థించారు. ఈ క్రమంలోనే చంద్రబాబు.. 6 మాసాల గడువు ఇచ్చారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో మరోసారి ప్రోగ్రెస్ రిపోర్టుపై చర్చ సాగింది. దీనిపై పలువురు మంత్రులకు చంద్రబా బు సూచనలు కూడా చేశారు. ఎట్టి పరిస్థితిలోనూ ప్రోగ్రెస్ రిపో ర్టును విడుదల చేయాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు. దీనికి సంబంధించి గడువు కూడా విధించారు. ఈ క్రమంలోనే తాజాగా మంత్రుల పనితీరుపై నివేదిక రెడీ అయిం దని సమాచారం. దీనిలో మంత్రులు నారా లోకేష్, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి, నారాయణలు ముందు జాబితాలో ఉండగా.. తర్వాత వరుసలో కొలుసు పార్థసారథి, బీసీ జనార్ధన్‌రెడ్డి, మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఉన్నట్టు తెలిసింది. ఇక, పెద్దగా ఫోకస్ చేయని శాఖలుగా.. కూడా కొన్ని ఉన్నాయని తెలుస్తోంది. వీటిలో కార్మిక శాక ముందు వరుసలో ఉన్నట్టు సమాచారం. ఇటీవల కాలంలో మంత్రి సుభాష్ అనేక ఆరోపణలు ఎదుర్కొం టున్న నేపథ్యంలో సహజంగానే ఆయన చివరి వరుసలో ఉంటారని అందరూ అనుకున్నారు. కానీ, ఆయన కన్నావెనుక బడిన ఓ మంత్రి ఉన్నారని.. ఆయన సీనియర్ నాయకుడు, గతం లోనూ మంత్రిపదవిని అలంకరించారని చెబు తున్నారు. ఇక, మహిళా మంత్రుల్లో సవిత దూకుడుగా ఉన్నట్టు ముఖ్యమంత్రి భావిస్తున్నారు. దీంతో మహిళా మంత్రుల్లో ముగ్గు రిలో సవిత తొలిజాబితాలో ఉండడం గమనార్హం. ఈ నివేదికను సంక్రాంతికి ముందే విడుదల చేయనున్నట్టు పార్టీ వర్గాలు కూడా చెబుతున్నాయి.

# మందేసీ... చిందేసిన ఎమ్మెల్యే

## వారం తరువాత వీడియోలు వైరల్




**బాపట్ల:** ఓ నేత పుట్టిన రోజు వేడుకల్లో షాంపైన్ పొంగించడానికి ఎమ్మెల్యేకు ప్రొటోకాల్ గుర్తుచేసి దానిని ఓపెన్ చేసే మహద్భాగ్యం సదరు నేతకు కల్పించడం, మందేసి చిందేయడం వీటన్నింటికీ బాపట్లలోని పాండురంగాపురం బీచ్ వేదికగా నిలిచింది. ఈ నెల 11న బాపట్లకు చెందిన బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పుట్టిన రోజు కావడంతో, పదో తేదీ అర్ధరాత్రి నుంచే పాండురంగాపురం బీచ్ వేదికగా వేడుకలకు తెర తీశారు. బాపపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత అనంత వర్మతో పాటు పలువురు నేతలు, అనుచరులు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. వేడుకల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మందు గ్లాసు చేతిలో పట్టుకుని చిందేసిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో పాటు వారి మధ్య జరిగిన సంభాషణలు కూడా ప్రజల్లో చర్చకు దారి తీశాయి. వేడుకల్లో భాగంగా షాంపైన్ బాటిల్ ఓపెన్ చేసే క్రమంలో అన్నీ ఆయనే ఓపెన్ చేయాలా అని ఒకరంటే.. ప్రొటోకాల్ అని వైసీపీ నేత అనంతవర్మ అనడం, సదరు బాటిల్‌ను ఎమ్మెల్యే నరేంద్రవర్మే ఓపెన్ చేయడం ఇవన్నీ కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పుట్టిన రోజు వేడుకలు జరిగి వారం గడిచాక అక్కడ అంతర్గతంగా జరిగిన వీడియోలు బయటకు రావడం వెనక అక్కడ వేడుకల్లో పాల్గొన్న వారే కావాలనే వీటిని బయటకు విడుదల చేశారనే అనుమానాన్ని నేతలు వ్యక్తం చేస్తున్నారు. సాధారణమే కానీ.. ప్రైవేటు కార్యక్రమంగా జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో మందేయడం, చిందేయడం, మ్యూజికల్ నైట్ ఇవన్నీ కూడా సర్వ సాధారణమే. కానీ ఆ వేడుకల్లో పాల్గొన్నది ప్రస్తుతం టీడీపీ తరపున బాపట్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కావడంతో ఆ మందు, విందులపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

# సరిహద్దు ప్రాంతాల్లో పశువులపై దాడి చేసిన పెద్దపులి

**మణుగూరు, డిసెంబర్ 17(నినాదం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములుగు జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో పులి సంచారాన్ని అటవీ శాఖ అధికారులు, ప్రజలు గుర్తించారు. సరిహద్దు ప్రాంతాల్లో సంచరిస్తున్న పులి ఆవుపై దాడి చేసి చంపేసిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. దీంతో సరిహద్దు లో ఉన్న ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలు భయంతో వణికి పోతున్నారు. ఈ సందర్భంగా మణుగూరు డిఎఫ్ఓ సయ్యద్ మహమ్మద్ మోహినిద్దీన్ తెలిపిన వివరాలు ప్రకారం...... చత్తీస్గఢ్ రాష్ట్రం నుంచి రత్నగిరి టైగర్ జోన్ నుంచి వచ్చినట్లుగా వారి దర్యాప్తుల ప్రకారం వెల్లడైంది. పులి ఎక్కువగా చలి ఉన్న ప్రాంతాల్లో ఉండేందుకు ఇష్టపడదని అది కేవలం వెచ్చగా ఉండే ప్రదేశాల్లో సంచరిస్తుందని ఆయన తెలిపారు. దానిలో భాగంగానే చతిస్గడ్ రాష్ట్రం నుంచి గోదావరి దాటి తెలంగాణ రాష్ట్రంలో ములుగు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సరిహద్దు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పులి అడుగులను బట్టి చతురస్రాకారంలో అడుగులు ఉంటే ఆడపిల్లగా గుర్తిస్తామని, నాలుగు పలకలుగా ఉన్న పాద గుర్తులు బట్టి ఇది మగపులిగా గుర్తించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కానీ వాస్తవంగా ఈ పులులు గత ఏడాదే డిసెంబర్ నెలలోని తెలంగాణ రాష్ట్రంలోకి రెండు ఆడ పులులు మగపులి ప్రవేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు పులి సమాచారాన్ని డిపార్ట్మెంట్ పరంగా బయటకు వెల్లడించలేదని ఆయన తెలిపారు. పులులు ఉన్నాయని ముందుగానే



ప్రకటిస్తే వాటిపై స్మగ్లర్లు కన్ను పడే అవకాశం ఉండటంతో ఈ సమాచారాన్ని రహస్యంగా ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ పులులకు కావలసిన ఆహారము దట్టమైన అడవి ప్రాంతంలో లభిస్తుందని ఇవి మైదాన ప్రాంతాలకు వచ్చే అవకాశం లేదని ఆయన తెలిపారు. ఒకవేళ పశువుల కాపరులు మేకలు గొర్రెలు కాపర్లు దట్టమైన అడవిలోకి వెళితే పులి నుంచి ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఒకవేళ పులి బారిన పడి పశువులు కానీ మేకలు గాని మనుషులు గాని ప్రాణాలు పోతే ప్రభుత్వ పరంగా నష్టపరిహారం చెల్లించేందుకు అటవీశాఖ సిద్ధంగా ఉందని అని తెలిపారు. పులులను చంపే అవకాశం ఉందని దీనిపై ఇప్పటికే స్మగ్లర్లు కన్ను వేసినట్లు మాకు సమాచారం అందిందని ఆయన పేర్కొన్నారు. పులులకు నష్టం చేకూర్చితే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. పులులకు విష మందులు కలిపి పెట్టడం గాని మరే ఇతర ప్రయోగాలు చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పులి సంచరించే ప్రాంతాలను గుర్తించామని వాటికి రెండు కిలోమీటర్ల దూరంలోని మేమంతా తిరుగుతున్నామని పులి రక్షణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. పులులు తమ యధా స్థానానికి వెళ్లేంతవరకు నిత్యము సంరక్షణ కార్యక్రమాలు చేపడుతూనే ఉంటామని సయ్యద్ అహ్మద్ మోహినిద్దీన్ తెలిపారు.



## లగచర్ల ఘటనపై భగ్గుమన్న బీఆర్ఎస్ పార్టీ

● అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన



**మణుగూరు, డిసెంబర్ 17( నినాదం న్యూస్) :** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లగచర్ల గటనపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో బి ఆర్ ఎస్ పార్టీ బగ్గుమంది. రైతుల చేతులకు బేడీలు వేయడం వాళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంపై మంగళవారం మణుగూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో నిరసన ఆందోళన నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలు ర్యాలీగా నిరసన తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ లగచర్లలో జరిగిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష పూర్వకంగా పూర్తిస్థాయి విచారణ చేపట్టకుండానే అమాయక రైతులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన ఆరోపించారు. సంఘటనలో పాల్గొన్నా రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చేతులకు బేడీలు వేసి నడిపించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి వ్యతిరేకంగా రైతులు సామాన్య ప్రజలు నిరసన వ్యక్తం చేసేందుకు వచ్చిన ప్రజలపై ధమనకాండ సృష్టించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం త్వరలో మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన ఆరోపించారు. లఘు చర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ మరి కొంతమంది ఉన్నత అధికారులు చర్యలను నిరసిస్తూ రాజ్యాంగబద్ధంగా నిరసన వ్యక్తం చేసిన రైతులపై రాష్ట్ర ప్రభుత్వం దాడులు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమేనని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్య బద్దంగా నిరసన వ్యక్తం చేసే రైతులను కటకటాల పాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి రావాలని అంబేద్కర్ సాక్షిగా నిరసన వ్యక్తం చేస్తూ పూలమాలలు వేశారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై అమానుషంగా ప్రవర్తించే కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రతి ఒక్కరు ఎండగట్టాలని అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అడవి రామవరం గొత్తికోయలో మెగా వైద్య శిబిరం

● వలస ఆదివాసీలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

● జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**ఆళ్లపల్లి, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** ఆళ్లపల్లి మండల పరిధిలోని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న దట్టమైన అడవి ప్రాంతం మధ్యలో గిరిపుత్రులు నివసించే గ్రామం అడవి రామవరం ఆదివాసి గిరిజనుల కోసం సరైన రహదారి మార్గం లేకపోవడంతో మర్కోడు నుంచి టూ వీలర్ ద్విచక్ర వాహనాలపై సైతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఇల్లందు డిఎస్పి చంద్రబాను సూచనలతో ఉమ్మడి గుండాల మండల పోలీసుల ఆధ్వర్యంలో అడవి రామవరం ఆదివాసి గొత్తి కోయ గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గొత్తి కోయ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముందస్తుగా గ్రామ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. తదనంతరం గ్రామ ప్రజలకు ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్, గుండాల పోలీసు వారి సహకారంతో దుప్పట్లు, సోలార్ లైట్లు,35 కుటుంబాలకు బియ్యం నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ... చతిస్గడ్ రాష్ట్రం నుండి వలస వచ్చి కొన్నేళ్లుగా నివాసముంటున్న ఆదివాసీలకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. జిల్లాలలోని మారుమల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే వలస ఆదివాసి ప్రజల అభివృద్ధి కోసం పోలీస్ శాఖ ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ కృషి చేస్తుందని తెలిపారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని జిల్లా యంత్రాంగం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. గ్రామంలోని యువత పిల్లలు మంచిగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించి మెరుగైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఘనంగా ఏర్పాటు చేసిన గుండాల సీఐ రవీందర్, టేకులపల్లి సిఐ సురేష్, ఎస్సైలు రాజమౌళి, రతీస్, శ్రీకాంత్ పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి గిరి పుత్రులకు వైద్య సేవలు అందించడానికి వచ్చిన ప్రభుత్వ వైద్యురాలు సంఘమిత్ర, సుదీప్ బృందానికి ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ సభ్యులు సోందు పాషా ప్రత్యేకంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి. సాయి మనోహర్, వైద్య సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్ పార్వతి, ఏఎన్ఎం సుగుణ, హెల్త్ అసిస్టెంట్ రాఘవులు, బిక్షం, నాగేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● చేవెళ్ల మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు కర్నె శివప్రసాద్



**చేవెళ్ల, డిసెంబర్ 17(నినాదం న్యూస్):** పదవ తరగతిలో విదర్తులు ఉత్తమ ఫలితాలను సాధించాలని చేవెళ్ల మండల ప్రజా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు కర్నె శివప్రసాద్ అన్నారు.మంగళవారం చేవెళ్ల మండలంలోని ఊరెళ్ళా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు 14 వేల రూపాయల విలువైన స్టడీ మెటీరియల్ ను గ్రామ మాజీ సర్పంచ్ మహమ్మద్ జహంగీర్ తో కలిసి అందజేశారు.మార్చి 2025లో జరగబోయే 10వ తరగతి పబ్లిక్ పరిక్షత్ లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. గ్రామ మాజీ సర్పంచ్ మహమ్మద్ జహంగీర్ మాట్లాడుతూ పదో తరగతి భవిష్యత్తుకు పునాది లాంటిదని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇప్పటినుండి దాన్ని చేరుకోవడానికి కృషి చేయాలని సూచించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ప్రతిరోజు స్నాక్స్ అందజేయాలని ప్రధానోపాధ్యాయులను కోరారు. పరీక్షలు పూర్తయ్యే వరకు అవసరమయ్యే ఖర్చును తామిద్దరు కలిసి భరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు కృష్ణ ప్రకాష్ రెడ్డి ఉపాధ్యాయులు మహమ్మద్ అక్బర్, రాఘవేందర్, నర్మదా సుహాసిని, ప్రసన్నలక్ష్మి, వల్లి కుమారి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి, గ్రామ మాజీ ఉపసర్పంచ్ సునిగంటి విట్టలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**ఆళ్లపల్లి, డిసెంబర్ 17 (నినాదం న్యూస్)**



అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన పరమ రమేష్ (38) అప్పుల బాధతో గత బుధవారం క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి యత్నించాడు. కొత్తగూడెం, ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం చికిత్స అందించినప్పటికీ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి తన స్వగృహంలో మృతి చెందారు. స్థానిక ఎస్సై రతీస్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం దర్యాప్తు చేపట్టారు.

## కన్నీటి వీడ్కోలు



**మహేశ్వరం, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం గ్రామ కి చెందిన మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ పితృ యోగం జంగయ్య యాదవ్ (88) కొంతకాలం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న స్థానిక తలకొండపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, అమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సి వెంకట్ రెడ్డి మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్ మూర్తి అంబాజీ వెంకటాపూర్ మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్ మాజీ ఉపసర్పంచ్ సీనియర్ నాయకులు అంజయ్య గౌడ్ తిరుపతిరెడ్డి కృష్ణయ్య గౌడ్ దశరథ్ మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అబ్బాస్ యువనాయకులు రాజు ఎండి జాఫర్ విష్ణు అహ్మద్ ఎండి సయ్యద్ ఎస్ శ్రీనివాసులు కాంగ్రెస్ నాయకులతో కలిసి వారి కుటుంబసభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాయకులు కార్యకర్తలు సభ్యులు యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

● ముఖ్యఅతిథిగా హాజరైన పున్నారెడ్డి



**కుత్బుల్లాపూర్ డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం 125 డివిజన్ చిత్తరామ దేవి నగర్ లో రాజ్ కుమార్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ సమస్త మానవాళి శాంతి సోదర భావంతో జీవించాలని క్రీస్తు జీవిత చరిత్ర నిదర్శనంగా నిలిచిందన్నారు. క్రైస్తవ సోదరులందరూ ఐకమత్యంతో సమన్వయంతో ఉండి వారి సమస్యలు పరిష్కరించుకునేలా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తరామ దేవి నగర్ కాలనీ ఉపాధ్యక్షులు వెంకట్ స్వామి,వెంకట్ రామ్ రెడ్డి, ప్రమోద్, కాంగ్రెస్ నాయకులు మార్లింగా, పవన్, అన్వర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

### కంపెనీలో వాటా కోసం

# ఎస్సీ, ఎస్టీల భూములకు ఎసరు పెట్టిండ్లు

● తమ్ముడికి 50శాతం వాటాకు
● దక్కన్ సిమెంట్ కంపెనీకి భూముల రిజిస్ట్రేషన్
● ఎమ్మార్వోతో రహస్యంగా 200 ఎకరాల భూములు రిజిస్ట్రేషన్ చేయించిన మంత్రి
● భూమాతలో కాస్తు కాలం... కబ్జా కాలం వస్తుందనే మంత్రి ముందస్తు ఆలోచనలు
● కబ్జాలో ఉన్న రైతుల పేర్ల మీదనే రిజిస్ట్రేషన్లు చేయాలి
● మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం న్యూస్):** నలభై ఏండ్లు ఓట్లు వేసి మంథని ఎమ్మెల్యేకు అధికారం అప్పగిస్తే తన కుటుంబానికి ఓ కంపెనీలో వాటా కోసం ఓట్లు వేసిన ఎస్సీ, ఎస్టీల భూములకే ఎసరు పెట్టారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మంగళవారం పలిమెల మండలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2008 డిసెంబర్లో పలిమెలకు సంబంధం లేని కమాలొద్దీన్ అనే వ్యక్తిని సృష్టించి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురి నాయకుల పేర్లపై సుమారు 300 ఎకరాల ఎస్సీ, ఎస్టీ భూములను రిజిస్ట్రేషన్ చేయించారని ఆయన వివరించారు. రామగిరి, ముత్తారం మండలాలకు చెందిన వనం రాంచందర్‌రావు, సదానందంలాంటి సుమారు 30మంది కాంగ్రెస్ నాయకులకు ఎమ్మార్వో రహస్య ప్రదేశంలో రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. 2008లో భూములు రిజిస్ట్రేషన్ అయిన వెంటనే కాస్తులోకి కాంగ్రెస్ నాయకులు రాగానే రైతులు అడ్డుకున్నారని, అప్పటి నుంచే తమ భూములు తమకు ఇప్పించాలని అధికారులకు దరఖాస్తులు ఇస్తున్నారని అన్నారు. ఆ భూములు మావే, మాకే చెందాలని రైతులు ఆందోళనలు చేస్తున్న క్రమంలో ఈనాడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి దక్కన్ సిమెంట్ కంపెనీలో తన తమ్ముడికి 50శాతం వాటా కోసం సుమారు 200ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించాడని ఆయన తెలిపారు. అయితే ఈ విషయం వెలుగులోకి రాగానే భూముల రిజిస్ట్రేషన్‌పై విచారణ చేయాలని మంత్రి ఆదేశాలు ఇచ్చినట్లు చెబుతున్నారని, అయితే ఆ విచారణకు సదరు ఎమ్మార్వోనే విచారణ అధికారిగా నియమించడం విడ్డూరంగా ఉందన్నారు. తప్పు చేసిన అధికారినే విచారణ చేసుకోమనడం ఎక్కడా చూడలేదన్నారు. మంథని ఎమ్మెల్యేకు పరిశ్రమల శాఖ మంత్రి పదవి వచ్చిందని, మా ప్రాంతానికి పరిశ్రమలు వస్తాయని, ఉద్యోగాలు ఇప్పిస్తారని ఈ ప్రాంత ప్రజలు ఆశపడ్డారని, కానీ ఎస్సీ, ఎస్టీల భూములను ఓ కంపెనీకే దారాదత్తం చేయాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. అంతే కాకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధరణిని భూమాతగా మార్చి అందులోకాస్తు, కబ్జా కాలం పెడుతుందని ముందే తెలిసిన మంత్రి కబ్జా కాలంలో రైతుల పేర్లు ఉంటే ప్రమాదమని గ్రహించి ఎమ్మార్వోను ఆదేశించి ఓ రహస్య ప్రదేశంలో రిజిస్ట్రేషన్‌లు చేయించారని ఆయన ఆరోపించారు.

గతంలో పలిమెల ప్రాంతంలో వరదలు రావడం, ఓసారి అగ్నిప్రమాదం జరుగడంతో రైతులకు ఇచ్చిన తోక పాసుబుక్కులు పోయాయని ఆయన గుర్తు చేశారు. మంత్రి కుటుంబానికి కంపెనీలో వాటా కోసమే ఎస్సీ, ఎస్టీల భూములు అప్పగించాడని, వెంటనే ప్రభుత్వం ఈ విషయంలోప్రత్యేక చొరవ తీసుకుని విచారణ జరుపడంతో పాటు రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలని, కబ్జాలో ఉన్న పాత రైతులపేర్లపైనే రిజిస్ట్రేషన్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పలిమెల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి, రాష్ట్ర యువజన నాయకుడు జక్కు రాకేష్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీత, కాటారం, మహదేవపూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జోడు శ్రీనివాస్, లింగపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పంతకాని సడవలి, నాయకులు ప్రకాష్, నరివెద్ది శ్రీనివాస్, రాకేష్, కుమ్మరి సారయ్య, రాజబాబు పాల్గొన్నారు.

# మాకు ఇసుక ర్యాంపు ఇవ్వండి

● 329 మంది సిర్రాజు సొసైటీ సభ్యుల విన్నపం
● మేమంతా వేరే సొసైటీలో సభ్యులమనే దుష్ప్రచారం తగదు
● అధికారులు విచారణకు వస్తే మా బలం నిరూపిస్తాం
● సొసైటీ అధ్యక్షురాలు తెల్లం కౌశల్య



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి (నినాదం న్యూస్):** చర్ల మండలం కొయ్యూరు గ్రామపంచాయతీ పరిధిలోని 4 గ్రామాల నుంచి 329 మంది సభ్యులు కలిగిన సిర్రాజు సొసైటీకి ఇసుక ర్యాంపు మంజూరు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తాము ఇసుక ర్యాంపు పొందడానికి అన్ని రకాల అర్హతలు కలిగి ఉన్నామని స్పష్టం చేశారు. ఆ మేరకు సొసైటీ సభ్యురాలైన చెర్ల మాజీ జడ్పిటిసి ఇర్పా శాంతతో కలిసి సిర్రాజు సొసైటీ అధ్యక్షురాలు తెల్లం కౌసల్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తమ సొసైటీకి ఎక్కువ మంది సభ్యులు లేరని కొంతమంది గిట్టని వాళ్లు పని కట్టుకొని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తమ సొసైటీలో 329 మంది గిరిజన మహిళ సభ్యులు ఉన్నారని, వారంతా ఇసుక ర్యాంపు కావాలని ముక్తకంఠంతో కోరుతున్నారని తెలిపారు. చీమలపాడు రెవిన్యూ విలేజ్ కాదని కొన్నాళ్లు, తమ పరిధి గోదావరిలో అసలు ఇసుకే లేదని ఇంకొన్నాళ్ళు, తామంతా వేరే సొసైటీలో సభ్యులుగా ఉన్నామని మరికొన్నాళ్లు రకరకాల దుష్ప్రచారం చేస్తూ తమకు ఇసుక ర్యాంపు రాకుండా కొన్ని దుష్టశక్తులు పని గట్టుకొని అడ్డుపడుతున్నాయని ఆరోపించారు. ఇందులో ఇతర ఇసుక ర్యాంపుల రేజింగ్ కాంట్రాక్టర్ల హస్తము ఉందనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి ఉండే గిరిజన గ్రామాల ప్రజల నడుమ చిచ్చుపెట్టే ఎత్తుగడలు మానుకోవాలని హితవు పలికారు. కల్పిత ప్రచారాన్ని అధికారులు నమ్మవద్దని కోరారు. అధికారులు విచారణకు వస్తే తమ దగ్గర ఉన్న రికార్డ్ ఆధారాలతో తమ బలం నిరూపిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ తమ విన్నపాన్ని పరిశీలించి తక్షణమే ఇసుక ర్యాంపు మంజూరు చేయిస్తే గిరిజన కుటుంబాల వారము ఆర్థికంగా బలోపేతమై బాగుపడతామన్నారు. ఇతర గ్రామపంచాయతీలలో రెండు, మూడు సొసైటీలు ఉండగా కొయ్యూరు పంచాయతీలో రెండు సొసైటీలు ఉంటే తప్పేంటని ప్రశ్నించారు. సిర్రాజు సొసైటీలో తామంతా సభ్యులుగా కొనసాగుతామని 329 మంది సభ్యులు వ్యక్తిగత బాండ్ రాసిచ్చారని వెల్లడించారు. 2020లో 27 మంది కమిటీగా సార్లమ్మ సొసైటీ ఏర్పడిందని, అయితే పంచాయితీ పరిధిలో 450 మంది గిరిజన మహిళలు సొసైటీలో సభ్యత్వం పొందడానికి అర్హత కలిగి ఉన్నందున వారందరినీ సభ్యులుగా చేర్చుకోవాలని సార్లమ్మ కమిటీని కోరి అందరి పేరుతో ఆనాడు చలానా కూడా కట్టినట్లు తెలిపారు. అయితే మాకు ఎవరికీ ఆ సొసైటీలో సభ్యత్వం ఇవ్వనందున తాము జిల్లా సొసైటీ అధికారిని, కలెక్టర్‌ను కలిసి ప్రాధేయపడి నిబంధనల మేరకు సిర్రాజు సొసైటీ స్థాపించుకున్నామని తెలిపారు. ఆనాడు చలానా కట్టిన రసీదు చూపించి తాము సార్లమ్మ సొసైటీలో సభ్యులమని ప్రచారం చేయడం ఎంత మాత్రం తగదు అన్నారు. ఇదిలా ఉంటే కొంతమంది అవగాహన లేకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా తమ సొసైటీకి నష్టం కలిగించే విధంగా వార్తలు రాస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలు రాస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే కక్షపూరితంగా అవాస్తవాలు రాసి అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టించడం కరెక్ట్ కాదన్నారు. అలాంటివారు తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. అలాంటివారు నిజాలు తెలుసుకోవాలంటే తమ వద్దకు వచ్చి ఆధారాలు పరిశీలించవచ్చు అని తెలిపారు. గిరిజన కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసే ఇసుక ర్యాంపు రాకుండా అడ్డుకోవాలనుకోవడం ఎంత మాత్రం తగదన్నారు. అధికారులు వాస్తవ సమాచారం ఆధారంగా అన్ని రకాల అర్హత కలిగిన సిర్రాజు సొసైటీకి తక్షణమే ఇసుక ర్యాంపు మంజూరు చేయాలని పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు కోరం సాంబశివరావు, ఇర్పా భద్రయ్య, కాక కృష్ణారావు, పూనెం లింగయ్య, సోడి రామకృష్ణ,మడప రామారావు, ఇరప బాబురావు, ఎలగల గోపి, ప్రసాద్, కనితి రాజు తదితరులు ఉన్నారు.

## దుద్దాగులో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**చేవెళ్ల, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** చేవెళ్ల మండల పరిధిలోని దుద్దాగు గ్రామంలో పాస్టర్లు తిమోతి, హానోక్, హిమనేయులు, కిషన్ ల ఆధ్వర్యంలో గ్రామంలోని చర్చిలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల నేపథ్యంలో చర్చిని శోభాయమానంగా అలంకరించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఆర్ఎంపీ



డాక్టర్ వినయ్ కుమార్ పేదలకు కొత్త బట్టలు, బెడ్ షీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా ఘనంగా చేసుకునే పండుగ క్రిస్మస్ అని తెలిపారు. సర్వ మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలని, ఆ దేవుని ప్రార్థిస్తున్నానని అని తెలిపారు. ఏసుక్రీస్తు జన్మదినం అతి పెద్ద పండుగ అని తెలిపారు. క్రీస్తు ఆశీస్సులు అందరికి ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పాస్టర్లు నిర్వహించిన వేడుకల్లో క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఏసుక్రీస్తును ఆరాధిస్తూ ప్రార్థనలు, భజనలు, గీతాలాపనలు చేశారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సింగర్ పూజిత, క్రైస్తవ భక్తులు నర్సిములు, రత్నమయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు
- అనంతగిరి మండలం గొండ్రియాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పరిశీలన



**కోదాడ/అనంతగిరి,డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు ఆదేశించారు. అనంతగిరి మండలం గొండ్రియాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వంట సామాగ్రిని భద్రపరిచిన గదులను తనిఖీ చేసిన రిజిస్టర్లను పరిశీలించారు. స్టాక్ వచ్చినప్పుడు రిజిస్టర్ లో ఎంట్రీ చేయాలని చెప్పారు. విద్యార్థుల సమక్షంలోనే స్టాక్ ను స్వీకరించాలని సూచించారు. వంట సామాగ్రి కి సంబంధించిన వస్తువులు ఎక్స్పైరి డేట్ తప్పనిసరిగా చెక్ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..మధ్యాహ్న భోజనం ముందుగా సూపర్ వైజర్లు తిన్న తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. ఒకవేళ ఆహారం రుచికరంగా లేకపోతే తిరిగి మళ్ళీ వండి విద్యార్థులకు వడ్డించాలని పేర్కొన్నారు విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. వారి వెంట కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ, స్థానిక తహసిల్దార్ హిమబిందు, ఎంఈఓ తల్లాడ శ్రీనివాసరావు ఉన్నారు.

## ఉద్యమకారులను అణిచివేస్తున్న ప్రభుత్వం



**ములుగు ప్రతినిధి, (నినాదం):** ఉద్యమకారులకు గుర్తింపు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఉద్యమకారులను అణిచివేస్తుందని పూర్వ పిడిఎస్‌యూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ముంజల బిక్షపతి గౌడ్ అన్నారు. మంగళవారం తెల్లవారుజాము న ఆయనను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఉద్యమకారులను అక్రమ అరెస్టు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ప్రజల సమస్యలపై మాట్లాడే వారు ఉండకుండా ప్రభుత్వం అణచి వేస్తుందని, ప్రశ్నించే వారిని అరెస్ట్ చేస్తుందన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ కారోబర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓరుగంటి రఘు రవి ఉన్నారు.

## అవినీతి అక్రమాలకు భూకబ్జాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



**నర్సంపేట, డిసెంబరు17 (నినాదం న్యూస్) :** సమాజంలో పెరిగిపోతున్న అవినీతి అక్రమాలకు ప్రభుత్వ భూముల కబ్జాలకు వ్యతిరేకంగా పేదలను సమీకరించి యువత పోరాడాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. ఎంసీపీఐ(యు) ఆధ్వర్యంలో పట్టణ యూత్ సమావేశం బాధ్యులు బండారి మల్లేష్ అధ్యక్షతన నర్సంపేటలోని ఓంకార్ భవన్ లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పెద్దారపు రమేష్ మాట్లాడుతూ పెరిగిన జనాభా కనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన పాలకులు పెట్టుబడి దారి వర్గాల కనుసన్నల్లో పనిచేస్తున్నారన్నారు.అంతేగాక పాశ్చాత సంస్కృతిని పెంపొందిస్తూ విచ్చలవిడిగా మత్తు పానీయాలను డ్రగ్స్ అశ్లీల చిత్రాలను ప్రోత్సహిస్తూ యువతను తప్పుదోవ పట్టిస్తూ చెడు వ్యసనాల వైపు మళ్లిస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో యువత శక్తి మొత్తం నిర్వీర్యం అవుతున్నదని మరోవైపు అర్హులైన ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ అసైన్డ్ భూములను అంగ అర్థ బలం కలిగిన వ్యక్తులు ప్రభుత్వ అండదండలతో ఆక్రమించుకొని యదేచ్చగా అమ్మకాలు కొనుగోలు చేపడుతున్న పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నిలువ నీడ లేక పేదలకు వైపు ఇంటి స్థలాలు ఇండ్ల కోసం ఎదురు చూస్తుంటే విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసి కోట్లు గడిస్తున్న వారికే ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలుస్తున్నదని అందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ భూముల రక్షణకు యువతలో చేతన నింపేందుకు ప్రభుత్వ ఆస్తుల రక్షణకు పోరాటాలను నిర్మించాలని అందులో యువత ముందు పీఠాన నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ నాయకులు ఈర్ల రాజు కసుబాల సతీష్ బెజ్జంకి రాజేష్ గడ్డం పవన్ కళ్యాణ్ రతన్ కుమార్ రాజు కుక్కల కార్తీక్ యాకయ్య రాజేష్ బాబా అఖిల్ పాల్గొన్నారు.

## బాణాల వెంకటరెడ్డి విద్యారంగానికి చేసిన సేవలు మరువలేనివి



**కోదాడ/మునగాల, డిసెంబర్ 17(నినాదం న్యూస్):** తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు వాగ్దేవి విద్యాసంస్థల చైర్మన్ స్వర్గీయ బాణాల వెంకట రెడ్డి విద్యారంగానికి చేసిన సేవలు మరువలేని బిసి విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ అన్నారు. మంగళవారం మునగాల మండల పరిధిలోని గణపవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థులకు ఫ్యాడ్లు పంపిణీ చేశారు.అనంతరం రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ... అనేకమంది పేద విద్యార్థులను ఉచితంగా చదివించారని, ఎంతోమంది విద్యార్థులు ఆయన మార్గదర్శకంలో ఉన్నత స్థానాలకు వెళ్లారని పేర్కొన్నారు. వెంకట్ రెడ్డి కి ఘనమైన నివాళులర్పిస్తూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వెంకట్ రెడ్డి, ఉపేందర్ ,జయశ్రీ, రాణి, బీసీ నాయకులు గండు గోపి గౌడ్, నెమ్మాది అజిత్ తదితరులు పాల్గొన్నారు

## నేడు ఆర్డీవో కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశం

**చింతపల్లి ,డిసెంబర్ 17 ( నినాదం న్యూస్) :** క్రిస్మస్ పర్వది నం సందర్భంగా నేడు దేవరకొండలోని ఆర్డీవో కార్యా లయం లో ఉదయం 11.00 గంటలకు శాంతి కమిటీ సమావే శాన్ని నిర్వహిస్తారని తాసిల్దార్ రమాకాంత్ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చర్చిల ఫాదర్లు, పాస్టర్లు, క్రిస్టియన్ మత పెద్దలు హాజరుకావాలని ఆయన కోరారు.

## అనంతగిరిలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి

- జాయింట్ కలెక్టర్ పీ. రాంబాబు ఆదేశాలు
- గొండ్రియల గ్రామంలో పర్యటించిన జాయింట్ కలెక్టర్



**కోదాడ/అనంతగిరి,డిసెంబర్ 17, (నినాదం న్యూస్):** ఆంధ్ర ప్రాంతం నుండి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా లారీలలో ధాన్యాన్ని తరలిస్తున్నారని రైతుల నుండి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో మంగళవారం సూర్యాపేట జిల్లా జాయింట్ కలెక్టర్ పి. రాంబాబు అనంతగిరి మండలం గొండ్రియల గ్రామంలో పర్యటించారు. గొండ్రియల గ్రామం ఆంధ్ర సరిహద్దు ప్రాంతానికి దగ్గరలో ఉండడం,తెలంగాణ ప్రభుత్వం 500 బోనస్ రైతులకు అందిస్తూ ఉండడంతో, ఆంధ్ర నుండి తెలంగాణకు అక్రమంగా లారీలలో ధాన్యం తరలిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. తక్షణమే గొండ్రియాల గ్రామంలో రెండు వారాలపాటు తాత్కాలిక చెక్ పోస్ట్ తక్షణమే ఏర్పాటు చేయాలని, పోలీస్ డిపార్ట్మెంట్ డిపార్ట్మెంట్ రెండు బృందాలుగా ఏర్పడి చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అధికారులకు సూచించారు. వారి వెంట సివిల్ సప్లై రాజేశ్వరరావు, కోదాడ ఆర్టీవో సూర్యనారాయణ, కోదాడ ఎమ్మార్వో వాజిద్ అలీ, అనంతగిరి ఎమ్మార్వో హిమబిందు, అనంతగిరి ఎస్సై అనిల్ కుమార్ ఉన్నారు.

## డీలక్స్ బస్సులో ప్రయాణించి బహుమతులు పొందండి

- డిపో మేనేజర్ రమేష్ బాబు



**చింతపల్లి, డిసెంబర్ 17 (నినాదం న్యూస్) :** దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నడుస్తున్న డీలక్స్ బస్సుల్లో మహిళలు ప్రయాణించి బహుమతులను పొందాలని డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు కోరారు. దేవరకొండ డిపో కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో డీలక్స్ బస్సులో ప్రయాణించి లక్కీ డ్రా లో గెలుపొందిన మహిళలకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించాలని సూచించారు. ప్రయాణికుల సౌకర్యం కోసం సంస్థ కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రత్యేకించి మహిళలు డీలక్స్ బస్సుల్లో ప్రయాణించి, తమ గమ్యం చేరగానే, బస్సు దిగేముందు తమ టికెట్ వెనుక భాగాన పేరు, ఫోన్ నెంబరు రాసి గిఫ్ట్ బాక్స్ లో వేయాలన్నారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళల టికెట్లను ప్రతి 15 రోజులకొకసారి డ్రా తీసి బహుమతులను ముగ్గురికి అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డ్రాలో గెలుపొందిన హైదరాబాదులోని గ్రీన్ పార్క్ కాలనీకి చెందిన కే .సుజాత, నల్లగొండ కు చెందిన ఎండి. షకీలా, పీఏ పల్లి మండలంలోని ఫకీర్ పురం గ్రామానికి చెందిన ఎస్. మల్లమ్మ లకు ఆయన బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**సూర్యాపేట, డిసెంబర్17 (నినాదం న్యూస్) :** సఖి కేంద్రాల ద్వారా బాధిత మహిళలకు సత్వరమే న్యాయం జరగాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సఖి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ... సఖి కేంద్రం ద్వారా నమోదైన 148 కేసులను పరిష్కరించామని పెండింగ్ లో ఉన్న 49 కేసులు వివిధ దశలలో విచారణ చేయడం జరుగుతుందని అన్నారు. కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు కొరకు ఎస్వీ డిగ్రీ కళాశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్ కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ వి.. వెంకటేశులు, సఖి కేంద్రం పరిపాలన అధికారి శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీజీవీబీ పేరు తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్పు

- ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తాం
- బ్యాంకు మేనేజర్ హర్షవర్ధన్ రెడ్డి



**చౌటుప్పల్ డిసెంబర్ 17(నినాదం న్యూస్) :** కేంద్ర ఆర్థిక సేవల విభాగం ఆదేశానుసారం ఉమ్మడి అంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఎన్నో బ్యాంకింగ్ సేవలు అందించిన ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఇక నుండి తెలంగాణ గ్రామీణ బ్యాంకు గా మారి రాష్ట్ర వ్యాప్తంగా ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు అందిస్తుందని చౌటుప్పల్ మండలంలోని దండు మల్కాపురం ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ కె హర్షవర్ధన రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పుడు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక బ్రాంచీలు ఉన్న బ్యాంక్ గా మారనుందని, కేంద్ర ప్రభుత్వం గ్రామీణ బ్యాంక్ లను అనుసంధానం చేసి ప్రతి రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంక్ ఉండేలా చర్యలు తీసుకుందని మేనేజర్ హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. ఇందులో బాగంగా తెలంగాణ రాష్ట్రంలోని అంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు శాఖలు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖలు కలిపి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్పు చేసే సమయంలో మన బ్యాంక్ సేవలు ఈ నెల 28 నుంచి 31 వరకు పూర్తిగా ఆగిపోనున్నాయని, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపిఐ అనగా ఫోన్ పే, గూగుల్ పే ఇంకా కొన్ని సేవలు పూర్తిగా పనిచేయవని మేనేజర్ తెలిపారు. కావున మన బ్యాంక్ ఖాతాదారులు ముందుగా గమనించి ఈనెల 27 లోపు అత్యవసరమైన బ్యాంకింగ్ కార్య కలాపాలను నిర్వహించుకోవాలని మేనేజర్ తెలిపారు. బ్యాంకు సేవలు తిరిగి 1వ తేదీ జనవరి 2025 నుండి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా అన్ని రకాల సేవలు యధావిధిగా ఖాతాదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ మార్పు సమయంలో కలిగే అసౌకర్యానికి చింతిస్తూ రేపటి మెరుగైన సేవల కోసం జరిగే ఈ మార్పుకి సహకరించ వలసిందిగా మేనేజర్ హర్షవర్ధన రెడ్డి ఖాతాదారులకు విజ్ఞప్తి చేసారు.

## నిరంకుశంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



**చౌటుప్పల్,డిసెంబరు17(నినాదం న్యూస్):** లగచర్ల రైతులను అక్రమంగా జైల్లో వేసి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. అక్రమంగా జైల్లో పెట్టిన లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మంగళవారం అంబేద్కర్‌కి పూలమాలవేసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కూసుకుంట్ల మాట్లాడుతూ అడుగడుగునా ప్రజాస్వామిక విధానాలతో కాంగ్రెస్ పార్టీ ముందుకెళుతుందని కచ్చితంగా ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని ఎండగడతామని ఆయన హెచ్చరించారు.లగచర్ల రైతుల అరెస్టు ప్రజాస్వామికం అన్నారు.సొంత భూములు అమ్మనందుకు, అల్లుడి ఫార్మా కంపెనీ స్థాపన కోసం రేవంత్ రెడ్డి ఈ దారుణానికి పాల్పడడం నిస్సిగ్గు చర్య అన్నారు. రైతులను అన్ని రకాలుగా మోసం చేస్తుందని ఆరోపించారు. రైతు సంక్షేమం కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రతి ఒక్క పథకాన్ని ఈరోజు ఆపేసి రైతులను మోసం చేస్తే కార్యక్రమానికి తెరలేపింది రేవంత్ రెడ్డి సర్కారు అని ఆయన అన్నారు. రైతుబంధు, రైతు బీమా వంటి కార్యక్రమాలు నిలిపివేసే విధంగా రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల పక్షాన ఎల్లప్పుడూ బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని ట్రిబుల్ ఆర్ రైతులకు కూడా అండగా ఉండి ఖచ్చితంగా వారి పక్క వారి పక్షాన పోరాటం చేస్తారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్ , సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి , మాజీ జడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి ,కౌన్సిలర్ తాడూరి శిరీష పరమేష్ ,టిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ,మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దామోదర్ రెడ్డిని కలిసిన మార్కెట్ చైర్మన్

**నూతనకల్, డిసెంబర్ 17 (నినాదం న్యూస్) :** మాజీ మంత్రి సీనియర్ నాయకుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డిని హైదరాబాద్ అతని నివాసంలో మంగళవారం తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనాటి కార్యక్రమంలో వేణరెడ్డి, గుడిపాటి నరసయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు కలిశారు.



## అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు

- మరిపెడ మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జాటోత్ సురేష్ నాయక్



**డోర్నకల్ /మరిపెడ డిసెంబర్ 17(నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలనే సంకల్పంతో ప్రతి గ్రామం వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీని నియమించి పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నారు.అందులో భాగంగానే మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని 14 వ వార్డులో మరిపెడ మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జాటోత్ సురేష్ నాయక్ ఇన్చార్జిగా వార్డ్ అధికారులతో కలిసి ప్రతి ఇంటింటికి తిరుగుతూ సర్వేను నిర్వహించారు.. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను అందించడానికి ప్రతి ఇంటికి తిరుగుతూ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు.. పైరవీలకు తావు లేకుండా తప్పనిసరిగా అర్హులైన వారికే ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో 14 వార్డ్ ఇంచార్జ్ ఆఫీసర్ ప్రభాకర్,జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి అఫ్సర్,సీనియర్ నాయకులు గంధసిరి వీరభద్ర, రెంటాల శ్రీను,రాధికా,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు తప్పనిసరిగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి జీ.పాణిని



**మంగపేట, డిసెంబర్ 17 ( నినాదం న్యూస్) :** పదవ తరగతి విద్యార్థులకు తప్పనిసరిగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ( డీ.ఈ.ఓ ) జి.పాణిని టీచర్లకు సూచించారు. మంగపేట మండలంలోని రాజుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ( డీ.ఈ.ఓ ) జి.పాణిని మంగళవారం సందర్శించారు. పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణ రిజిస్టర్లను పరిశీలించి ప్రతిరోజు విద్యార్థులకు విధిగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. విద్యార్థులను వార్షిక పరీక్షలకు సంసిద్ధులను చేస్తూ జనవరి 1వ తేదీలోపు సిలబస్ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, జనవరి 1వ తేదీ నుండి పునఃశ్చరణ తరగతులు నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని ఈ సందర్భంగా రాజుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీచర్లకు సూచించారు.

## కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ



**మంగపేట, డిసెంబర్17 (నినాదం న్యూస్) :** మంగపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ( డీఈఓ ) జి.పాణిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు . తనిఖీలో భాగంగా విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ, భోజన ఏర్పాట్లు, కిచెన్ పరిసరాల పరిశుభ్రత, కిరాణా సరుకులు, కూరగాయల పరిశుభ్రత పాటిస్తున్న తీరును పరిశీలించారు. కస్తూరిబా గాంధీ పాఠశాలలో వంటగదిని, పాత్రల శుభ్రతను, విద్యార్థులకు అందించే మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్పెషలాఫీసర్ కు, వంట సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత




**చౌటుప్పల్, డిసెంబర్ 17(నినాదం న్యూస్) :** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మండలం దామెర గ్రామానికి చెందిన బోరం కౌసల్యకు 60 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన నల్గొండ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వల్కి దిలీప్ ఈ కార్యక్రమంలో ఉప్పునూతల నరసింహ అయితగోని నరసింహ నిమ్మల స్వామి సాతిరి సత్తయ్య సాతిరి మధు తూర్పునూరి గిరి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**చింతపల్లి, డిసెంబర్17 (నినాదం న్యూస్) :** గ్రామీణ ప్రాంతాల్లో వివిధ ఆసుపత్రి వర్గాలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంగిరేకుల గోవర్ధన్ లు అన్నారు. మండలంలోని వి.టి నగర్ లో ఉన్న లైఫ్ స్టార్ హాస్పిటల్ లో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మలక్పేట్ కేర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మాల్ లైఫ్ స్టార్ హాస్పిటల్లో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రి వర్గాలు పేద ప్రజలకు రాయితీ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.హాస్పిటల్ చైర్మన్ చిలుకూరు ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమన్నారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ వినోద్, జనరల్ సర్జన్ స్వరణ్, ఆర్థోపెడిక్ డాక్టర్. జగదీష్, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అంగిరేకుల గోపాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాణాల రంగాచారి,మాస భాస్కర్, పాలకూర్ల రాజు, కానుకుర్తి, శ్రీనివాస్, రసీద్, రామ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి , గ్యార నరేష్,బాలు, ల్యాబ్ టెక్నీషియన్ మధు, జనార్దన్ గౌడ్,పాండు , లలిత, శ్రావణి , పూజ , స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఇంటాక్ క్విజ్‌లో కోదాడ విద్యార్థుల ప్రతిభ




**కోదాడ, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** మంగళవారం న్యూఢిల్లీ లో ఇంటాక్ 2024 క్విజ్ జాతీయ స్థాయి తుది పోటీలు జరిగాయి. దేశవ్యాప్తంగా 25 జట్లు వివిధ రాష్ట్రాల నుంచి ఫైనల్ పోటీల్లో పాల్గొన్నాయి. భారత దేశ సంస్కృతి, కళలు మరియు వారసత్వ అంశాల మీద అవగాహన కోసం పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈ పోటీలను నవంబర్/ డిసెంబర్ నెలల్లో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికచేస్తారు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండకు చెందిన తేజ విద్యాలయ విద్యార్థులు నోముల సృజన్ గుప్త, ధరావత్ నితీష్ రాజ్ జట్టు నవంబర్ లో హైదరాబాద్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయికి ఎంపికైనారు.తెలంగాణ రాష్ట్రం నుంచి అర్హత సాధించి ఫైనల్ పోటీలో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ లోని తేజ విద్యాలయ చెందిన నోముల సృజన్ గుప్త , ధరావత్ నితీష్ రాజ్విద్యార్థులు అత్యున్నత ప్రతిభ చూపి తృతీయ స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయి ఫైనల్స్ పోటీలు ఇంటాక్ కేంద్ర కార్యాలయంలో జరిగాయి. ప్రసిద్ధ క్విజ్ మాస్టర్ కునాల్ సావర్కర్ దృశ్య మరియు శ్రవణ మాధ్యమంలో తెర మీద భారతీయ సంస్కృతి, వారసత్వ , ఆచార సంప్రదాయాలు మీద ప్రశ్నలతో క్విజ్ ను ఆసక్తికరంగా నిర్వహించారు.జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన తేజ విద్యాలయ విద్యార్థులు నోముల సృజన్ గుప్త , ధరావత్ నితీష్ రాజ్ లకు ఇంటెక్ మెంబర్ రవీందర్ సింగ్, పూర్ణిమ దత్ లు విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి , డైరెక్టర్ సోమిరెడ్డి అభినందించారు.

## అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన



అల్వాల్, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): అల్వాల్ సెక్టర్ భూదేవి నగర్ 68 అంగన్వాడి కేంద్రంలో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు, చిన్నపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ స్వాతి, గ్రేట్ సూపర్వైజర్ కీర్తి ఆధ్వర్యంలో జంగా ఫౌండేషన్ సెక్రటరీ వంపు ప్రవీణ్ కుమార్, డైజీ క్రిస్టియన్ గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు, ఏడవ నెల పిల్లలకు అన్నప్రాసన నిర్వహించడం జరిగింది. జంగా ఫౌండేషన్ వారు అంగన్వాడి పిల్లలకు దుప్పట్లు, స్టేషనరీ సామాగ్రిని అందజేశారు. ఈ అంగన్వాడి టీచర్లు శ్యామల, ఆశా వర్కర్ భాగ్య, మహిళలు, అంగన్వాడి పిల్లలు పాల్గొన్నారు.

## ఫ్లెమింగ్ లేబొరేటరీస్ లిమిటెడ్ కంపెనీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా కూన శ్రీశైలం గౌడ్ ఎన్నిక





కుత్బుల్లాపూర్, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా,శివంపేట్ మండల్ నవాబ్ పేట్ గ్రామం లోని ఫ్లెమింగ్ లేబొరేటరీస్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ను యూనియన్ ఉద్యోగులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యం,ఎంప్లాయిస్ తో కలిసి సమావేశం అయ్యారు. యూనియన్ సభ్యులను కూన శ్రీశైలం గౌడ్ కంపెనీలో పనిచేసే ఉద్యోగుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎంప్లాయిస్ సమస్యలు ఏవైనా తాను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ టి. వెంకటేశ్వర్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మైసయ్య, దయాకర్, ఎస్. వి. సుబ్బారావు, బి.లక్ష్మణరావు, వెంకన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## మొజామిల్ కుటుంబానికి న్యాయం చేయండి : బండి రమేష్



కూకట్‌పల్లి, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): మూడు రోజుల క్రితం నాలాలో పడి మృతి చెందిన బాలుడు మొజామిల్ కుటుంబానికి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ నాయకులతో కలిసి జెడ్ సి కి వినతిపత్రం అందజేశారు. ఆ కుటుంబానికి ఐదు లక్షల నష్టపరిహారంతో పాటు బాలుడి తండ్రికి ఉద్యోగ అవకాశం కల్పించాలని వినతి పత్రంలో కోరారు. ఇలాంటి ఘటన జరగడం విచారకరమని, అనరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, యూసఫ్, ఆయాజ్ పాల్గొన్నారు.

## జంగయ్య యాదవ్ మృతదేహానికి నివాళి



మహేశ్వరం, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ తండ్రి చీపురిజంగయ్య యాదవ్ మరణించడం దురదృష్టకరమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం జంగయ్య యాదవ్ నివాసానికి వెళ్లిన రాష్ట్రం ఫుడ్ కమిషన్ చైర్మన్ గోల్డ్ శ్రీనివాస్ రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చైర్మన్ వెంట బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, సుమన్ నాయక్, గురువయ్య, అశోక్, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్‌తోనే ఆలయ అభివృద్ధి



మహేశ్వరం, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): భక్తులందరూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని పూజిస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తోనే అభివృద్ధి సాధ్యమని ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం పరిధిలోని సలార్ పూర్ లో సేవాలాల్, జగదాంబ ఆలయానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 40 వేలు విరాళం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో మంచినీటి సౌకర్యం కోసం బోర్ మోటార్, పంప్ సెట్ లను ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని ట్రస్ట్ మంచినీటి సౌకర్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని అందించారు. దైవభక్తితో ఏ పని చేసినా అందులో విజయం సాధిస్తామని ట్రస్ట్ చైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలీపంతు, మాజీ ఎంపీటీసీలు ప్రియా రమేష్, సాయిలు, నాయకులు బాబా, ప్రకాష్, పకీర, చందు, జగన్, గోపాల్, మల్లేష్, రాజు, దసరు, హైదర్, శ్రీశైలం, శ్రీను, రాములు, హైదర్, జేమ్లా, రవి, కిమ్మ, కార్డియా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇస్తేమ ఏర్పాట్లను నెలాఖరుకు పూర్తి చేయాలి

● కలెక్టర్ సి.నారాయణరెడ్డి



రంగారెడ్డి, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లిలో జనవరి 4,5 తేదీలలో నిర్వహించే ఇస్తేమ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శంకర్ పల్లిలో జనవరి 4,5 తేదీలలో నిర్వహించే ఇస్తేమ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ముస్లిం మత పెద్దలు, అధికారులతో కలిసి మంగళవారం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, మత పెద్దలు సమన్వయంతో పని చేస్తూ ఇస్తేమ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. ఇస్తేమా కార్యక్రమానికి లక్షలాది మంది హాజరు అవుతున్న నేపథ్యంలో డివైడర్లతో కూడిన విస్తీర్ణమైన రోడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా పార్కింగ్ స్థలాలను గుర్తించాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇస్తేమా కార్యక్రమం విజయవంతం దిశగా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మంచి నీరు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులకు కలెక్టర్ తెలిపారు. విద్యుత్తు అంతరాయం లేకుండా తగినన్ని ట్రాన్స్ఫార్మర్లను, పోల్స్, వైరింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తగినన్ని మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య పనుల విషయంలో పెద్ద మొత్తంలో సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. లైటింగ్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజు సంబంధిత అధికారులు తమకు నిర్దేశించిన పనులను పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్య, తెలంగాణ మైనారిటీల రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషనల్ సొసైటీ వైస్ చైర్మన్ , ప్రెసిడెంట్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ, ఆర్డీవో చంద్రకళ, డిఎండబ్ల్యుఓ నవీన్ రెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, ఈఈ ఆర్.డబ్ల్యూఎస్ రాజేశ్వర్, మిషన్ భగీరథ అధికారులు, తహసిల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ముస్లింలు పాల్గొన్నారు.

## బిజెపి సభ్యత్వంపై ముఖ్య కార్యకర్తలతో సమీక్ష

● సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ రావుల శేషగిరి



కుత్బుల్లాపూర్, డిసెంబర్ 17 (నినాదం న్యూస్) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అధ్యక్షతన డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్ రిటర్నింగ్ అధికారి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ లో ఇప్పటివరకు జరిగిన సభ్యత్వాన్ని పరిశీలించి క్రియాశీల సభ్యత్వాలపై చర్చించి బూత్ కమిటీ ప్రక్రియను కార్యకర్తలకు వివరించారు. డివిజన్లోని కార్యకర్తలు మహిళా నాయకురాలు ఎంతో సంతోషంగా, ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొని రాబోయే రెండు రోజుల్లో బూత్ కమిటీలు పూర్తి చేసి డివిజన్ అధ్యక్షులకు అప్పగిస్తామని రిటర్నింగ్ ఆఫీసర్ వాసంశెట్టి శ్రీనివాస్ కు, డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి కి భరోసా ఇచ్చారు. రాబోయే సంస్థాగత ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బిజెపి సత్తా చాటుతామని గాజులరామారంలో కమలం వికసిస్తుందని అందుకు సమన్వయ ంతో పని చేస్తామని ప్రతిజ్ఞ సైతం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్ పాటిల్ స్థానిక నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి వినతులు



కుత్బుల్లాపూర్, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం 125 డివిజన్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీ ఆర్ పిలుపుమేరకు ఎమ్మెల్సీ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంబిపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి వివేకానంద ఆదేశాల మేరకు కొడంగల్ లగచర్లలో రైతులపై అక్రమ కేసులు, థర్డ్ డిగ్రీ ప్రయోగించిన నయవంచన కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు నిరసనగా గాజులరామారం చౌరస్తాలో 125 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డి.విజయ్ రామ్ రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సద్బుద్ధి కలుగజేయాలని వెంటనే రైతులపై కేసులు ఎత్తివేసి విడుదల చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, పరుస శ్రీనివాస్ యాదవ్, హుస్సేన్, అజయ్ ప్రసాద్ గుప్తా, నవాబ్, ఇబ్రహీం, తారా సింగ్, చందు ముదిరాజ్, దూలప్ప, విజయ్ కుమార్, తిరుపతి యాదవ్, సాయిబాబా, చిన్నా, చౌదరి, ఉపేందర్ రెడ్డి, చెట్ల వెంకటేష్, బద్రి నారయణ, ప్రసాద్, హమీద్, మల్లేష్, సురేందర్ రెడ్డి, జాఫర్, రవికిరణ్, సుమన్, శివ నాయక్, మహిళా నాయకురాలు ఫర్జానా బేగం, కుర్షిదా బేగం, మామి, షమీమా బేగం, రాజాబాయి తదితరులు పాల్గొన్నారూ.

## సమాజ శ్రేయస్సు కోసం పోరాడేదే సిపిఐ

● సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



కుత్బుల్లాపూర్, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్ట శాఖ పార్టీ సభ్యత్వం పునరుద్దరణ సందర్భంగా మంగళవారం శాఖా సభ్యులకు పార్టీ సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి అధ్యక్షత వహించగా ఉమా మహేష్ ముఖ్యతితీగా హాజరై సభ్యత్వాలు అందచేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణ త్యాగాలకైనా సిద్దమని చెప్పి తెల్ల దొరలు పోయి నల్ల దొరలు కాదు సంపూర్ణ స్వాతంత్రం నినాదాన్ని ఇచ్చి అందరికి సమానమైన ఫలాలు అందించాలంటే సోషలిస్టు వ్యవస్థతోనే అది సాధ్యమని నాటి నుండి నేటి వరకు అనేక త్యాగాలను చేసిన చరిత్ర సిపిఐ కే దక్కిందన్నారు. ఈ రోజు కేంద్రంలో,రాష్టంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పేద ప్రజలకు కనీస అవసరాలైనా విద్య,వైద్యం, నివాసం ను ప్రజలకు ఉచితంగా అందించకుండా మరిన్ని పన్నులు మోపి వాటికి దూరం అయ్యే విధానాలను అవలంభిస్తున్నాయని దుయ్యబట్టారు. పేద, మధ్యతరగతి ప్రజలపైన పన్ను భారం వేసి పారిశ్రమికావేత్తలకు పన్ను రేట్లు తగ్గించి,రుణాలు ఇచ్చి వ్యాపారం చెయ్యడానికి ఉపయోగపడుతున్నాయి తప్ప పేద ప్రజలకు మాత్రం సంపన్నులకు ఇచ్చిన రాయితీలను కూడా ఇవ్వట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని బూర్జువా పార్టీలు వారి నాయకత్వం, పెట్టుబడిదారుల కోసం పని చేస్తాయని కమ్యూనిస్టులు మాత్రం పేద, మధ్యతరగతి ప్రజల కోసం అనుక్షణం పోరాటం చేస్తారని అన్నారు. సిపిఐ సభ్యత్వం అందరికి ఇవ్వరని దాని సిద్ధాంతం కోసం ఎర్రజండా పట్టేవారికి మాత్రమే ఇస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జానకిరామ్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, సభ్యులు నగేష్ చారి, సోమయ్య, సామెల్, రవి, నర్సింహరెడ్డీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు గృహాలు అందించాలి

● కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి



అల్వాల్, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారులకు ఇండ్లు అందించాలని కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం అప్లికేషన్ లబ్ధిదారులను మీకు తింటారు. కొత్తబస్తీలో పర్యవేక్షించారు ఈ కార్యక్రమంలో టిఐ సాయికుమార్, ప్రేమ్, శరణ్ గిరి, అరుణ్, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తనయుడు డాక్టర్ అఖిల్



మహేశ్వరం, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): ప్రజలందరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తనయుడు యువనేత డాక్టర్ అఖిల్ పేర్కొన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం చరి కొండ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ మరియు రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తనయుడు డాక్టర్ అఖిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన చరికొండ చుట్టూ ఉన్న పరిసర ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిబిరాన్ని సదుపాయని కల్పించామని డాక్టర్ అఖిల్ కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో షుగర్ బిపి అనేక రకాల వైద్య పరీక్షలు నిర్వహించి నాణ్యమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ అఖిల్ మాట్లాడుతూ... శిబిరంలో 312 మంది సద్వినియోగం చేసుకోవడం జరిగింది. మా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు మా గ్రామ ప్రజల తరఫున కామి నేని హాస్పిటల్ డాక్టర్లకు జడ్పిటిసి వెంకటేష్ అన్నకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్, వీరయ్య, నరసింహ, నరేష్, ప్రశాంత్, భూషణ్, కృష్ణ, గోపాల్, జంగయ్య, శంకరయ్య, శ్రీశైలం, మహేష్, శేఖర్, తిరుపతి, సభ్యులు గ్రామ పెద్దలు మహిళలు నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్



కూకట్‌పల్లి, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి ప్రధాన రహదారిలోని గోవింద్ హోటల్ చౌరస్తా వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గోవింద్ హోటల్ చౌరస్తా నుండి ఎల్లమ్మ చెరువు వరకు జరుగుతున్న వరద నీటి పైప్ లైన్ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులలో భాగంగా పైప్ లైన్ పనులన్నీ పూర్తయ్యాయి అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు కూడా కొంతమేర పూర్తిచేసామని, మిగిలిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని రానున్న పది రోజులలో పూర్తిచేసి వాహనదారులకు వినియోగంలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. సీసీ రోడ్డును నాణ్యత ప్రమాణాలతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, కాంట్రాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రిసెప్షన్‌కి హాజరైన గోవింద్ సాగర్



మహేశ్వరం, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): హైదరాబాద్ కు చెందిన అట్ల శ్రీవాణి ధర్మ రెడ్డి కుమారుడు నవ తేజ రెడ్డి- పరశ్రీ (దీప్తి) వివాహం అత్యంత వైభవంగా వివాహం నిర్వహించారు, ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ కర్మన్ ఘాట్ పరిధిలోని హనుమాన్ ఆలయం ఎదురుగా వంగ అనంత రెడ్డి గార్డెన్ మంగళవారం రిసెప్షన్‌కు ముఖ్య అతిథులుగా హాజరైన హైదరాబాద్ జిల్లా యాకుత్ పురా నియోజకవర్గం సంతోష్ నగర్, మాదన్న పేట్, ఐ ఎస్ సదన్ సౌత్ ఈస్ట్ జోన్ పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రటరీ గోవింద్ సాగర్, తెలంగాణ రాష్ట్ర రంగారెడ్డి జిల్లా గిరిజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి రూప్ సింగ్ నాయక్, సీనియర్ నాయకులు అనిల్, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ సింగ్, పెద్దలు నాయకులు అభిమానులు కార్యకర్తలు కుటుంబ సభ్యులు స్నేహితులు బంధువులు వధూవరులకు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బంధువులు మిత్రులు నాయకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వేకువజామున అరెస్టు-మధ్యాహ్నం విడుదల

● బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

● విడుదల అనంతరం తెలంగాణ భవన్‌కి చేరుకున్న బిఆర్ఎస్ శ్రేణులు



కొడంగల్, డిసెంబర్ 17 (నినాదం న్యూస్): తెలంగాణ భవన్ హైదరాబాద్ లో కేటీఆర్ తో జరిగే సమావేశానికి బయలు దేరేందుకు సిద్ధమైన బిఆర్ ఎస్ పార్టీ మండల నియోజకవర్గ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మంగళవారం వేకువ జామున3 3గంటల నుంచి పోలీసులు లీడర్ల ఇంటికి చేరుకుని వారిని తమ వాహనాలలో ఎక్కించుకుని పోలీసు స్టేషన్ లో కూర్చోబెట్టారు. మధ్యాహ్నం ఒంటి గంటవరకు స్టేషన్లో కూర్చోబెట్టుకుని, వివరాలు రాసుకుని, ఎలాంటి అల్లర్లు,నిరసనలు, రాస్తారోకో లు చేయరాదని ఒప్పందంతో పోలీసులు బిఆర్ ఎస్ నాయకులను వదిలిపెట్టారు. పోలీసు స్టేషన్ నుండి బయటకు వచ్చిన బిఆర్ ఎస్ నాయకులు హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ చేరుకుని కెటిఆర్ సమావేశంలో పాల్గొన్నారు.

**శాంతియుత సమావేశాలకు కూడా వెళ్ళనివ్వరా..**
**-పోలీసులతో బిఆర్ఎస్ నాయకులు**

బొంరాస్ పేట్ మండల బిఆర్ పార్టీ నాయకులు కోట్లయాదగిరి, శేరి నారాయణరెడ్డి, సుదర్శన్ రెడ్డి, గుండుగారి తిరుపతయ్య,సలాం, ఖాజామైనోద్దిన్ లతోపాటు మరికొందరిని బొంరాస్ పేట్ పోలీసులు ముందస్తు గా అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కి తీసుకెళ్లారు. తాము ఎలాంటి ధర్నాలు, రాస్తారోకో లు చేయడానికి వెళ్ళడం లేదని, కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణ భవన్ లో జరిగే బిఆర్ ఎస్ పార్టీ సమావేశానికి విధిగా హాజరు కాబోతున్న తమను పోలీసులు రాత్రికి రాత్రే అరెస్ట్ చేయడం సరికాదన్నారు. పోలీసులు ఇంత నిర్ధాక్షిణ్యంగా అరెస్టులు చేయడం సరికాదని,సామరస్యంగా ఉండే ఈప్రాంతంలో ఇంత నిర్బంధం దేనికంటూ ప్రశ్నిస్తున్నారు.

## లఘు చెర్ల రైతులపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన



**కరీంనగర్, డిసెంబర్ 17(నినాదం న్యూస్ ):**
బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, లఘు చెర్ల రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరును నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనబాట పట్టాయి. కరీంనగర్ నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో చేప ట్టిన ఈ కార్యక్రమానికి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జివి రామక్రిష్ణ రావు ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం లగుచర్ల రైతుల పై కేసులు ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలంటూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. భారత రాజ్యాంగం పై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తోందన్నారు. జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు జివి.రామకృష్ణ రావు మాట్లాడుతూ, దళిత గిరిజనులు రాజ్యాంగ వ్యతిరేక చర్యల వల్ల తీవ్రంగా అణిచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద దళిత గిరిజన రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా లాక్కొని వారిని రోడ్డున పడేసే కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్ లోని లగచర్లలో పేద రైతన్నల భూములను బలవంతంగా లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. ఓసారి ఫార్మా విలేజ్ అని, మరోసారి ఇండస్ట్రియల్ కారిడార్ అని, మాయమాటలతో రైతన్నల భూములను లాక్కొని అదానికి, తన అల్లుడికి అప్పచెప్పేందుకు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను ఇవ్వమని తమ జీవనాధారాన్ని లాక్కోవద్దని ప్రభుత్వానికి పది నెలలుగా విజ్ఞప్తి చేసిన పట్టించుకోకుండా నిరంకుశంగా, పాసవికంగా పేద రైతన్నల పైన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను మీ దృష్టికి తీసుకువస్తున్నాము. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని, రైతన్నల కుటుంబాలను వేధించడం హింసించడం ఆపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సద్బుద్ధిని ప్రసాదించాలని, ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలని రాజ్యాంగ నిర్మాత అయిన మీకు విజ్ఞప్తి చేస్తున్నాం.ఈ కార్యక్రమం లో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు బండారి వేణు, కంసాల శ్రీనివాస్, గందె మాధవి మహేష్,జంగిలి సాగర్, దిండిగాల మహేష్, కరీంనగర్ రూరల్ మండల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి పార్టీ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రజకుల పట్ల బెదిరింపులకు పాల్పడుతున్న విద్యుత్ సిబ్బంది

### -పూసాల సంపత్ రాష్ట్ర రజక సంఘం అధ్యక్షులు శ్రీకాంత్



**కరీంనగర్, డిసెంబర్ 17(నినాదం న్యూస్):**
రజకుల కు ప్రభుత్వం ఇచ్చిన 2005 యూనిట్ల ఉచిత విద్యుత్ బిల్లులు చెల్లించవద్దు అని ఎస్సీ ని కలిసిన విన్నవించిన రాష్ట్ర అధ్యక్షులు పూసాల సంపత్ తెలంగాణ రజక సంఘం జిల్లా అధ్యక్షులు పూసాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు సంపత్ కలిసి జిల్లా విద్యుత్ అధికారి అయిన ఎస్సీ రమేష్ బాబు ని కలిసి జిల్లాలో దోబీ ఘాట్లు లాండ్రీ షాపులకు ప్రభుత్వం ఇచ్చిన ఉచిత 260 యూనిట్ల వాడకంలో కొంతమంది కిందిస్థాయి అధికారులు బిల్లులు చెల్లించాలని బెదిరిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని మీరు మీ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చి రజకులను బెదిరింపులకు గురి చేయవద్దని ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా గత ప్రభుత్వం బకాయిలు ఉన్న బిల్లులను విద్యుత్ శాఖకు మంత్రి పొన్నం ప్రభాకర్ చెల్లించారని 20050 యూనిట్ల ఉచిత విద్యుత్తును ఎల్ టి 2 నుండి హెల్తీ ఫోన్ వరకు మార్చాలని గతంలో మీటర్ల బిగింపులో విద్యుత్ అధికారులు కొంతమంది ఔకతోకలు చేశారని ఇప్పటికైనా రజకులు నాయి బ్రాహ్మణులకు బెదిరింపులకు గురి చేయవద్దని ఎస్సీ ని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు పూసాల శ్రీకాంత్, హాస్టల్ సొసైటీ నాయకులు కొయ్యడ బాలయ్య, అందే రాజయ్య, శ్రీనివాస్, బసవపురం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## డిస్ట్రిక్ట్ 303వాకర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షన్ దినోత్సవ వేడుకలు




**కరీంనగర్, డిసెంబర్ 17(నినాదం న్యూస్):**
పెన్షనర్లు తమ ఉద్యోగ జీవితంలో ఎన్నో సేవలు అందించి సమాజానికి మార్గదర్శకులుగా ఉండి పదవీ విరమణ తర్వాత వృద్ధాప్యం భారం కాకుండా తమ అనుభవాలను సమాజానికి అందిస్తూ సేవ చేస్తున్నారు మనము పెన్షనర్లను ప్రతి ఒక్కరూ గౌరవించాలి 70 సంవత్సరాలు నిండిన రిటైర్డ్ పోలీస్ అధికారి సత్తనను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాకర్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు అన్నమనేని సుధాకర్ రావు, గుడిపాటి రమణారెడ్డి, బూర జగదీశ్వర్ గౌడ్, బండవరం సుమన్, డాక్టర్ అజయ్ కుమార్, శంకర్ గౌడ్, సూర్యనారాయణ, లింగారెడ్డి, బోయిని అశోక్, పిల్లి కిషోర్ గౌడ్, కొండా శ్రీనివాస్, చెన్నాడే రవీందర్ రెడ్డి, రమేష్ నాగేంద్ర శర్మ , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

## పెన్షనర్స్ డేలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ అభిషేక్



**కరీంనగర్, డిసెంబర్ 17(నినాదం న్యూస్):**
కరీంనగర్ విద్యానగర్ లోని ఓ ఫంక్షన్ హాలు నందు మంగళవారం నాడు రిటైర్డ్ పోలీస్ అధికారులు నిర్వహించిన పెన్షనర్స్ డే కార్యక్రమానికి కరీంనగర్ పోలీస్ కమీషనర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. పోలీస్ కమీషనర్ తో పాటు ప్రొబేషనరీ ఐపిఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి పాల్గొన్నారు.కార్యక్రమానికి విచ్చేసిన అతిధులకు పూల మొక్కలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులంతా దాదాపు 35 నుండి 40 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో సేవలందిచారన్నారు. వారి సేవలు ఎంతో గొప్పవన్నారు. ఎన్నో సంఘ విద్రోహ శక్తులకు ఎదురొడ్డి పోరాడటం వల్లే ఈ రోజు శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. కొంతమంది అధికారులైతే విధినిర్వహణలో ప్రాణాలను సైతం కోల్పోయారన్నారు. వారి సేవలు ఎప్పటికీ చిరస్మరణీయం అన్నారు. ఇటీవల మరణించిన రిటైర్డ్ అధికారుల కొరకు రెండు నిమిషాల మౌనం పాటించారు. రిటైర్డ్ పోలీస్ అధికారుల అసోసియేషన్ లో చేరి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 40 మంది అధికారులను పోలీస్ కమీషనర్ పూల మాల వేసి శాలువాతో సత్కరించారు. నూతనంగా పోలీస్ శాఖలో చేరిన అధికారులకు రిటైర్డ్ పోలీస్ అధికారుల సేవలు ఆదర్శమన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ కమీషనర్ దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో కరీంనగర్ టౌన్ ఏసీపీ గోపతి నరేందర్ , టూ టౌన్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, రిటైర్డ్ అధికారుల అసోసియేషన్ ప్రెసిడెంట్ హరిప్రసాద్ , రాష్ట్ర అధ్యక్షులు రాజమౌళి , ముంతుజా , మల్లయ్య , లింగయ్య ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టభద్రుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

- సమగ్ర శిక్షణ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలలి
- మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 15 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలి
- మహిళలకు 180 రోజులతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి
- పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు



**కరీంనగర్, డిసెంబర్ 17(నినాదం న్యూస్):**
పట్టభద్రుల ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రం లో ప్రయివేట్ యాజమాన్యం పట్టభద్రులతో సమావేశమై వారికి ఓటు ప్రాముఖ్యతను తెలిపి మద్దతు కోరిన ఇండిపెండెంట్ పట్టభద్రుల అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు పట్టభద్రుల సమస్యలను అడిగి తెలుసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని 22 సంవత్సరాలుగా ప్రజాసేవ ప్రజా సమస్యల కొరకు పనిచేస్తున్నానని అన్నారు.ట్రస్మా సంఘాన్ని స్థాపించి అప్పటినుండి ఇప్పటివరకు ఎన్నో సేవా కార్యక్రమలు చేశానని ముఖ్యంగా కరోనా టైంలో గురుదక్షిణ పేరుతో ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 2000 రూపాయలు 25 కిలోల బియ్యం ఇప్పించానని అన్నారు.అన్ ట్రైనింగ్ టీచర్స్ కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ట్రేనింగ్ ఇచ్చేలా కృషి చేసానని అన్నారు. ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదల కాక చాలా కళాశాలలు మూతపడ్డాయని ఫీజు రియంబర్స్మెంట్ విడుదలకు కృషి చేస్తానని అన్నారు. పట్టభద్రుల తరపున ప్రశ్నించే గొంతుకనవుతానని ప్రభుత్వానికి పట్టభద్రులకు మధ్య వారధిగా ఉండి పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.కేంద్ర ప్రభుత్వం విద్యా సుంకం పేరుతో లక్షల కోట్లు కూడా పెట్టి విద్య వ్యవస్థకు ఖర్చు పెట్టకుండా దానిని వేరే పద్దు కు మారుస్తున్నారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల ద్వారా ఎంతోమంది ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న వారికి సంరక్షణ చట్టం లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఇన్సూరెన్స్ మరి హెల్త్ కార్డులకై కృషి చేస్తానని అన్నారు.పట్టభద్రుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారి అభివృద్ధి ధ్యేయంగా మీ ముందుకు వస్తున్నానని ఎమ్మెల్సీగా కాదు మీకు సేవ చేసే సేవకుడిగా వస్తున్నాను గ్రంథాలయాల బలోపేతం చేస్తాను అన్నారు ఈరోజుల్లో గ్రంథాలయాలను సరైన వసతులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని. ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తాను పాలకుడిగా కాదు సేవకుడిగా మీ ముందుకు వస్తున్న. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కై ఏడవ రోజు నిరవధిక సమ్మె చేస్తున్న తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను కలసి తన పూర్తి మద్దతును తెలిపిన పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు నిర్వహిస్తున్న ఏడవ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని సందర్శించే ట్రస్మా తరుపున మద్దతు ప్రకటించిన యాదగిరి శేఖర్ రావు.గత ప్రభుత్వము ఇచ్చిన న్యాయమైన హామీలను వెంటనే నెరవేర్చి తమను రెగ్యులరై చేయాలని డిమాండ్ చేశారు.ప్రతి ఉద్యోగికి జీవిత బీమా 10 లక్షలు ఆరోగ్య బీమా ఐదు లక్షల సౌకర్యం కల్పించాలని కోరారు. 12 నెలల వేతనముతో పూర్తి జీతభత్యాలు చెల్లించాలని కోరారు. మహిళలకు 180 రోజులతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు 20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ వచ్చేలా కృషి చేయాలని కోరారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 15 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని కోరారు. ట్రస్మ నిర్మల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ట్రస్మ టౌన్ ప్రెసిడెంట్ అయ్యన్న శ్రీధర్, ట్రస్మ టౌన్ జనరల్ సెక్రెటరీ జి.శ్యాం ప్రకాష్, మస్తాక్ జావిద్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## బస్ షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు

### -నిర్మించాలని గ్రామస్తుల విన్నపం




**జమ్మికుంట, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):**
జమ్మికుంట మండలం వెంకటేశ్వర్ల పల్లి కోరపల్లి గ్రామాల మధ్య కూడలి అంబేద్కర్ చౌరస్తా నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద బస్సు షెల్టర్ నిర్మించి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరపల్లి వెంకటేశ్వర పల్లి గ్రామస్తులు కోరుకుంటున్నారు. రెండు రోడ్లు ఒకటి బిజిగిరి షరీఫ్ ఒకటి పోతిరెడ్డిపల్లి ఒకటి విలాసాగర్ ఒకటి కోరపల్లి నుండి జమ్మికుంట వెళ్లే రెండు వరుసల తారు రోడ్లు కలవు గత ప్రభుత్వంలో రోడ్లు వేశారు కానీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఒక బస్టాండ్ ఏర్పాటు చేయలేదు. బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు ఎండాకాలం, వానాకాలం ఎక్కడ ఉండాలో తెలియక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవైపు ఇసుక ట్రాక్టర్లతో ప్రతిరోజు ఈ రహదారి బిజీగా ఉంటుందని ఆటోల కోసం ప్రయాణికులు రోడ్లపై నిలబడి ఎదురుచూస్తుండగా జరగకూడని ప్రమాదం ఏదైనా జరిగితే ఆ నష్టాన్ని ఎవరు భరిస్తారు అని గ్రామస్తులు అడుగుతున్నారు.రోడ్లపైన ఇటు విలాసాగర్ నుండి ఇసుక ట్రాక్టర్లు ఇటు బిజిగిరి షరీఫ్ నుండి అనేకమైన వాహనాలు పోతిరెడ్డిపల్లి రోడ్డు నుండి ఇసుక ట్రాక్టర్లు రావడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు ఇలాంటి సందర్భాలలో కొన్ని ఆక్సిడెంట్లు కూడా జరిగినాయి కొందరి ప్రాణాలు కూడా కోల్పోయారు కావున కోరపల్లి వెంకటేశ్వర పల్లి సంబంధించిన ఈ సెంటర్లో ముందు భవిష్యత్తులో అతిపెద్ద సెంటర్గా వెలువడే అవకాశం ఉంది కావున ఇక్కడ ఒకటి బస్టాండ్ సౌకర్యం కల్పించాలని అధికారులను అనేకసార్లు వేడుకున్న కూడా ఇప్పటివరకు దీనిపై ఎలాంటి స్పందన రావడం లేదు ఇప్పటికైనా ఈ పరిస్థితులను వచ్చి చూసి ఇక్కడ బస్టాండ్ ఏర్పాటు చేయాల్సిందిగా గ్రామ ప్రజలందరూ కోరుకుంటున్నారు.

## ఘనంగా హుజురాబాద్‌లో పెన్షనర్స్ డే వేడుకలు




**జమ్మికుంట, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):**
పెన్షనర్స్ డే సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హుజురాబాద్, జమ్మికుంట శాఖల ఆధ్వర్యంలో హుజురాబాద్ పట్టణంలోని స్థానిక సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్లో టా ప్రా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చందుపట్ల జనార్దన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ గౌరవాధ్యక్షులు కట్ట నాగభూషణ చారి మాట్లాడుతూ ప్రస్తుతం పెన్షనర్స్ తమ పెన్షన్స్ రాజ్యాంగబద్ధంగా పొందడానికి మూలకారకుడైనటువంటి డి ఎస్ నకార పెన్షనర్లకు ఆరాధ్య దైవం అని వారి సేవలు చిరస్మరణీయమని తెలుపుతూ పెన్షనర్స్ పితామహుడు డిఎస్ నకార సేవలను కొనియాడినారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ పి ఎస్, సిపిఎస్ విధానాన్ని రద్దు పరచి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేసినారు అదేవిధంగా ఈపీఎఫ్ 95 సీఎం పిఎఫ్ 98 సింగరేణి ఉద్యోగులకు కనీస పెన్షన్ 15 వేల రూపాయలు పొందునట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసినారు కార్యక్రమంలో జిల్లా శాఖ ట్రెజరరి ఇటువంటి తిరుమలయ్య జమ్మికుంట శాఖ అధ్యక్షులు గరిగ చంద్రయ్య హుజరాబాద్ శాఖ అధ్యక్షులు చొల్లేటి మల్లారెడ్డిప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య జిల్లా ఉపాధ్యక్షులు బొంగోని వెంకటయ్య సయ్యద్ మునురుద్దీన్ ఈ రామస్వామి హుజూరాబాద్ శాఖ ట్రెజరీ మండల వీరస్వామి జమ్మికుంట శాఖ గౌరవ అధ్యక్షులు శీలం మల్లేశం సీనియర్ నాయకులు మారేపల్లి మొగిలయ్య మేక మల్ల సుధాకర్ పరాంకుశం సనత్ కుమార్ తాటిపాముల కనుకయ్య దొంత హరికిషన్ గంగిశెట్టి సాంబయ్య తాళ్ల పెల్లి రామకృష్ణ తౌటం శ్రీహరి ఎం రవీందర్ ఎస్ సారభద్రస్వామి గాజర్ల బుచ్చిరాజం జక్కే లక్ష్మయ్య ఓరెమ్ వీరయ్య జాన పట్ల కాంతయ్య మంతెన సుదర్శన్ కే రవీందర్ రెడ్డి వేల్పుల భాస్కర్ నల్ల రాజిరెడ్డి గూడూరి స్వామి ఎస్ వెంకన్న ఎల్ రవీందర్ రెడ్డి వి వీరయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

## లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలి

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్
- ఎమ్మార్వో కి వినతి పత్రం అందించిన బిఆర్ఎస్ నేతలు



**జమ్మికుంట, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):**
హుజరాబాద్ పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ తరపున లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని హుజురాబాద్ ఎమ్మార్వో కి వినతి పత్రం అందించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్సి మాజీ ??కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతులపై వ్యవరిస్తున్న తీరు చాలా దుర్మార్గకరమని అరెస్ట్ చేసిన రైతులను ఆరోగ్య పరిస్థితి బాగా లేని నిమిత్తం ఆస్పత్రికి తీసుకువెళ్లే సందర్భంలో రైతులకు సంకెళ్లు వేసి తీసుకుపోవడం బాధాకరమని ఇప్పటివరకు రైతులకు ఏ ప్రభుత్వం కూడా సంకెళ్లు వేసిన చరిత్ర లేదని ఒక రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రమే రైతులను ఒక ఉగ్రవాదులగా, హత్యలు చేసిన నిందితుల్లాగా తీసుకువెళ్లడం ఏంటని ఆయన అన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు మంచి చేయడమే తప్ప ఏ ఒక్క రోజు కూడా రైతులను ఇబ్బందులు పెట్టిన సందర్భమే లేదని, రైతుబంధు ఇచ్చి రైతు బీమా ఇచ్చి రైతుల కుటుంబాలను ఆదుకున్నారే తప్ప ఇలా ఎన్నడు చేయలేదని,వారి భూములను ఇవ్వమని చెప్పినందుకు కేసులు పెట్టి వారిని జైల్లో వేసి ఇబ్బందులకు గురి చేస్తున్న ఈ రేవంత్ రెడ్డి పాలన దుర్మార్గకరమని, అరెస్టు చేసిన లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని లేనియెడల రైతుల కోసం మేము మా పార్టీ ఎంత దూరమైనా వారికి న్యాయ జరిగే వరకు వారి కోసం దేనికైనా సిద్ధపడి ఉన్నామని, దేశానికి అన్నం పెట్టే రైతన్నలను జైల్లో వేసి ఇబ్బందులకు గురి చేయడం సబబు కాదని రైతులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఉగ్యోగాల పేరుతో వసూళ్లు చేస్తున్న వ్యక్తి అరెస్ట్



**8ఇంక్లైన్ కాలనీ,డిసెంబర్ 17, నినాదం న్యూస్:**
గత 2 నెలల నుండి ధరావత్ రాజేష్ నాయక్ అల్లూరు రాజీవ్ నగర్ తండా ఎనిమిదో కాలనీకి చెందిన వ్యక్తి పిఎంఎఫ్ఎంఈ పథకం పేరుపైన అన్నపూర్ణ అల్లూరు ఫుడ్స్ కంపెనీ లో జాబ్స్ కొరకు నెలకు పదివేల రూపాయల జీతం వస్తుంది అని ఒక్కొక్కరి వద్ద 2600/- నుండి 5200/- రూపాయల వరకు వసూలు చేస్తూ స్థానిక సదానందం థియేటర్ ను లీజుకు తీసుకొని అమాయక ప్రజలను మభ్య పెడుతూ మోసం చేస్తునందున బాధితుల ఫిర్యాదు మేరకు అట్టి వ్యక్తిపై జీడికే టూ టౌన్ పిఎస్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడమైనది. నిందితుడిని కోర్టులో హాజరుపర్చనైనది. ఇట్టి వ్యక్తి బిజెపి పార్టీ పేరు చెప్పి ప్రజలను మోసం చేస్తూ ప్రభుత్వ స్కీములను ఇప్పిస్తానని చెబుతున్నాడు కానీ ప్రజలు ముఖ్యంగా మహిళలు ఇటువంటి మోసపూరిత మాటలు నమ్మి మోసపోతున్నారు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అని జీడీకే టూ టౌన్ పోలీస్ వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## యాదవ సంఘం భవనానికి భూమి పూజ

### -హైమాస్ లైట్లు ప్రారంభించిన సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, డిసెంబర్ 17(నినాదం న్యూస్):**
కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో యాదవ సంఘం భవనానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పురుమళ్ల శ్రీనివాస్ తో కలిసి భూమి పూజ చేశారు అనంతరం రజ్వీచమన్ లోని కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, నగరంతో పాటు మున్సిపాలిటీలు మరియు గ్రామాలలో అవసరమైన దగ్గర కమ్యూనిటీ భవనాలు రోడ్లు,మురికి కాలువలు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని అందులో భాగంగానే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.యాదవ సంఘ భవనానికి పది లక్షల రూపాయలు మరియు హైమాస్ లైట్లకు రెండున్నర లక్షలు మంజూరు చేయడం జరిగిందని మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తామని నరేందర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజక వర్గ ఇంచార్జి పురుమళ్ళ శ్రీనివాస్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి,డిఈ రాజేంద్ర ప్రసాద్,ఏఈ రమేష్,సాయిని తిరుపతి,శ్రీధర్ రెడ్డి,రాజిరెడ్డి,కాల్వ మల్లేశం,కాల్వ మురళి,కాల్వ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కళారత్న నేషనల్ అవార్డు అందుకున్న వావిలాల వాసులు



**జమ్మికుంట, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):**
జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామస్తులైన అన్నదమ్ములు మధుర కవి రాములు మధుర కవి కిష్టయ్య లు ఒకరు తబలా లో మరొకరు వీణ వాయిద్యంలో ప్రసిద్ధులు. వీరు చిన్నప్పటినుండి ఈ విద్యలో ఆరితేరిన వారు. తెలుగు రాష్ట్రాల్లో వందల ప్రోగ్రాములు చేశారు. గుర్తింపుగా ఈనెల 15 న డిల్లీ లో ఆంధ్రా అసోసియేషన్ ఆడిటోరియం లో జరిగిన కళాకారుల కడ్డీ వాయిద్యం ప్రదర్శనలో భాగంగా బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ ప్రెసిడెంట్ నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా మధురకవి రాములు, కిష్టయ్య ( మధురకవి బ్రదర్స్) కళారత్ననేషనల్ అవార్డు అందుకున్నారు. వావిలాల గ్రామాన్ని మరొకసారి ఢిల్లీ వరకు తీసుకువెళ్లిన మధురకవి బ్రదర్స్ కు నేషనల్ అవార్డు రావడం పట్ల వావిలాల మాజీ ఎంపిటిసి, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు మర్రి మల్లేశం హర్షం వ్యక్తం చేశారు.

## గ్రామపంచాయతీలో పోలింగ్ కేంద్రాల జాబితా



**జమ్మికుంట, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):**
త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల సందర్భంగా జమ్మికుంట మండలం లోని 20 గ్రామ పంచాయితీ లలో 2వ సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికల నిమిత్తం, అన్ని గ్రామ పంచాయితీ ల తుది పోలింగ్ కేంద్రాల జాబితాను అన్ని గ్రామ పంచాయితీ ల నందు , జమ్మికుంట మండల పరిషత్ కార్యాలయం నందు ప్రకటించడం జరిగిందని ఎంపీడీవో కే భీమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఓటర్ జాబితాలో ఉన్న మార్పులు చేర్పులు అన్ని సవరించి మండలంలోని 20 గ్రామ పంచాయతీల ఓటర్ లిస్టు జాబితాను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచడం జరిగిందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పనీర్ తింటే ఎముకలు స్ట్రాంగ్ అవ్వడమే కాదు

## - మరెన్నో ప్రయోజనాలు కూడా..!



పనీర్‌లో విటమిన్‌డి, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఈ పోషకాలు ఎముకలు, దంతాలను దృఢంగా ఉంచుతాయి. పనీర్‌ను తరచుగా మన డైట్‌లో చేర్చుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ లాభాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. పన్నీర్‌లో క్యాల్షియం కూడా ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకల సమస్యలు కూడా దూరమవుతాయి. ఇవే కాకుండా ఇతర ప్రయోజనాలు కూడా కలుగుతాయి. పన్నీర్ శాకాహారులకు మంచి ప్రోటీన్.. ఇందులో ఉండే ప్రోటీన్ శరీరంలోని కణజాలాలను నిర్మించడానికి కీలక పాత్ర పోషిస్తుంది. దీంతో పాటు కండరాల పెరుగులకు సహాయపడుతుంది. పన్నీర్‌లో క్యాల్షియం కూడా ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకల సమస్యలు కూడా దూరమవుతాయి. ఇవే కాకుండా ఇతర ప్రయోజనాలు కూడా కలుగుతాయి. పన్నీర్ శాకాహారులకు మంచి ప్రోటీన్.. ఇందులో ఉండే ప్రోటీన్ శరీరంలోని కణజాలాలను నిర్మించడానికి కీలక పాత్ర పోషిస్తుంది. దీంతో పాటు కండరాల పెరుగులకు సహాయపడుతుంది. పన్నీర్‌లో క్యాల్షియం అధిక పరిమాణంలో ఉంటుంది. దీని కారణంగా శరీరానికి తగిన క్యాల్షియం లభిస్తుంది. ఎముకలు దృఢంగా తయారవుతాయి. ఎముకలు బలహీనపడే వ్యాధులను దూరం చేస్తుంది. పన్నీర్‌లో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. పన్నీర్‌లో ఉండే గుణాలు మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీంతో పాటు పొట్ట సమస్యలు కూడా తగ్గుతాయి. బరువు తగ్గడానికి వ్యాయాలు చేస్తున్న వారు తప్పకుండా ఆహారాల్లో పన్నీర్ వినియోగించాల్సి ఉంటుంది. ఇలా చేస్తే బరువు తగ్గడమే కాకుండా కండరాలు దృఢంగా తయారవుతాయి. గుండె సమస్యలతో బాధపడేవారు కూడా క్రమం తప్పకుండా పన్నీర్‌ను తినడం చాలా మంచిది. ఇందులో ఉండే కొన్ని మూలకాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేస్తుంది. పన్నీర్‌లో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచుతుంది. సెరోటోనిన్ మన మానసిక స్థితిని మెరుగుపరచడానికి సహాయపడుతుంది.మానసిక సమస్యలు తగ్గుతాయి. ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ ఉంటుంది. ఇది ఇన్సులిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఆకస్మికంగా పెరగకుండా నిరోధించడంలో ఇది సహాయపడుతుంది. పనీర్ విటమిన్ 12 మూలం. ఇది మెదడు ఆరోగ్యానికి అవసరం. ఇది నాడీ వ్యవస్థ సరైన పనితీరును నిర్వహించడానికి సహాయపడుతుంది. ఒత్తిడి, ఆందోళనను దూరం చేస్తుంది.



# శీతాకాలంలో పచ్చి ఉల్లిపాయలను తింటే.. మైండ్ బ్లోయింగ్ బెనిఫిట్స్!

అవని

వంటగదిలో ఉల్లిపాయది అతి ముఖ్యమైన స్థానం. ఎందుకంటే ఉల్లిపాయ లేకుండా ఏ వంటకం పూర్తి కాదు. ఇకపోతే, ఉల్లిపాయలో కూడా రకాలు ఉన్నాయి. వాటిలో రెండు రకాలు ఒకటి చిన్న ఉల్లిపాయ, పెద్ద ఉల్లిపాయ. ఇందులో పెద్ద ఉల్లిపాయ కంటే చిన్న ఉల్లిపాయలో ఎక్కువ పోషకాలు ఉంటా యి. అందుకే దీనిని పచ్చిగా తింటే మరీ ఫలితాలు పొందుతా రని మన పూర్వీకులు చెప్పేవారు. ముఖ్యంగా చలికాలంలో ఉల్లిపాయలను తినడం వల్ల ఎన్నో రకాల లాభాలు కలుగు తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే గుణాలు అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ముఖ్యంగా గుండె సమస్యలు కూడా రాకుండా ఉంటాయి. విటమిన్ సి, విటమిన్ బి6, పొటాషియం, మెగ్నీషి యం వంటి పోషకాలు చిన్న ఉల్లిపాయల్లో పుష్కలంగా లభిస్తా యి. ఇవన్నీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.



సాధారణంగా చలికాలంలో జలుబు, దగ్గు, జ్వరం వంటి అంటు వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. అటువంటి పరిస్థితిలో చిన్న ఉల్లిపాయలో అధిక మొత్తంలో విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో, అంటు వ్యాధులతో పోరాడడంలో చాలా సహాయ పడుతుంది. అందుకే దీన్ని పచ్చిగా తినడం వల్ల చలికాలంలో వచ్చే అంటు వ్యాధులను దూరం చేసుకోవచ్చు. చిన్న ఉల్లిపాయ ప్రకృతిలో వేడిగా ఉంటుంది. అందుకే చలికాలంలో పచ్చి ఉల్లిపాయను తినడం వల్ల శరీరం వెచ్చగా ఉంటుంది. చలికాలంలో గుండెపోటు రాకుండా ఉండా లంటే ఉల్లిపాయ పచ్చిగా తినడం మంచిది. ఎందుకంటే ఉల్లిపాయలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలోని అనవసరమైన కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. అందువల్ల, శీతాకాలంలో ఉల్లిపాయలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తపోటు మెరుగుపడుతుంది. అధిక రక్తపోటు తగ్గుతుంది.

# ఖాళీ కడుపుతో పుదీనా టీ తాగితే ఏమవుతుందో తెలుసా..?



పుదీనా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఉదయాన్నే నిద్రలేచిన వెంటనే పుదీనా టీ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో పోషకాలు, ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. దీంతో నోటికి రుచి, వికారం నుండి ఉపశమనం లభిస్తుంది. అపానవాయువు, కడుపు నొప్పి నుండి ఉపశమనం పొందడంలో పుదీనా టీ అద్భుతంగా సహాయపడుతుంది. పొట్ట సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో పుదీనా టీ తాగటం వల్ల మీలో రోగనిరోధక శక్తి పెరుగు తుంది. ఇది యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంది. ఇవన్నీ రోగనిరోధక వ్యవస్థకు సహాయపడతాయి. పుదీనా టీతో ఈజీగా బరువు తగ్గుతారు. చక్కెర వేసి తయారు చేసిన టీ, కాఫీలు తాగే బదులు క్యాలరీలు లేని పిప్పరమెంటు టీ తాగడం వల్ల మీ రక్తంలో చక్కెర స్థాయిలు మరింత స్థిరంగా ఉంటాయి. ప్రతిరోజు ఉదయం పుదీనా టీ తాగడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. అజీర్ణం, గ్యాస్ , మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. అంతేకా కుండా పుదీనాలోని మెంథాల్ అనే పదార్థం కడుపులో వాయువును తగ్గించ డంలో సహాయపడుతుంది. పుదీనా టీ తలనొప్పి, మైగ్రేన్ నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది. శ్వాస మార్గాలను శుభ్రపరుస్తుంది, శ్వాసకోశ సమస్యలను తగ్గిస్తుంది. పుదీనా ఒత్తిడిని తగ్గించి, మనస్సును ప్రశాంతంగా ఉంచడానికి సహాయపడుతుంది.పుదీనా యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని రక్షిస్తాయి దీని వల్ల చర్మంపై ముడతలు పడకుండా ఉంటాయి. పుదీనాలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలెర్జీ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. పుదీనా ఆకుల నుండి విడుదలయ్యే సహజ మెంథాల్ నూనె ఆవిరి.. తల కండరాలను సడలించడంలో సహాయపడుతుంది. ముఖ, చర్మ సౌందర్యానికి కూడా దోహదపడు తుంది. పిప్పరమింట్ టీ సాధారణంగా ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్ లేనిది. కానీ, కొంతమందికి కడుపు నొప్పి, గుండెల్లో మంట, విరేచనాలు కూడా కలిగే అవకాశం ఉంటుంది.





నినాదం మార్కెట్ NINADAM MARKET

# రెండు బ్యాంకు ఖాతాలు ఉంటే జరిమానా చెల్లించాలా

## - ఆర్‌బీఐ కొత్త రూల్స్ నిజమేనా..




ఏదైనా వైరల్ కావాలంటే అది సోషల్ మీడియా అని చెప్పక తప్పదు. సోషల్ మీడియాలో వాస్తవాలే కాకుండా ఫేక్ న్యూస్ కూడా బాగా వైరల్ అవుతుంటాయి. ఇలాంటి వైరల్ పోస్టులను ప్రజలు నమ్మి మోసపోయే అవకాశం కూడా ఉంది. ఇటీవల బ్యాంకు అకౌంట్‌కు సంబంధించిన ఓ వార్త వైరల్ అవుతోంది.. ఇందులో నిజమెంతో తెలుసుకుందాం.. భారతదేశంలో చాలా మందికి బ్యాంకు అకౌంట్లు ఉన్నాయి. కొత్త ఆర్‌బీఐ నిబంధన వల్ల రెండు ఖాతాలు ఉన్నవారు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని కొద్ది రోజుల క్రితం ఓ పోస్ట్ వైరల్‌గా మారింది. అయితే ఆర్బీఐ అటువంటి నిర్ణయం తీసుకుందా.. రెండు లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలను కలిగి ఉన్న వారిపై ఎలాంటి జరిమానా విధిస్తారు. ఇందులో నిజమెంత? ఆర్‌బీఐ పేరుతో కొన్ని పోస్టులు వైరల్‌గా మారడంతో ఒకటి కంటే ఎక్కువ ఖాతాలు ఉన్నవారిలో గందరగోళం నెలకొంది. ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు సామాన్య జనాలకు కూడా ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. ఎందుకంటే ప్రైవేట్ సెక్టార్ ఉద్యోగులు ఒక కంపెనీలో ఉద్యోగం వదిలేసి మరో కంపెనీకి వెళ్లినప్పుడు మరో కంపెనీ వారి నిబంధనల ప్రకారం కొత్త బ్యాంకు ఖాతాను తెరుస్తుంది. దీంతో కొంతమంది ఉద్యోగులకు 4 నుంచి 5 బ్యాంకు ఖాతాలు కూడా ఉన్నాయి. ఆర్‌బీఐ పేరుతో వైరల్ అవుతున్న ఈ వార్తలపై నిజమెంతో తెలుసుకుందాం. మీకు ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉంటే జరిమానా విధించే అవకాశం ఉందంటూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. ఆ క్లెయిమ్‌లో ఆర్‌బిఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌ను ఉద్దేశించి ఆర్‌బిఐ కొత్త మార్గదర్శకాలను జారీ చేసినట్లు ఇందులో ఉంది. దీని ప్రకారం రెండు లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు కలిగి ఉన్న వ్యక్తులు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని వైరల్ అవుతున్న వార్త సారాంశం.

**ఇందులో నిజమెంత..**

ఈ క్లెయిమ్‌ను వాస్తవంగా తనిఖీ చేసి, రెండు లేదా అంతకంటే ఎక్కువ బ్యాంక్ ఖాతాలు ఉంటే పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుదనే వార్తలో ఎలాంటి నిజం లేదని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ స్పష్టం చేసింది. దీనికి సంబంధించి ఆర్‌బిఐ ఎటువంటి సర్క్యులర్‌లు లేదా మార్గదర్శకాలను జారీ చేయలేదు. అందుకే రెండు లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలను కలిగి ఉంటే జరిమానా విధిస్తారనే అంశం పూర్తిగా అబద్ధమని స్పష్టం చేసింది.

# గుడ్‌న్యూస్.. విత్‌డ్రా కోసం స్వయంగా మీరే ఆమోదించుకోవచ్చు..

## - పీఎఫ్ ఖాతాదారులకు మరో కొత్త సదుపాయం!




చందాదారులు తమ ప్రావిడెంట్ ఫండ్ డబ్బు విత్‌డ్రా విషయంలో మరింత సులభతరం కానుంది. ఉద్యోగులకు మరిన్ని సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్రం కీలక చర్యలు చేపడుతోంది. ఈపీఎఫ్‌వో నుంచి విత్‌డ్రా చేసుకునే ప్రక్రియను మరింత సులభతరం చేయనుంది. ఇది వచ్చే ఏడాదిలో అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గుడ్‌న్యూస్.. విత్‌డ్రా కోసం స్వయంగా మీరే ఆమోదించుకోవచ్చు.. పీఎఫ్ ఖాతాదారులకు మరో కొత్త సదుపాయం! ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ చందాదారులు తమ ప్రావిడెంట్ ఫండ్ డబ్బును స్వయంచాలక ప్రక్రియ ద్వారా ఉపసంహరించుకోవడానికి "స్వీయ-ఆమోదం" విధానాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. అంతే మీరు పీఎఫ్ విత్‌డ్రాను మీరే ఆమోదించుకోవచ్చు. ఇది వరకు పీఎఫ్ సంస్థ అప్రూవల్ వచ్చే వరకు ఆగాల్సి ఉండేది. అప్పుడు మన అకౌంట్లో డబ్బులు జమ అయ్యేవి. ఇప్పుడు ఎంప్లాయి తన పీఎఫ్ డబ్బు కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత తానే స్వయంగా ఆమోదించుకునే సదుపాయం రానుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఈ విధానం అందుబాటులోకి వస్తుందని ది ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. ప్రస్తుతం పీఎఫ్ నిధులను ఉపసంహరించుకోవడంలో చెక్, ఇతర వివరాలు, సబ్‌స్క్రైబర్‌లు ఫారమ్‌లను సమర్పించి, ఆమోదాల కోసం వేచి ఉండాలి. ఈ కొత్త విధానం అందుబాటులోకి వస్తే ఉద్యోగి తానే ఆమోదం చేసుకోవచ్చు. ప్రక్రియను చాలా వేగంగా, అవాంతరాలు లేకుండా చేస్తుంది. ఈ సిస్టమ్ అప్‌గ్రేడెడ్ టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్‌లో పనిచేస్తుందని, మార్చి 2025 నాటికి సిద్ధం అవుతుందని అధికారిక వర్గాలను ఉటంకిస్తూ నివేదిక తెలిపింది. చందాదారులు విద్య లేదా వివాహం కోసం పీఎఫ్ నిధులలో 50శాతం వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు.హెూమ్ లోన్ రీపేమెంట్ కోసం, ఉపసంహరణ పరిమితి 90శాతం వద్ద వరకు ఉంటుంది. ప్రస్తుతం దాని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇది సభ్యులు సుదీర్ఘమైన మాన్యువల్ ఆమోద ప్రక్రియను దాటవేయడానికి అనుమతిస్తుంది. ఈ అప్‌గ్రేడ్‌లో భాగంగా చందాదారులు త్వరలో ఈపీఎఫ్ అధికారులచే ఇప్పటికే ఉన్న మాన్యువల్ చెక్‌ల ద్వారా కాకుండా, వారి ఉపసంహరణ మొత్తం గురించి నేరుగా తెలియజేయవచ్చు.

**ఇవి కూడా చదవండి..** బట్టలు ఉతికేటప్పుడు ఈ తప్పులు చేకండి.. త్వరగా పాడైపోతాయి! ప్రాసెస్ చేసిన క్లెయిమ్ మొత్తాన్ని కలిగి ఉండేలా కి లింక్ చేయబడిన డిజిటల్ వాలెట్‌ను ప్రవేశపెట్టవచ్చని కూడా నివేదికలు వెల్లడించాయి. ఈ ఫీచర్ పరిశీలనలో ఉంది. అయితే దీనిని ఖరారు చేయడానికి ముందు భారతీయ రిజర్వ్ బ్యాంక్ తో తదుపరి సంప్రదింపులు అవసరం.24 చివరి నాటికి మొత్తం కార్పస్ రూ. 24.75 లక్షల కోట్లు. ఈ మొత్తంలో దాదాపు 63శాతం ప్రభుత్వ సెక్యూరిటీలు, కార్పొరేట్ బాండ్‌లు, ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్స్ తో సహా ఆర్థిక సాధనాల్లో పెట్టుబడి ఉంది.

**రూ.1 లక్ష వరకు క్లెయిమ్‌ల కోసం ఆటో-ప్రాసెసింగ్..**

ఈపీఎఫ్‌వో ఇప్పటికే రూ. 1 లక్ష వరకు ముందస్తు క్లెయిమ్‌ల కోసం ఆటో-మోడ్ ప్రాసెసింగ్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఒక్క మార్పు వల్ల 40శాతం క్లెయిమ్‌లు మాన్యువల్ జోక్యం లేకుండా స్వయంచాలకంగా ప్రాసెస్ అవుతాయి. ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్‌తో మాట్లాడిన కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవియా.. పీఎఫ్ విత్‌డ్రాలను వీలైనంత సులభతరం చేయడమే లక్ష్యమని అన్నారు. భవిష్యత్తులో చందాదారులు తమ పీఎఫ్ డబ్బును ఏటీఎంల ద్వారా విత్‌డ్రా చేసుకునేందుకు వీలు కల్పించే ఆలోచన ఉందని ఆయన అన్నారు.



# మెరిసేదంతా బంగారం కాదా.. గీటుకు నిలిచేదే బంగారం..

## - హాల్‌మార్క్ ఉన్నా నకిలీదేనా వీడియో వైరల్

బంగారానికి భారతీయులకు అవినావభావ సంబంధం ఉంది. బంగారం అంటే స్టేటస్ సింబల్.. అలంకరణ కోసం ఉపయోగించే వస్తువు మాత్రమే కాదు.. ఆర్థిక భరోసా అని కూడా భావిస్తారు. అందుకనే సామాన్యుల నుంచి ధనవంతుల వరకూ వివిధ రకాల బంగారు ఆభరణాలను కొనుగోలు చేయడానికి ఆసక్తిని చూపిస్తారు. అందుకనే బంగారం ధరలు ఎంత పెరిగినా పెరుగుతున్నా అమ్మకాలు ఏ మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. మెరిసేదంతా బంగారం కాదా.. గీటుకు నిలిచేదే బంగారం.. హాల్‌మార్క్ ఉన్నా నకిలీదేనా వీడియో వైరల్ బంగారం అంటే ఇష్టపడని మనిషి ఉండడంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా భారతీయులు అత్యధికంగా ఇష్టపడే వాటిలో బంగారం ఫస్ట్ ప్లేస్ లో ఉంటుంది. అయితే గత కొన్ని ఏళ్ల క్రితం వరకూ బంగారం వస్తువులు చేయించుకోవడం అంటే అది ఒక ముఖ్య ఘట్టం. ఇంటికి కంసాలి వచ్చి.. నగల నమూనా చూపించి స్వహస్తాలతో అందంగా ఆభరణాలు చేసి ఇచ్చేవారు. ఆ నగలు అందుకున్న యజమానులు కూడా మజూరితో పాటు అతనికి స్వయం పాకం ఇచ్చి గౌరవించి సంతోషాన్ని తెలియజేసేవారు. కాలంలో వచ్చిన మార్పుల్లో భాగంగా బంగారం వస్తువుల కొనుగోళ్ళ విషయంలో కూడా మార్పులు వచ్చాయి. ఇప్పుడు నగల షాపు కి వెళ్లి తమకు నచ్చిన డిజైన్స్ లో కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసే నగలపై హాల్‌మార్క్ ముద్రించి ఉండాలని.. అవి మంచి బంగారం అని ప్రభుత్వం సూచిస్తుంది. అదే వినియోగదారులు కూడా నమ్ముతున్నారు. అందుకనే హాల్‌మార్క్ ఉన్న నగాలనే కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇప్పుడు ఇలా హాల్‌మార్క్ ముద్రించి ఉన్న బంగారం అసలా నకిలీనా అనే చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇందు ఉదాహరణగా నిలుస్తోంది. తాజాగా వైరల్ అవుతోన్న ఒక వీడియో. వైరల్ అవుతున్న వీడియోలో ఒక వ్యక్తి బంగారు ఆభరణంలో బంగారం ఎంత ఉంది అనే విషయాన్నీ ఒక చిన్న టెక్నిక్‌తో చూపించాడు. ఇది చూసిన పసిడి ప్రియులు షాక్ అవుతున్నారు. ఎందుకంటే ఆ నగ చూడానికి ఒరిజినల్ గోల్డ్ లా ఉంది. పైగా ప్రభుత్వం సర్టిపై చేసిన హాల్ మార్క్ కూడా ముద్రించి ఉంది. అయితే ఆ నగను ఆ వ్యక్తీ పరీక్షిస్తూ ఆ బంగారం లాకెట్ ను చూపిస్తూ బంగారం పూత పూసి మోసం చేశారని.. 5% మేకింగ్ చార్జీలు తక్కువకు నగలు అమ్మకం అని అనగానే వెనకా ముందు చూసుకోకుండా కొనేస్తున్నారు కనుక ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని వివరించాడు. ఆ లాకెట్ బంగారం కాదు అని నిరుపించానికి ముందుగా ఒక గీటు రాయికి తీసుకుని దానిపై ఆ నగను రుద్దాడు. తర్వాత ఒక జెల్ వంటిది ఆ బంగారం మీద పోశాడు. అప్పుడు అది నకిలీ నగ అని తేల్చు చెబుతూ.. తక్కువ ధరకు వస్తున్నాయని.. ఏ నగల దుకాణం బడితే ఆ నగల దుకాణంలోకి వెళ్ళవద్దు.. గుర్తింపు ఉన్న నగల షాప్స్ లో మాత్రమే వస్తువులు కొనుగోలు చేయమని సూచించాడు. లేదంటే మోసపోయే అవకాశం ఎక్కువ ఉందని హెచ్చరిస్తున్నాడు. ఈ వీడియో ప్రస్తుతం ఓ రేంజ్ లో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 1.5 మిలియన్‌కు పైగా వ్యూస్ ను సొంతం చేసుకున్న ఈ వీడియోపై నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. నెటిజన్లు మోస పోయేవారు ఉన్నంత కాలం మోసాలు జరుగుతూనే ఉంటాయని.. కొంచెం తక్కువ ధరకు అంటే చాలు ఎగబడి కొనే వినియోగదారులు ఉన్నంత కాలం ఇలాంటి మోసాలు కొనసాగుతాయని కామెంట్ చేస్తున్నారు. అంతేకాదు బంగారం కొనే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని కూడా సూచిస్తున్నారు.

## 2వ ఏఎన్ఎంల ముందస్తు అరెస్టు

### -రెగ్యులర్ చేయాలని డిమాండ్



**సుల్తానాబాద్, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని చలో అసెంబ్లీకి రెండవ ఏఎన్ఎంలు పిలుపు నివ్వడంతో మంగళవారం ఏఎన్ఎంలను పోలీసులు ముంద స్తు అక్రమ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రెండవ ఏఎన్ఎంలు మాట్లాడుతూగత18 సంవత్సరాలు గా చాలి చాలని వేతనాలతో వెట్టి చాకిరి చేస్తున్నా మని అయినా కానీ మమ్మల్ని ప్రభుత్వం గుర్తించి ఇంతవరకు రెగ్యులర్ చేయకపోగా,ఖాళీ పోస్టుల కు రాత పరీక్ష నిర్వహించడం ఎంతవరకు సమం జసమని ప్రభుత్వాన్ని నిలదీశారు. పనికి తగ్గ ప్రతి ఫలం ఇవ్వకపోగా,ప్రభుత్వం పనిభారం మోపడం తో రాత్రింబవళ్లు వెట్టి చాకిరి చేస్తున్నామని ఆవేద న వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రెండవ ఏఎన్ఎం లను,రెగ్యులరైజేషన్ చేస్తానని కాలయాపన చే శారని,అప్పుడు ప్రతిపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తమ ఆందోళన కార్యక్రమాలకు మద్దతు తె లిపారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా అ దే పద్ధతి అవలంబిస్తూమమ్మల్ని అక్రమ అరెస్టు లు చేస్తూ,మనోభావాలను దెబ్బతీస్తున్నారనిఆ రోపించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కడారి సునీల్ వారికి సంఘీభావం తెలిపి రెండవ న్యాయ మైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, అ క్రమఅరెస్టులను ఖండిస్తున్నట్లు కడారీ సునీల్ పే ర్కొన్నారు. 2వ ఏఎన్ఎంలు స్వరూపరాణి,శారద, రజిత, రమాదేవి, రాజేశ్వరి, భూలక్ష్మి,వీణ,పద్మాంజలి పాల్గొన్నారు.

## 31లోపు మైనార్టీ మహిళలు ఉచిత కుట్టు మిషన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలి

### -జిల్లా ఇంఛార్జి మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జే.రంగా రెడ్డి

**పెద్దపల్లి,డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** డిసెంబర్ 31 లోపు మైనార్టీ మహిళలు ఉచిత కుట్టు మిషన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంఛార్జి మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జే. రంగా రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలం గాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వారు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా ఉచిత కుట్టు మిషన్లు అందిస్తున్నారని, జిల్లాలో ఉన్న మైనార్టీ మహిళలు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు,బుద్ధిస్ట్, జైన్స్,పార్సిస్,డిసెంబర్ 31లోగా tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకొని ఆ దరఖాస్తు హార్డ్ కాపీ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయం పెద్దపల్లి నందు అందించాలని అన్నారు. ఉచిత కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు తో పాటు తెల్ల రేషన్ కార్డ్ లేదా ఆహార భద్రత కార్డ్ లేదా గ్రామీణ ప్రాంతంలో 1,50,000, పట్టణ ప్రాంతాలు రెండు లక్షలకు పెంచకుండా వార్షికాదాయ ధ్రువీకరణ పత్రం,18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు ఉండాలని,తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ద్వారా కచ్చితంగా టైలరింగ్ కోర్స్ నేర్చుకుని టైలరింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, ఒక కుటుంబానికి ఒక కుట్టు మిషన్ మాత్రమే ఇవ్వబడుతుందని,కనీసం 5 వ తరగతి విద్యార్హత ఉండాలని అన్నారు. ఆసక్తి అర్హత గల మహిళలు డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలని,నిరుద్యోగ నిరుపేద మహిళలు విడాకులు తీసుకున్న మహిళలు వితంతువులు అనాథ మరియు ఒంటరి మహిళలకు ప్రాధాన్య ఇవ్వ పడుతుందని జిల్లా ఇంఛార్జి మైనార్టీ సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నిరసన దీక్షను జయప్రదం చేయండి

### -సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్



**మంథని డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** మంథని మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికై బుధవారం నిర్వహిస్తున్న నిరసన దీక్షను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ కార్మికులతో కలసి మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేసి కాంటాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిందని సంవత్సరకాలం గడిచిన హామీల అమలు కావడం లేదని స్థానిక మున్సిపాలిటీలో గత నాలుగు సంవత్సరాల సబ్బులు నూనెలు చెప్పులు దుస్తుల కుట్టుకూలీ డబ్బులు ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెంచిన వెయ్యి రూపాయల వేతనం అమలు చేయడం లేదని ఎన్.ఎం.ఆర్ కార్మికులం కాంట్రాక్ట్ కార్మికుల లిస్టులో విలీనం చేయాలని ఇతర సమస్యల పరిష్కారం కొరకు బుధవారం18న మున్సిపల్ కార్యాలయం ముందు ఒకరోజు నిరసన దీక్ష చేపడుతున్నామని నిరసన దీక్షలో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు చిప్పకుర్తి చందు, సింగారపు గట్టయ్య, ఎడ్లపల్లి రాజయ్య, పోచమ్మ, భాగ్య, సుక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్ల పంపిణీ చేసిన కొలుముల



**ధర్మారం డిసెంబర్ 17 (నినాదం న్యూస్) :** శీతాకాలంలో రోజురోజుకు చలి విపరీతంగా పెరుగుతుండడంతో ఎన్నారై కొలువుల దామోదర్ యాదవ్ పేదలకు దుప్పట్ల పంపిణీ చేశాడు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే సతీమణి కాంత్ కుమారి హాజరై పంపిణీ కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్ఐ కులుమల దామోదర్ యాదవ్ పలు రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండడం అభినందనీయమని ఎండాకాలంలో చలివేంద్రాలు శీతాకాలంలో దుప్పట్లు వాన కాలంలో గొడుగులు ఇలా ఏ కాలానికి ఆ కాలం తన వంతు సేవా కార్యక్రమాలు చేపడుతూ ఉన్నాడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవి జనార్ధన్ వేల్పుల నాగరాజు జంగ మహేందర్ తుమ్మల తిరుపతి దేవి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




**సుల్తానాబాద్, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** క్షయ వ్యాధి పై సమాజంలో ప్రతి ఒక్కరూ అవగా హన కలిగి ఉండాలని డబ్ల్యూహెచ్ఓ ఆర్గనైజర్ డాక్టర్ విష్ణు విద్యార్థులకు సూచించారు. సుల్తా నాబాద్ మండలం భూపతిపూర్ లోని మహాత్మ జ్యోతిరావు పూలేరెసిడెన్షి యల్ స్కూల్, కాలేజ్ లో క్షయవ్యాధిపై అవగాహనసదస్సు నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబి వల్ల కలిగే పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించ డంప్రతి విద్యార్థిపై ఉందన్నారు. టీబీ మహమ్మా రిని అంతంచేయడానికి కృషి చేయాలని సూచిం చారు. టీబి వ్యాధిగ్రస్తుల కు ప్రభుత్వం నుండి ని క్షయ్ పోషణ మందులు వాడిన అన్ని రోజులు పౌ ష్టికాహారం కోసం ప్రతి నెల5 వందల రూపాయలు బ్యాంకు ఖాతాలో జమచేయడం జరుగుతుందని అన్నారు. 2025 కల్లా టీబీ మహమ్మారి తరిమి కొ ట్టాలనిఅనే లక్ష్యంగా నిక్షయ్మిత్ర కార్యక్రమాలను గ్రామ గ్రామాన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేశం తోపాటు డాక్టర్ సంతోష్,డాక్టర్ బ్లేస్సి,టిబి సూపర్వైజర్ సురేంద ర్,ప్రభాకర్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలను మెరుగ్గా నిర్వహించాలి

- గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని రెగ్యులర్ గా మానిటర్ చేయాలి
- ప్రీ స్కూల్ లో పిల్లలకు బోధన పకడ్బందీగా జరగాలి
- పోషక లోపం గల పిల్లలకు బాలామృతం ప్లస్ సరఫరా చేయాలి
- మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష




**పెద్దపల్లి,డిసెంబర్17(నినాదం న్యూస్):** జిల్లాలో ఉన్న అంగన్వాడి కేంద్రాలను మరింత మెరుగ్గా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ. హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పనితీరు పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అంగన్ వాడి కేంద్రాల పనితీరు, అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు లబ్ధిదారుల వివరాలు,ప్రీ స్కూల్ నిర్వహణ, అనేమియా నివారణ మొదలగు వివరాలను కలెక్టర్ సంక్షేమ అధికారి అడిగి తెలుసుకున్నారు. నెలలో ఎన్ని అంగన్వాడీ సెంటర్లను తనిఖీ చేశారు, అక్కడ గమనించిన పరిస్థితులు మొదలగు వివరాలను కలెక్టర్ సూపర్వైజర్ లను ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ. హర్ష మాట్లాడుతూ,అంగన్ వాడి కేంద్రాల నిర్వహణ మరింత మెరుగు కావాల్సిన అవసరం ఉందని,పిల్లలకు యూనిఫామ్ ఎక్కడా కనపడలేదని, అంగన్ వాడి టీచర్లు సమయపాలన పాటించడం లేదని,కేంద్రాల నిర్వహణ శుభ్రంగా లేదని,ఈ పరిస్థితుల్లో వెంటనే మార్పులు రావాలని కలెక్టర్ సూపర్ వైజర్ లను ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలను సకాలంలో ఓపెన్ చేయాలని,పిల్లలకు యూనిఫామ్ పంపిణీ చేయాలని, పిల్లలు శుభ్రంగా ఉండాలని,బురద, చెత్త లో ఆడుకుంటున్నట్లు పిల్లలను గమనిస్తే టీచర్ల నుంచి సూపర్ వైజర్, సిడిపిఓ వరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. సామ్,మాల్ న్యూట్రిషన్ సంబంధించి వాస్తవిక పరిస్థితులు రిపోర్ట్ చేయాలని,ఎంత ఎక్కువ మంది గుర్తిస్తే అంత మంచిదని కలెక్టర్ తెలిపారు. గర్భిణీ మహిళలు పౌష్టికాహారం తీసుకుంటున్నారో లేదా,ఐరన్ మాత్రలు వేసుకుంటున్నారా అనే అంశం పై నిరంతరం పర్యవేక్షణ చేయాలని,గర్భిణీ మహిళలకు సంబంధించి ప్రతి అంశాన్ని ట్రాక్ చేసుకునేలా అంగన్వాడీ కేంద్రాల వద్ద వ్యవస్థ ఏర్పాటు చేయాలని, గర్భిణుల ఏఎన్సీ రిజిస్ట్రేషన్,చెక్ అప్ సకాలంలో జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రీ స్కూల్లో పిల్లల అటెండెన్స్ తగ్గకుండా చూసుకోవాలని,అంగన్ వాడి కేంద్రాలలో పిల్లల ఎదుగుదలను రెగ్యులర్ గా పరీక్షించాలని,పిల్లలకు యూనిఫామ్ సరిగ్గా ఉండాలని,ప్రతి సూపర్ వైజర్ పరిధిలో ఉన్న అంగన్ వాడి కేంద్రాల సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించాలని, అనవసరమైన ధర్నాలకు ఆస్కారం ఇవ్వవద్దని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల ఎదుగుదలను 100% మానిటరింగ్ చేయాలని,పోషణ లోపంతో బాధపడే పిల్లలను గుర్తించి వారికి బాలామృతం ప్లస్ సరఫరా అయ్యే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. అంగన్ వాడి కేంద్రాలలో గుడ్లు, బాలామృతం ప్లస్ కు ఎటువంటి లోటు రాకుండా చూసుకోవాలని అన్నారు. పోషణ లోపంతో ఎత్తు తక్కువ, బరువు తక్కువ గల పిల్లలను గుర్తించాలని సూచించారు. సంక్రాంతి నాటికి జిల్లాలో అనాథ శరణాయాలకు,అనాథ పిల్లలకు సంబంధించిన సంపూర్ణ వివరాలను సేకరించి నివేదిక అందించాలని కలెక్టర్ అన్నారు. ఆర్.బి.ఎస్.కే వైద్యుల వచ్చి వైద్య పరీక్షలు నిర్వసిస్తున్నారా, పిల్లలకు ఎవరికైనా గుండె సంబంధిత జబ్బులు మొదలగు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకుని రావాలని పిల్లలకు మెరుగైన వైద్యం తక్షణం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం రంగంపల్లి లో నూతనంగా నిర్మిస్తున్న సఖి కేంద్రం భవనాన్ని కలెక్టర్ సందర్శించి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి,జనవరి 1 నూతన సంవత్సరంలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఈఈ పంచాయతీ రాజ్ ను కలెక్టర్ ఆదేశించారు. ఎస్సీ రెసిడెన్షియల్ హాస్టల్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను పరిశీలించారు. సుల్తానాబాద్ లో నిర్మాణం అవుతున్న వృథాశ్రమం, బాలల సదనం పనులు పరిశీలించి, త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈఈ పంచాయతీ రాజ్ గిరిష్ బాబు,పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్,జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

# రైతులను జైల్లో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దే

- రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలు సుభిక్షంగా ఉండేవి
- జైల్లో ఉన్న రైతులను వెంటనే విడుదల చేయాలే. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** దేశానికి అన్నం పెట్టే రైతులను జైల్లో పెట్టిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు లగచర్ల రైతులను రేవంత్ సర్కార్ నుంచి కాపాడాలని, రేవంత్ సర్కార్‌కు కనువిప్పు కల్గిగేలా చూడాలని కోరుతూ మంథని పట్టణంలోని బారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు మంగళవారం ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్పగా రచించిన బారత రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని ఆయన విమర్శించారు. రైతును రాజుగా చూసే ఈ దేశంలో రాష్ట్రంలో 35రోజులుగా బెయిల్ రాకుండా ఏదో సాకు పెడుతూ రైతులను జైల్లోపెట్టించారని, రైతుల చేతులకు బేడీలు వేసి చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని సెక్షన్ 3ని అనుసరించి తెలంగాణ తెచ్చుకున్నామని, పదేళ్ల కాలంలో కేసీర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా వర్ధిల్లారని, కానీ ఈనాడు అన్నం పెట్టే రైతులు 35రోజులుగా జైల్లో మగ్గుతున్నారని అన్నారు. భూసేకరణ చట్టం అమలు చేయకుండా రాత్రి సమయంలో తండాలపై సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి, ఆయన మాఫియా మిడుతల దండుల్లా పడి భూములు గుంజకున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వానికి భూములు అవసరమైతే భూసేకరణ చట్టం ద్వారా సేకరణ చేయాలే కానీ ఇలా దౌర్జన్యాలు చేయడం ఎక్కడా చూడలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో ఏ వర్గం ప్రశాంతంగా లేదని, ప్రశ్నిస్తే దాడులు, కేసుల బనాయిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, ముఖ్యమంత్రి నిర్ణయాలతో దేశ చరిత్రలో ఎక్కడా జరుగని విధంగా లగచర్లలో కలెక్టర్‌ను నెట్టివేశారని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్కార్‌కు కనువిప్పు కల్గి జైల్లో ఉన్న రైతులను విడుదల చేయాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆత్మహత్యాయత్నానికి కారకులు ఎవరు?





- వ్యక్తిగత, కుటుంబ కలహాలేనా...!!!
- రాజకీయ రంగు అంటుతున్న వైనం


**మంథని డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** తనపై జరిగిన దాడిని అవమానంగా భావించి ఓ యువకుడు ఆత్మహత్యయత్నం చేసుకున్న సంఘటన రోజుకో మలుపు తిరుగుతోంది. మంథనిలోని శ్రీపాద కాలనీకి చెందిన రాజ్ కుమార్ అనే యువకుడు ఈ నెల ఏడున స్థానిక హమాలీ వాళ్ళతో గొడవ పడ్డాడు. తమతో రాజ్ కుమార్ అకారణంగా గొడవ పెట్టుకున్నాడని హమాలీ సంఘం సభ్యులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడిపై హమాలీ సంఘం సభ్యులే దాడి చేసి అకారణంగా కొట్టారనీ యువకుడితో పాటూ అతని తండ్రి ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు శ్రీపాద కాలనీలో యువకుడు అతని కుటుంబ సభ్యులతో గొడవ పెట్టుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం రాజ్ కుమార్ మానసిక ప్రవర్తన సరిగా లేదని జూలాయిగా తిరుగుతూ మత్తుకు బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతూ ఉండేవాడని దీంతో మనస్తాపం చెందిన ఆ యువకుడు తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. మద్యం మత్తులో హమాలీసంఘం లో సభ్యుని గా ఉన్న సాగర్ అనే వ్యక్తి తో గొడవ జరిగిందని అది మనసులో పెట్టుకొని సాగర్ మరికొంతమంది తో కలిసి రాజ్ కుమార్ పై దాడి జరిగిందని తెలిపారు. తన కుమారుడి ఆత్మహత్యా యత్నానికి కారకులైన హమాలీలపై చర్యలు తీసుకోవాలని తండ్రి దేవేందర్ డిసెంబర్ 12వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాధు చేశాడు. యువకుడి తండ్రి దేవేందర్ మంచిర్యాల జిల్లాలో జైపూర్ పోలీస్ స్టేషన్లో హోమ్ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. తన కుమారుడి ఆత్మహత్య యత్నం కొందరు రాజకీయం చేస్తున్నారని అతను ఆరోపిస్తున్నారు. ఇందులో ఎవరికీ ఎంత ప్రమేయం ఉన్నదనే విషయంపై పోలీసుల విచారణా లోనే తేలుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనలో కొందరిని బలి చేసేందుకు మరీ కొందరు విపరీతంగా ప్రయత్నం చేస్తున్నట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# రోడ్డు భద్రత ప్రమాణాలతో ప్రమాదాలను నివారించవచ్చు




**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, డిసెంబర్ 17(నినాదం న్యూస్):** రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించడం ద్వారా రోడ్డు ఆక్సిడెంట్లను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నెలవారి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. గత నెలలో జరిగిన రోడ్డు ఆక్సిడెంట్ల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని వాటికి గల కారణాలను విశ్లేషించారు. వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. జాతీయ రహదారిపై పరిమితికి లోబడి వాహనం వేగం ఉండాలని పరిమితికి మించి వాహనాన్ని నడిపినట్లయితే స్పీడ్ గన్ ద్వారా గుర్తించి వారిపై ఫైన్ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. వాహనదారులు కచ్చితంగా వాహనానికి సంబంధించిన కాగితాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 45 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో సంభవించిన మరణాలలో 70% నేషనల్ హైవే మీదనే జరిగినట్టుగా గుర్తించామని, ఈ ప్రమాదాలకు ముఖ్య కారణం అతివేగం, నిర్లక్ష్య పూరిత డ్రైవింగ్ అని తెలిపారు. స్కూల్ పిల్లలు ఎవరైనా రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అతివేగంగా, రాంగ్ రూట్లో వాహనాన్ని నడిపి ప్రమాదాన్ని కొని తెచ్చుకోకూడదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ ను తప్పకుండా పాటించాలని, హెల్మెట్ ను ధరించాలని తెలిపారు. ప్రతిరోజు వెహికల్ చెకింగ్ లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ , రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి వాటిని గుర్తించి వారికి ఫైన్ విధించడం జరుగుతుందన్నారు. మైనర్లకు వాహనాన్ని ఇచ్చినట్లయితే తల్లిదండ్రుల పైన కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు, ఆర్ అండ్ బి ఇంజనీర్, పంచాయతీ రాజ్ రోడ్ శాఖ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 8 గంటలు పగలు.. 16 గంటల పాటు రాత్రి!




**8 ఇంక్లైన్ కాలనీ, డిసెంబర్ 17, నినాదం న్యూస్:** డిసెంబర్ నెలలో అరుదైన ఘటన జరగబోతుంది. ఈ నెల 21న సుదీర్ఘమైన రాత్రి ఉండనుంది. దాదాపు 16 గంటల పాటు రాత్రి సమయం.. మిగిలిన 8 గంటల పాటు పగలు ఉండనుంది. సాధారణంగా ఇలా జరగడాన్ని అయనాంతం అని పిలుస్తారు. అయితే అయనాంతం ఏర్పడిన రోజున భూమి ఉత్తరార్థగోళం సూర్యునికి ఎక్కువ దూరం వెలుతుంది. ఆ సమయంలో చంద్రకాంతి భూమిపై చాలా సమయం ఉంటుంది. ఇది శీతాకాలంలో ఏర్పడుతున్నందున దీనిని 'శీతాకాలపు అయనాంతం' అని అంటారు.

## పెద్దపల్లి మార్కెట్ చైర్మన్ ను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు



**సుల్తానాబాద్, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల ల క్ష్మి రాజ మల్లు మంగళవారంపెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ నూతన చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చే సిన సందర్భంగావారిస్వగృహంలో ఈర్లస్వరూప ను మర్యాద పూర్వకంగాకలిసి శాలువాతో సత్క రించి శుభా కాంక్షలు తెలియజేశారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**వెల్గటూర్,డిసెంబర్17(నినాదం న్యూస్):** ఉమ్మడి వెల్గటూర్ మండలంలో పలు అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకున్న పలువురు లబ్ధి దారులకు మండల అధికారులు, నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలకు 111 మంది లబ్ధి దారులకు 30,19,000/- రూపాయల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శైలెందర్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని,పది నెలల కాలంలోనే ప్రజా సంక్షేమం కోసం ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ శేఖర్,ఎంపిడిఓ, ఏ ఎంసి చైర్మన్ గోపిక, వైస్ చైర్మన్ తిరుపతి,మాజీ సర్పంచ్ లు మెరుగు మురళి గౌడ్,, చక్రిధర్, గూడా రాంరెడ్డి, మాజీ ఎంపిటిసిలు అనుమాల మంజుల, రంగు తిరుపతి, పుదారి రమేష్, బందెలు ఉదయ్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ మెరుగు నరేష్ గౌడ్,గంధ్ర శ్రీకాంత్ రావు, డైరెక్టర్లు జూపాక ప్రవీణ్, పోలోజు శ్రీనివాస్, సప్ప లింగయ్య, బిసగోని హరీష్, జగదేవపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు తిరుపతి, మన్నే జితేందర్, వెంకటస్వామి, గాజుల విజయ్, గెల్లు శ్రీనివాస్, శ్రవణ్ రెడ్డి, గోపతి నరేష్, గుమ్ముల వెంకటేష్, మేడి మల్లేష్, బిడారి భూమయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు స్వశక్తితోనే
# క్రీడలలో రాణించాలి

**ప్రతి ఒక్కరూ గొప్ప క్రీడాకారులుగా ఎదగాలి - జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**




**ములుగు ప్రతినిధి,(నినాదం):** విద్యార్థులు స్వశక్తితోనే క్రీడలలో రాణించాలని, గ్రామస్థాయి క్రీడల నుండి జాతీయస్థాయి క్రీడల వరకు ఎదగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకాంక్షించారు. మంగళవారం ములుగు మండలం జాకారం గ్రామంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్, జిల్లా క్రీడల అధికారి తుల రవితో కలిసి సీఎం కప్-2024 జిల్లా స్థాయి క్రీడలకు ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలలో రాణించినప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరికి డబ్బే ప్రధానం కాద ని ఆరోగ్యం ముఖ్యమని, క్రీడా నైపుణ్యం స్వంత శక్తితో వస్తుందని అన్నారు. గ్రామ స్థాయి, మండల స్థాయి క్రీడలలో రాణించి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక కావాలని, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా యంత్రాంగం మంచి గుర్తింపు నిస్తుందని తెలిపారు. జిల్లా స్థాయి కబడ్డీ, హ్యాండ్ బాల్, అథ్లాంటిక్, యోగ, కిక్ బాక్సింగ్ క్రీడల్లో పాల్గొంటున్నారని, వారికి ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. క్రీడాకారుల కోసం ఎంత ఖర్చయినా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, క్రీడాకారులు పదిమందికి ఆద ర్శంగా ఉండాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ప్రతిభ కనపరచి జిల్లా స్థాయికి వచ్చిన క్రీడాకారులు అదే ఉత్సా హంతో ఇక్కడ నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లాలని అన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ మాట్లాడుతూ క్రీడాల వల్ల దేహ దారుఢ్యం, క్రమశిక్షణ ఏర్పడు తుందని, క్రీడ ల్లో గెలుపు ఓటమిలు సహజమేనని, ఓడిన వాళ్లు కుంగి పోకుండా గెలుపుకై ముందుకు సాగాలన్నారు. సీఎం కప్ మన జిల్లాకి వచ్చే లా మిగతా క్రీడాకారులతో పోటీ పడాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసో సియేషన్ ప్రెసిడెంట్ పైడాకుల అశోక్, ఎంపీ డిఓలు, పిటిలు, 9 మండలాల క్రీడాకారులు, పాల్గొన్నారు.



### ప్రభుత్వ హాస్టల్లో కామన్ డైట్ మెనూను
# పక్కగా అమలు చేయాలి

**చిట్యాల బాలికల గురుకుల పాఠశాల తనిఖీ చేసిన కలెక్టర్**




**భూపాలపల్లి, డిసెంబర్ 17 (నినాదం న్యూస్):** పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం నిర్వహించే హాస్టల్లో నిబంధనల ప్రకారం కామన్ డైట్ మెనూను పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం చిట్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో అందిస్తున్న వసతులు, విద్యార్థుల ఆహార మెనూ, వంట గది, స్టోర్ రూం,డైనింగ్ హాల్‌లను, విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనంను పరిశీలించి, కామన్ డైట్ మెనూని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల నుంచి భోజన నాణ్యతపై ఫీడ్‌బ్యాక్ తీసుకుని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెనూ పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇటీవల ప్రభుత్వం డైట్ చార్జీ లు పెంచిన నేపథ్యంలో



రాష్ట్ర వ్యాప్తంగా ఒకటే కామన్ డైట్ అమలు చేస్తున్నదని, రోజు వారి అందించే డైట్ వివరాలు ఫ్లెక్సీ ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువు అత్యంత ప్రాధాన్యమైనవని తెలిపారు. పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో కొంత స్థలం కాలిగా ఉందని అందులో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయని చదును చెయ్యించాలని ప్రిన్సిపల్ కోరగా చదును చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఏదేని లోపం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## క్లిక్ క్లిక్ నినాదం
# చేనంతా తెల్ల బంగారమాయనే



ఖరీఫ్ సీజన్ రైతులు ఎక్కువగా సాగు చేసే పత్తిపంట ఈసారి మంచి దిగుబడులు ఇచ్చింది. ఆశాజనకంగానే పంట దిగుబడి వచ్చినా కూలీల కొరత రైతులను ఆందోళనలకు గురి చేస్తోంది. యాసంగి పంట సాగు ముమ్మరం కావడంతో పత్తి తీయడానికి కూలీల కొరత ఏర్పడటంతో ఇలా అనేక చేనుల్లో తెల్ల బంగారం మెరిసి పోతుంది. అయితే తుఫాన్ ప్రభావంతో ఆకాశం మేఘావృతం అవుతుండటంతో పత్తి రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. పంట మంచి దిగుబడి వచ్చిందని ఆనంద పడాలో కూలీల కొరతతో ఇంకా చేనుల్లోనే మగ్గిపోతుందని ఆందోళన చెందాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలోని ఓ రైతు చేనులో తెల్లబంగారం ఇలా చేనంతా తెల్లగా కనబడడంతో 'నినాదం' కెమెరా క్లిక్ మనిపించింది.

- అజ్మీరా డాకు నాయక్,
జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం న్యూస్)

# వైద్య ఆరోగ్య శాఖ పని తీరు మెరుగుపర్చుకోవాలి

- **అంగన్వాడి టీచర్ల నిక్షయ శిబిర ప్రోగాంను ?**
  **విజయవంతం చేయాలి**
- **ఆసుపత్రిలో సివిల్ పనులు సకాలంలో పూర్తి కావాలి**
- **వైద్య ఆరోగ్య శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్షి**
- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, డిసెంబర్17 (నినాదం):**ప్రజలకు చేరువయ్యేలా వైద్య ఆరోగ్య శాఖ పని తీరు మరింత మెరుగుపర్చుకోవాలని జిల్లా కలె క్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ పనితీరు పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో వైద్యారోగ్య శాఖ పనితీరు గత కొన్ని మాసాలుగా గణనీయంగా మెరుగైందని, ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా మన పని తీరు ను మెరుగుపరుచు కావాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. పెద్ద పల్లి జిల్లా ఆసుపత్రిలో అందిస్తున్న కంటి శస్త్ర చికిత్సలు, డెంటల్ సేవలు, ఆర్థోపె డిక్ సేవలు, ఫిజియోథెరపీ సేవలు, సైకాలజీ సేవలు, డయాగ్నొస్టిక్ హబ్ మొద లగు అంశాలను ప్రజలు విస్తృ తంగా వినియోగించేలా చూడాలని అన్నారు. క్షయ వ్యాధి నివారణ కోసం జిల్లాలో 100 రోజుల పాటు చేపట్టిన నిక్షయ శిబిర కార్యక్ర మం అమలు వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. అంగన్వాడి కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ వీలైనంత ఎక్కువ మంది క్షయ వ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించి పరీక్షల నిర్వహించాలని, నిక్షయ శిబిర ప్రోగాంను విజయవంతం చేయాలని కలెక్టర్ తెలి పారు.



ఆస్పత్రిలో గర్భిణీ మహిళలకు అందుతున్న 102 వాహన సేవలు పక్కాగా ఉండాలని అన్నారు. ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ తక్కు వగా నమోదయ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది క్షేత్రస్థాయి తనిఖీలు చేయాలని కలెక్టర్ సూచించారు. డెలివరీలకు సంబంధించి ఎం సి హెచ్ పోర్టల్‌లో వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, నవంబర్ 30 వరకు జరిగిన డెలివరీ ల వివరాలను డిసెంబర్ 31 లోగా అప్లోడ్ చేయడం పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదే శించారు. మన ఆస్పత్రులకు వచ్చే రోగులతో మన సిబ్బంది ప్రవ ర్తన సరిగా ఉండే విధంగా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు సిబ్బం దికి అవసరమైన శిక్షణ అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలని కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రుల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని, పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించా లని అన్నారు. జిల్లాలో ఆసుపత్రుల విస్తరణ అభివృద్ధి కోసం చేప ట్టిన వివిధ రకాల పనుల పురోగతి అంశాలను కలెక్టర్ రివ్యూ చేస్తూ సివిల్ పనులు నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ ఏజెన్సీఅధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అన్న ప్రసన్న కుమారి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంక్షేమ అధికారి వేణు గోపాల్ రావు, ప్రోగ్రాం అధికారులు, సంబంధిత అధికారులు, తది తరులు పాల్గొన్నారు.

## టాలీవుడ్ మరింత దగ్గరగా విజయ్‌సేతుపతి



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని విజయ్ సేతు పతి. ఈ స్టార్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం విడుదల పార్ట్ 2. కోలీవుడ్ దర్శకుడు వెట్రిమారన్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మక్కళ్ సెల్వన్ టీం ప్రమోషన్స్‌లో భాగంగా హైదరాబాద్‌లో సందడి చేసింది. కాగా సైరా నరసింహారెడ్డి సినిమాలో కీలక పాత్రలో నటించిన విజయ్ సేతుపతి.. లీడ్ రోల్‌లో డైరెక్ట్‌గా తెలుగు సినిమా మాత్రం చేయలేదు. ప్రమోషన్స్ సందర్భంగా విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చే విషయంపై క్లారిటీ ఇచ్చాడు. టాలీవుడ్ దర్శకులు సిద్ధం చేసిన కథలను వింటున్నానని.. తెలుగు సినిమా డెబ్యూకు అవకాశముందని హింట్ ఇచ్చేశాడు. టాలీవుడ్ డెబ్యూపై స్పందిస్తూ.. నేను అదే పనిలో ఉన్నా. త్వరలోనే అది జరుగవచ్చన్నాడు విజయ్ సేతుపతి. ఇప్పుడీ కామెంట్స్‌తో అభిమానులు, మూవీ లవర్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇదే నిజమైతే మరి విజయ్ సేతుపతిని తెలుగులో ఎలివేట్ చేసే ఆ దర్శకుడెవరన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాగా విడుదల పార్ట్ 2లో సూరి మరో ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. మంజు వారియర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# హీరోలకు అదొక హెచ్చరిక
## అల్లు అర్జున్ అరెస్టుపై సుమన్ కామెంట్



ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘట నకు సంబంధించిన టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు బన్నీ. అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఇప్పటికే దేశవ్యా ప్తంగా పలువురు సెలబ్రిటీలు తమ స్పందనను తెలియజేశారు. తాజా గా ఈ విషయమై సీనియర్ నటుడు సుమన్ స్పందించారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం సరైంది కాదన్నాడు సుమన్. థియేటర్ వాళ్లే హీరోలను పిలు స్తుంటారు. తనను కూడా అప్పట్లో పిలిచేవారని.. తాము ఎప్పుడొస్తారో చెబితే థియేటర్ వాళ్లు ఏర్పాట్లు చేస్తామంటారన్నాడు. హీరో వచ్చినప్పుడు అతడితోపాటు జనాల రద్దీని నియంత్రించే బాధ్యతంతా కూడా థియేటర్ యాజమాన్యానిదేనన్నాడు. హీరోను ఇలా అరెస్ట్ చేయడం తప్పన్న సుమన్.. ఏదేమైనా జరిగిన ఘటనను మార్చలేం. కానీ ఇక ముందు హీరోలకు హెచ్చరిక.. హీరోలు అలా వెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చూశాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను ప్రస్తుతానికి తాను కలవలేక పోతున్నానంటూ.. త్వరలో వారి కుటుంబాన్ని కలుస్తానని ఇప్పటికే ఎక్స్ ద్వారా క్లారిటీ ఇచ్చాడు అల్లు అర్జున్.

## అడివిశేష్‌తో మృనాల్
# ఠాగూర్ సినిమా
## డెకాయిట్ మూవీ ఫస్ట్ లుక్ వైరల్

టాలీవుడ్ హీరో అడివిశేష్ కాంపౌండ్ నుంచి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో ఉన్నాయని తెలిసిందే. వీటిలో ఒకటి డెకాయిట్ . షనీల్ డియో కథనందిస్తూ దర్శ కత్వం వహిస్తున్నాడు. అంతా అనుకున్నట్టుగా ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్‌ను ఫీ మేల్ లీడ్ రోల్‌లో ఫైనల్ చేశారు. చాలా రోజుల తర్వాత సస్పెన్స్‌కు తెరదించుతూ కొత్త లుక్ విడుదల చేశారు. డెకాయిట్ టీం కొత్త పోస్టర్‌లో మృణాల్ ఠాకూర్ ఓ చేత్తో స్టీరింగ్ తిప్పుతూ.. మరోచేతిలో పిస్తోల్ పట్టుకొని కనిపిస్తుంది. పక్కనే అడివి శేష్ సిగరెట్ వెలిగిస్తున్నాడు. అవును వదిలేసాను.. కానీ మనస్ఫూర్తిగా ప్రేమించాను.. అడివిశేష్‌కు బర్త్ డే విషెస్ తెలియజేసింది మృణాల్ ఠాకూర్. డెకాయిట్‌లో హీరోహీరోయిన్లిద్దరూ ఏదో మిషన్‌లో పాల్గొంటున్నట్టుగా ఉన్న తాజా పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీతోపాటు అంచనాలు అమాంతం పెంచేస్తుంది. ఈ ఏడాది ఫ్యామిలీ స్టార్, కల్కి 2898 ఏడీ చిత్రాల్లో మెరిసిన మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం నాలుగు హిందీ సినిమాల్లో నటిస్తోంది. అడివి శేష్ మరోవైపు వినయ్ కుమార్ దర్శకత్వం 'గూఢచారి' సీక్వెల్ 'జీ2'లో కూడా నటిస్తున్నాడు. ఈ మూవీ పోస్టర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌లపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.





# ఏడాదికో సినిమా
## చేయాలనుకుంటున్నా: అమీర్‌ఖాన్

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న స్టార్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు అమీర్ ఖాన్. ఇండస్ట్రీకి ఎన్నో సూపర్ హిట్స్ అందించిన అమీర్ ఖాన్.. చాలా రోజులుగా మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నాడు. తాజాగా ఓ చిట్‌చాట్ సెషన్‌లో ఈ స్టార్ హీరో చేసిన కామెంట్స్ అభిమానులు, ఫాలోవర్లలో ఫుల్ జోష్ నింపుతున్నాయి. ఓ నటుడిగా ఏడాదికో సినిమా చేయాలని అనుకుంటున్నానన్నాడు అమీర్‌ఖాన్. అంతేకాదు వచ్చే పదేళ్లలో మరిన్ని సినిమాలను నిర్మించాలనుకుంటున్నానన్నాడు. అంతేకాదు తన డ్రీమ్ ప్రాజెక్ట్ మహాభారత్‌ను తెరకెక్కించాలనుకుంటున్నట్టు చెప్పాడు. ఒకవేళ నేను ఈ సినిమా చేయగలిగితే.. ఈ ప్రాజెక్టుతో ప్రతీ భారతీయుడు గర్వపడేలా చేయాలని, భారత దేశం గురించి ప్రపంచానికి చూపించాల నుకుంటున్నానన్నాడు. అవార్డ్ షోలకు నో చెప్పడం గురించి ప్రశ్నించగా...

సినిమా అనేది సబ్జెక్ట్ ఓరి యెంటెడ్‌గా సాగుతుంది.. ప్రతీ సినిమా సొంత కథను కలిగి ఉంటుం దని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం సితారే జమీన్ పర్, కూలీ, లాహోర్ 1947 సినిమాలు అమీర్ ఖాన్ ఖాతాలో ఉన్నాయి. తలైవా నటిస్తోన్న కూలీ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుండగా.. సతారే జమీన్ పర్, లాహోర్ 1947 చిత్రాలకు నిర్మాతగా వ్యవహరిస్తు న్నాడు. 2022లో వచ్చిన లాల్ సింగ్ చద్దా సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. దీంతో హీరోగా కొత్త సినిమాలేమి ప్రకటించలేదు. మరి తాజా కామెంట్స్‌తో అమీర్‌ఖాన్ నుంచి ఇక బ్యాక్ టు బ్యాక్ సినిమాలుం డబోతున్నాయని అర్థం చేసుకోవచ్చు.

# తొలిసారి నాగచైతన్యను
# శోభిత అప్పుడే చూసిందంట..!



టాలీవుడ్ సెలబ్రిటీలు అక్కినేని నాగచైతన్య-శోభిత ధూళిపాళ్ల ఇటీవలే వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారని తెలిసిందే. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ ఇద్దరు తమ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను తాజాగా ఇంటర్వ్యూలో షేర్ చేసుకున్నారు. 2018లో నాగార్జున నివాసంలో నాగచైతన్య-శోభిత తొలిసారి కలిశారట. స్పై సినిమా గూడఛారిలో తన యాక్టింగ్‌కు ఇంప్రెస్ అయి చైతూ నాన్న నాగార్జున ఇంటికి ఆహ్వానించారని చెప్పింది శోభిత. ఇక సోషల్ మీడియాలో ఒకరినొకరు యాడ్ చేసుకున్న వీరిద్దరూ 2022లో మొదటి సారి చిట్ చాట్ చేశారు. ఆహారం పట్ల తమకున్న ఇష్టం, ప్రేమ గురించి నెట్టింట షేర్ చేసుకున్నారు. ఇద్దరూ ఎప్పుడు కలిసినా ఆహారం గురించి చర్చించుకునేవాళ్లమంది శోభిత. చైతూ తనను తెలుగులో మాట్లాడమని ఎప్పుడూ అడిగేవాడని.. తెలుగులో మాట్లాడటం వల్ల తమ రిలేషన్‌షిప్ మరింత బలపడిందని చెప్పింది. ఇక రెండు వారాల తర్వాత నాగ చైతన్య తనతో కలిసి లంచ్ చేయడానికి ఫ్లైట్‌లో ముంబైకి వచ్చాడని శోభిత పేర్కొంది. అది చాలా మనోహరమైన విషయం.

నేను నెట్టింట టెక్స్టింగ్ చేసేందుకు.. సోషల్ మీడియాలో కమ్యూనికేట్ చేయడానికి అభిమానిని కాదని.. అమెజాన్ ప్రైమ్ వీడియో ఈవెంట్‌లో తాము మళ్లీ కలుసుకున్నామని.. తాను రెడ్ డ్రెస్‌లో ఉండగా.. చైతూ బ్లూ సూట్‌లో ఉన్నాడంటూ చెప్పుకొచ్చింది చెప్పింది. తాము తొలిసారి ముంబైలోని ఓ కేఫ్‌లో కలుసుకున్నామన్న శోభిత.. అప్పుడు తాను ముంబైలో.. నాగచైతన్య హైదరాబాద్‌లో ఉండేవాళ్లమంది. తన కోసం చైతూ తరచూ హైదరాబాద్ నుంచి ముంబైకి వచ్చేవాడని తెలిపింది. ఇప్పుడీ కామెంట్స నెట్టింట వైరల్ అవుతున్నాయి. నాగచైతన్య ఫ్యామిలీ న్యూఇయర్ వేడుకలకు నన్ను ఆహ్వానించారు. ఆ తర్వాతి ఏడాదే చైతన్య తన కుటుంబాన్ని కలిశాడని చెప్పింది శోభిత. ఒకరినొకరు అర్థం చేసుకున్న తర్వాత ఈ ఏడాది గోవాలో పెళ్లి ప్రపోజల్ తీసుకొచ్చినట్టు చెప్పింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 80742 79741